Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com | Journalism first!

సంపుటి: 62 • సంచిక: 36 • గురువారం 15 ఫిబ్రవరి 2018 • విజయవాడ * పేజీలు: 22 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad



పాకిస్తాన్‌లోని పంజాబ్ వర్శిటీ విద్యార్థినులు ప్రేమికుల దినోత్సవానికి వ్యతిరేకంగా బుధవారం జరిపిన నిరసన ర్యాలీ

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: అమావాస్య రా. 12.15 వరకు; నక్షత్రం: శ్రవణం ఉ. 7.30 వరకు, అనంతరం ధనిష్ఠ ; అమృతకాలం: రా. 10.05 నుండి 11.50 వరకు; వర్జ్యం: ఉ. 11.50 నుండి 1.35 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.58 వరకు, తదుపరి మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు;



మిర్చిరైతు కంట్లో కారం

• డిమాండ్ ఉన్నా దక్కని మద్దతు ధర • వారంలోనే రూ.2 వేలు పడిపోయిన వైనం • ఆందోళనలో అన్నదాతలు • గత ఏడాదీ ఇదే పరిస్థితి • ఏపీలో లక్ష టన్నుల ఉత్పత్తి • తెలంగాణలో 87వేల టన్నులు • రోజూ లక్షలాది టిక్కీల సరకు మార్కెట్లకు • కనీస మద్దతు ధర ప్రకటించని ప్రభుత్వాలు • వ్యాపారులు, దళారుల రింగ్ • తెలుగు రైతుల నిలువుదోపిడీ

కాయ కష్టంచేశారు... ఉన్నదంతా ఊడ్చి ఖర్చు పెట్టారు... ఈసారైనా తమ కష్టాలు తీరుతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు... మద్దతు ధర లభిస్తుందని ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. కాని, పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మిర్చి రైతు గుండెల్లో మరోసారి మంటలు లేస్తున్నాయి. మార్కెట్ యార్డుల సాక్షిగా రైతు కష్టం దోపిడీకి గురవుతోంది. మరోసారి మిర్చి దగాకు తెరలేచింది. వ్యాపారులు, దళారులు కలిసి మిర్చి రైతును నిలువు దోపిడీ చేసేందుకు రింగ్ అవుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మిర్చికి మంచి డిమాండ్ ఉన్నా... రైతుకు ఏమాత్రం మద్దతు లభించడం లేదు... రైతుల నుండి తక్కువ ధరకే మిర్చిని కొనుగోళ్లు జరుగుతున్నాయి.

7 లో

కరెన్సీ కటకట...

రూ.5 వేల కోట్లు పంపండి

• పెన్షన్లు, వేతనాల చెల్లింపులకూ ఇబ్బంది • ఏటీఎంలు ఖాళీ • కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తక్షణమే ఐదువేల కోట్ల రూపాయల కరెన్సీని పంపించాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్, ప్రాంతీయ డైరెక్టర్లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక లేఖ రాశారు. నోట్ల రద్దు నాటి పరిణామాలు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్నాయని సిఎం పేర్కొన్నారు. ఏటిఎంలల్లో నగదు లేక ప్రజలు ఇబ్బందులు పడ్తున్నారని గుర్తు చేశారు. మరో వైపు ధాన్యం విక్రయించినప్పటికి డబ్బులు తీసుకోలేక రైతులు తంటాలు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. మళ్లీ నోట్లరద్దు నాటి పరిస్థితులు నెలకొనడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకించి రైతులు పడ్తున్న బాధలు వర్ణనాతీతం అన్నారు. తాజా పరిస్థితుల ఫలితంగా మార్చి ఒకటిన పెన్షన్లు, వేతనాల చెల్లింపుల్లో కూడా కటకట తప్పదన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు కూడా సతమతమవుతున్నారని వివరించారు. అనేక బ్యాంకులు కస్టమర్లను తమ వద్ద నగదు లేదంటు వెనక్కి తిప్పిపంపుతున్నాయని కేంద్రం దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని బ్యాంకులైతే పాక్షిక నగదు చెల్లిస్తామని చెబుతున్నాయని ముఖ్యమంత్రి ఆర్బీఐ గవర్నర్, రీజనల్ డైరెక్టర్, ఆర్థికమంత్రి జైట్లీ దృష్టికి తెచ్చినట్లు ఏపి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ డాక్టర్ సి కుటుంబరావు బుధవారం ఇక్కడ తెలియచేశారు.



బుధవారం జరిగిన సీఆర్‌డీఏ సమావేశంలో సీఎం చంద్రబాబు

జనంలోకి జగన్నాటకం!

వైకాపాది రాజీనామాల డ్రామా

• ఆమోదించరని తెలిసే ప్రకటన
• బూటకపు విధానాల్ని ఎండగట్టండి
• 2019లో తెదేపాదే గెలుపు
• మిత్రధర్మానికి కట్టుబడి ఉన్నాం
• అనివార్యమైతే కేంద్ర కేబినెట్ నుంచి తప్పుకుందాం
• కోర్ కమిటీ భేటీలో చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : హామీల అమలుపై న్యాయబద్ధంగా కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. హస్తినతో ఘర్షణ వైఖరి టీడీపీ అభిమతం కాదని పేర్కొన్నారు. ఎంపీలచే రాజీనామా చేయిస్తామంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చేస్తున్న ప్రకటనలు ప్రజలను మభ్యపెట్టడానికేనని అన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో ఆయన టీడీపీ కోర్ కమిటీ భేటీలో పాల్గొన్నారు. రాష్ట్రంలో తాజాగా నెలకొన్న పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ జగన్ విధానాలను ఎండగట్టే క్రమంలో ప్రజల్లో

➪ 2వ పేజీలో...

ప్రాజెక్టులు పూర్తయితేనే పెట్టుబడులు

• సీఆర్డీఏ సమీక్షలో చంద్రబాబు

2 లో

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు

రూ.11,400 కోట్ల కుచ్చుటోపీ!

• వజ్రాల రారాజు నీరవ్ మోడీ హస్తం • విదేశాల్లో సొంత ఖాతాలకు బదిలీ • సీబీఐకి పీఎన్‌బీ ఫిర్యాదు • నీరవ్, ఆభరణాల కంపెనీపై అభియోగం • బీఎస్ఈకి సమాచారం • భయం వద్దు... ఆర్థికశాఖ అభయం



5 లో



ఆసియా పల్ప్ అండ్ పేపర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో అతిపెద్ద

కాగిత పరిశ్రమ

• ఏర్పాటుకు ముందుకొచ్చిన ఏపీపీ • వ్యవసాయంలో బేయర్ సాంకేతికత • 22న కియా మోటార్స్ ఫ్రేమ్‌వర్క్

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రపంచంలోనే ప్రఖ్యాతి గాంచిన కాగితం తయారీ సంస్థ 'ఆసియా పల్ప్, పేపర్ (ఏపీపీ)' రాష్ట్రంలో అడుగు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. బుధవారం సచివా లయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసిన ఏపీపీ ప్రతినిధులు భారతదేశంలోనే అతిపెద్ద కాగిత తయారీ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసేందుకు తమ ఆసక్తిని వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున ముడిపదార్థాలను దిగుమతి చేసుకునేందుకు, చైనా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని తూర్పు తీరంలో ఉన్న ఏపీలో తమ సంస్థ నెలకొల్పాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకోసం ఏదైనా నౌకా తీరా నికి సమీపంలో 2,500 ఎకరాల భూమిని కేటాయించాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరారు. సీఎం దీనికి సానుకూలంగా స్పందిస్తూ కాకినాడ, మచిలీపట్టణం, కృష్ణపట్నం పోర్టు పరిసర ప్రాంతాలను పరిశీలించాల్సిందిగా సూచించారు. తమకు భూమిని కేటాయించిన రెండున్నరేళ్లలోనే ఉత్పత్తిని ప్రారంభిస్తామని ముఖ్యమంత్రికి ఏపీపీ ప్రతినిధులు వివరించారు. రోజుకు సరాసరి 4 వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ పరిశ్రమను నెలకొల్పుతామని ఇందులో నాలుగో వంతు దేశీయ విపణికే కేటాయిస్తామని చెప్పారు.

జర్మనీకి చెందిన ఆగ్రో కెమికల్స్ సంస్థ బేయర్ ఆంధ్రప్రదేశ్ రైతుల పంట సంరక్షణ, వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, డిజిటల్ ఫార్మింగ్ వంటి అంశాల్లో సహకారం అందించేందుకు ముందుకొచ్చింది. ఈమేరకు ముఖ్యమంత్రితో తమ ప్రతిపాదనలు ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. సన్న, చిన్నకారు రైతుల సంక్షేమమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, ఇప్పటికే సాగులో సాంకేతికతను మేళవించి ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని చంద్రబాబు వారికి చెప్పారు. భూసార పరీక్షల్లో అధునాతన పరికరాలు, సీసీ కెమేరాలు,

➪ 2వ పేజీలో...



టెట్ లోటుపాట్లపై

గంటా ఆగ్రహం

• అధికారుల తీరుపై అసంతృప్తి
• పరీక్షా కేంద్రాల కేటాయింపు లోపభూయిష్టం
• నేడు విజయవాడలో సమీక్ష

3 లో

బ్యాంక్ మేనేజర్ ఇంట్లో రూ.50 లక్షల విలువైన బంగారం చోరీ

వివరాలు 8లో...

ఔరా...!



ఎందుకు? ఎవరికి? దుగ్గరాజపట్నం!

• పోర్టుకు అనుకూల ప్రాంతం
• అయినా... అన్నీ ఆటంకాలే
• పులికాట్‌కు ఇబ్బంది లేదు
• తూపిలిపాలెంకు స్థల మార్పు
• రాకెట్ ప్రయోగాలకు అడ్డంకి కాదు
• గతంలోనే స్పష్టీకరించిన షార్
• సమీప పోర్టు ప్రగతికి ముప్పుకాదు
• సామాజిక వేత్తల విశ్లేషణ



దుగరాజపట్నం పోర్ట్ ఊహా చిత్రం

నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని బట్టి చూస్తుంటే దుగరాజపట్నం పోర్టు కథ కంచికి చేరినట్లు కనిపిస్తోంది. గత కాంగ్రెస్ ప్రభుత్వం పోర్టు ఏర్పాటుకు సంబంధించి ఇటు కేంద్రంలోను, అటు రాష్ట్రంలోను అవసరమైన అన్ని అనుమతులు ఇస్తూ పోర్టు నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. అయితే ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ దుగరాజపట్నం పోర్టు ఏర్పాటుపై ఆసక్తి చూపడం లేదు. గడిచిన నాలుగేళ్లలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో పోర్టు ఏర్పాటుకు సంబంధించి నిధుల కేటాయింపులు చేయలేదు. అందుకు బలమైన కారణాలు

➪ 7వ పేజీలో...



ముందస్తుకు పరీక్ష!

• కొత్త వ్యూహాలకు మోడీ-షా ద్వయం పదును • కీలకం కానున్న 8 రాష్ట్రాల ఎన్నికలు • రుతు పవనాలు, రబీ అంశాలూ కీలకమే • ముడి చమురు ధరల పెరుగుదలతో కలవరం

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలు? ముందస్తు ఎన్నికలు? ఈ రెండు అంశాలు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని సందిగ్ధంలో పడేశాయి. కాషాయ భారతమే లక్ష్యంగా బీజేపీని నలుదిశలా విస్తరిస్తున్న మోడీ-షా ద్వయం కొత్తవ్యూహాలకు పదునుపెడుతున్నారు. రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు ఏకకాల ఎన్నికలు, ప్రస్తుత తరుణంలో కాషాయ పార్టీకి లాభదాయకంగా ఉంటాయని అంచనా వేస్తున్నారు. జమిలి ఎన్నికల అవశ్యకతను రాష్ట్రపతి నుంచి ప్రధానమంత్రి దాకా పలు సందర్భాల్లో నొక్కి చెప్పారు. అయితే, ఈ ఆలోచన కార్యరూపం దాల్చాలంటే అనేక అడ్డంకులను అధిగమించాల్సి ఉంది. జమిలి ఎన్నికలతో ప్రయోజనాలున్నప్పటికీ, ఇప్పటికిప్పుడు అమలు సాధ్యం కాదన్నది నిపుణులు, విశ్లేషకుల వాదన. ఇప్పటికే పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి హడావుడి నిర్ణయాల అయోమయ పరిస్థితులు నేటికీ పూర్తిగా తొలగనే లేదు. ఇలాంటి సందర్భంలో జమిలికి చట్టపరమైన, పరిపాలనాపర ప్రతిబంధకాలను అధిగమించేందుకు సరిపడ సమయం లేదన్నది మరికొందరి అభిప్రాయం. జమిలి ఎన్నికల అంశాన్ని పక్కనబెడితే, రాజకీయ

➪ 7వ పేజీలో...



కియో మోటార్స్ సంస్థ ప్రతినిధులతో ముఖ్యమంత్రి



జర్మనీకి చెందిన బేయర్ ప్రతినిధులతో చంద్రబాబు భేటీ

రాష్ట్రంలో అతిపెద్ద కాగిత పరిశ్రమ

(మొదటిపేజీ తరువాయి)

డ్రోన్లసాయం తీసుకుంటున్నామని తెలిపారు. టమోటా పంటకు ప్రసిద్ధి చెందిన మదనపల్లిలో, మామిడి పంటకు ప్రఖ్యాతిగాంచిన చిత్తూరు జిల్లాలో ఉన్నఅవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సమగ్ర ప్రతిపాదనలతో నెల రోజుల్లోగా వస్తే ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు.

మరో ఏడాది యథాతథంగా సిమెంట్ సరఫరా

అటు వివిధ సిమెంట్ కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ నిర్మాణ పనులకు ప్రస్తుతం అందిస్తున్న ధరలకే మరో ఏడాదిపాటు సిమెంట్ సరఫరా చేస్తామని ప్రతినిధులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుకు కాస్త ధర తగ్గించే ప్రయత్నం చేయాలని ముఖ్యమంత్రి ఈసందర్భంగా సూచించారు. ప్రభుత్వానికి అందించేసిమెంటును పక్కదారిపట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు ఈనెల 22న జరిగే ఫ్రేమ్‌వర్క్ అమర్చే పనులను ప్రారంభించాల్సిందిగా ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా మోటార్స్ ఎండీ కుఖ్యూన్ షిమ్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

ఆర్టీజీతో అనుసంధానిస్తాం

- ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు వేగవంతం
- ఎస్సీ కాలనీలతో ప్రారంభం: మంత్రి లోకేష్



నీటి సరఫరా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి లోకేష్

అమరావతి, ఆంధ్రప్రభ: గ్రామాల్లోని ఎస్సీ కాలనీల నుండే ఎల్ఈడీ బల్బుల ఏర్పాటును ప్రారంభించాలని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. బుధవారం సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, నీటి సరఫరా అధికారులతో మంత్రి లోకేష్ సమీక్షనిర్వహించి గ్రామాల్లో ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచా యతీల్లో ఎల్ఈడీ బల్బుల ఏర్పాటును మరింత వేగవంతం చేయడానికి ప్రతి రోజూ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని స్పష్టంచేశారు. ఈ ఏడాది నవంబర్ నాటికి ఈఈఎస్ఎల్ కంపెనీ 10లక్షల ఎల్ఈడీ లైట్ల ఏర్పాటును పూర్తి చేయాలని సూచించారు. ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుకు గ్రామాల్లో కావల్సిన థర్డ్ వైర్‌ను వెంటనే ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ అంగీకరించిందని తెలిపారు. మార్చి 15లోపు అన్ని గ్రామాల్లో అవసరం ఉన్న చోట థర్డ్ వైర్ ఏర్పాటు పూర్తి కావాలన్నారు. ప్రతి రోజూ ఎన్ని లైట్లు వెలగడం లేదు, దానికి గల కారణాలు రియల్ టైం(ఆర్టీజీ)లో తెలిసే విధంగా డ్యాష్ బోర్డుకు సమాచారం అనుసంధానం చేసి వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం ఈఈఎస్ఎల్ ప్రతినిధులు మాట్లాడుతూ తూర్పుగోదావరి, చిత్తూరు, అనంతపురం, కడప, విజయనగరం జిల్లాలోని 5237 గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1,56,773 ఎల్ఈడీ లైట్లను అమర్చామని, 256 గ్రామా పంచాయితీల్లో నూరు శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. 1,56,773 ఎల్ఈడీ బల్బులను 1576 సిసిఎమ్ఎస్ బాక్సుల ద్వారా అనుసంధానం చేశామని, ఫిబ్రవరి 15 తేదీ నుండి ప్రతి రోజు 10వేల బల్బులు స్టాక్ అందుబాటులోకి వస్తుందన్నారు. అప్పటి నుండి ప్రతి రోజు 10వేల బల్బులు అమర్చే సామర్ధ్యానికి చేరుకుంటామన్నారు. ఈసమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, నీటి సరఫరా అధికారులతోపాటు ఈఈఎస్ఎల్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతుల స్వీకరించిన మంత్రి లోకేష్

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి తనని కలవడానికి వచ్చిన ప్రజలను రాష్ట్ర మంత్రి లోకేష్ బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో కలిశారు. వారి నుండి వినతుల స్వీకరించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



మౌలిక ప్రాజెక్టులు పూర్తయితేనే పెట్టుబడులు

- పనుల్లో వేగం పెంచండి
- డ్రోన్ల సహకారంతో పర్యవేక్షణ
- అలసత్వాన్ని ఉపేక్షించను
- సీఆర్డీఏ సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి ఆంధ్రప్రభ: రాజధాని నిర్మాణ పనుల్లో వేగం పెరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు.అన్ని పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం ఆయన సిఆర్డీఏ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. తాజా పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నిర్మాణ సంస్థలను నిరంతరం పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణ పనుల పర్యవేక్షణకు డ్రోన్లను వినియోగించుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణం, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజె క్టులు సకాలంలో పూర్తి సంబంధించిన మెటీరియల్, యంత్ర సామాగ్రి తదితరాలకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే ఎప్పటికపుడు తనకు తెలియచేయాలని సిఎం కోరారు. పనులు జరుగుతున్న తీరుని నిత్యం పర్య వేక్షించాలని కూడా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కాగా రాజధాని పరిధిలో చేపట్టిన రోడ్లు, సీనరేజ్, విద్యుదీకరణ పనులపై కూడా సమీక్ష జరిగింది. రాజధాని అమరావతి పరిధిలో రోడ్ల నిర్మాణాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను సమావేశంలో నొక్కి చెప్పారు. ఇందుకు సంబంధించి చంద్రబాబు పనులలో అలసత్వం కూడదంటు హెచ్చరించారు. అంతేగాకుండా సిఆర్డీఏ పరిధిలో తూర్పు నుంచి పశ్చిమం మధ్య 16 రోడ్లు, పశ్చిమం నుంచి ఉత్తరం మధ్య 18 రోడ్ల నిర్మాణాలు చేపట్టే విషయమై కూడా లోతుగా చర్చ జరిగింది. 34 మేజర్ రోడ్లకు ఇప్పటికే 24 రోడ్లకు సంబంధించి టెండర్ల వ్యవహారంపై సమావేశంలో చర్చించారు. పనులు కూడా ప్రారంభించిన విషయాన్ని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. రోడ్ల నిర్మాణాలు చేపట్టిన కంపెనీలు ఎటువంటి యంత్రసామాగ్రి వినియోగిస్తున్నది కూడా ముఖ్యమంత్రి ఆరా తీశారు. వారం రోజుల్లోగా రోడ్ల నిర్మాణాలపై సమగ్ర వివరాలు అందచేయాలని ఆదేశించారు. 2018 సంవత్సరం చివరి నాటికి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. రోడ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నప్పటికి కొందరు అనవసరమైన ఆరోపణలు చేస్తున్న విషయం సమావేశం దృష్టికి వచ్చింది. 34 రోడ్ల నిర్మాణాలను పూర్తి చేసే విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మిగిలిన పది మేజర్ రోడ్లకు టెండర్లు పిలిచే పనులు ప్రారంభించడం, రైతుల నుంచి సేకరించిన భూముల్లో చేపట్టిన రోడ్లు, ఇతర నిర్మాణాలకు సంబంధించి కూడా చర్చ జరిగింది. డిసెంబర్ నాటికి ఇళ్ల నిర్మాణాల పనులు పూర్తి చేయడంతో పాటు ఏప్రిల్ నెలలోగా మొదటి స్లాబ్ పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి సంబంధిత కాంట్రాక్టర్ హామీ ఇచ్చారు. ఐఎఎస్, గజిటెడ్, నాన్ గెజిటెడ్, గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4 ఉద్యోగుల కోసం 3540 ఇళ్ల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని తెలిపారు.

డ్రోన్లతో పర్యవేక్షణ

రాజధాని నిర్మాణ పనులను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి అన్నారు. పదిహేను రోజులకు ఒకసారి డ్రోన్లతో తీసిన చిత్రాలను తనకు చూపించాలని ఆదేశించారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేస్తేనే పెట్టుబడి దారులు ముందుకు వస్తారని తెలిపారు. పనులకు సంబంధించిన యంత్రసామాగ్రి విషయంలో ఇబ్బందులు ఉంటే ఎప్పటికపుడు తెలియచేయాలని అన్నారు. ఈ సమావేశంలో సిఆర్డీఏ, ఏడిసి అధికారులు, సర్వీసు ప్రొవైడర్ల సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ ఎంపీ సెగ్మెంట్లపై బాబు ఆరా

- అభివృద్ధి పనులు, సమస్యలపై ముఖ్యమంత్రి సమీక్షలు



అమరావతి, ఆంధ్రప్రభ: వైసీపీ ప్రాతనిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గాలపై టీడీపీ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఏప్రిల్‌లో పదవులకు పార్టీ ఎంపీలు రాజీనామా చేస్తారయూ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో టీడీపీ అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలోనే ఆయా పార్లమెంటరీ నియోజక వర్గాలో పార్టీ పరిస్థితులపై సమీక్ష చేయాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఒకవేళ వైఎస్సార్ సిపి ఎంపీలు రాజీనామా చేసిన పక్షంలో వచ్చే ఎన్నికల కోసం పూర్తిస్థాయిలో సమాయత్తమయ్యే విధంగా టిడిపి సిద్ధం చేయాలని నిర్ణయించారు. గత మూడున్నర సంవత్సరాలలో ఎంపీ నియోజక వర్గంలో జరిగిన కార్యక్రమాలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించాలనిముఖ్యమంత్రి సంకల్పించారు. ఈ పరిస్థితులలోనే బుధవారం రాజంపేట, కడప పార్లమెంటరీ నియోజక వర్గాలపై సమీక్షించడం జరిగింది. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఒకవేళ వైసీపీ ఎంపీలు రాజీనామా చేసిన పక్షంలో అనుసరించానున్న వ్యూహంపై కూడా చర్చించారు. అయితే తిరుపతి, ఒంగోలు, నెల్లూరువంటి నియోజకవర్గాలపై కూడా తాజా పరిస్థితిని సమీక్షించనున్నారు. టిడిపి ప్రాతి నిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజక వర్గాలలో కూడా ఇప్పటికే సమీక్షచేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ భేటీలలో పార్లమెంటరీ నియోజక వర్గ ఇన్‌చార్జ్‌లతో పాటు, జిల్లా ఇన్‌చార్జ్‌లను కూడా భాగస్వాములను చేస్తున్నారు.

పార్లమెంటరీ నియోజక వర్గ సమావేశంలో ప్రధానంగా అభివృద్ధి పైనే దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. ఈ సమావేశంలలో ప్రాధాన్యతా ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులపై ఆరా తీయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఇటీవల జరిగిన కర్నూల్ జిల్లా టిడిపి నేతల భేటీలలో కూడా ముఖ్యమంత్రి ఇదే రకమైన అభిప్రాయాన్ని నేతల వద్ద ప్రస్తావించారు. మరో సమావేశం నాటికి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసే విధంగా చొరవ తీసుకొవాలని కోరడం జరిగింది. టిడిపి నేతలు కూడా పలు ప్రతిపాదనను చేశారు. ఎన్నికల కొడ్ వచ్చే నాటికి అభివృద్ధి పనులన్నీ పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకొవాలని కోరారు.

ప్రణాళికాబద్ధంగా నగరాలు



- నిబంధనలకు తూట్లు పొడిస్తే చర్యలు
- కీలకం కానున్న సీఆర్డీఏ నివేదిక
- బెజవాడ వివాదంపై ముఖ్యమంత్రి ఆగ్రహం

అమరావతి ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో నగరాల నిర్మాణం ప్రణాళికాబద్ధంగా జరగాలని, నగరాల నిర్మాణంలో నిబంధనలకు తూట్లు పొడిచే విధంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించబోనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులతో పలు దఫాలుగా జరిపిన చర్చల్లో హెచ్చరించారు. సీఆర్డీఏ పరిధిలో అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని నిర్మాణం చేపట్టాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యంగా ఉంది. ఈ తరహా రాజధాని నిర్మాణంలో ఎక్కడ నిబంధనల ఉల్లంఘనలు జరిగినా ఎవర్నీ ఉపేక్షించవద్దని మంత్రి నారాయణతో సహాసంబంధిత ప్రభుత్వ శాఖల బాధ్యులకు ముఖ్యమంత్రి ఇప్పటికే చెప్పకనే చెప్పారు కూడా. రాజధానిని అద్భుత నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి కలలు కంటున్న తరుణంలో రాజధాని నగరం విజయవాడలో తెలుగుతమ్ముళ్లు మేయర్ శ్రీధర్‌పై ధ్వజమెత్తిన అంశంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అసలు విజయవాడ నగరపాలకసంస్థలో ఏం జరుగుతోంది..? పట్టణ ప్రణాళిక విభాగంలో ఇళ్ల ప్లాన్ల మంజూరును ఆన్‌లైన్ పద్ధతిలో మార్చేశాక..దరఖాస్తులు ఎన్నింటిని తిరస్కరించారు..? తిరస్కరించడం వెనుక ఏం జరిగింది..? అసలు ప్లాన్లే లేకుండా ఎన్ని నిర్మాణాలు జరిగాయి..? సంబంధిత అధికారులు ఎన్ని నిర్మాణాలపై చర్యలు తీసుకున్నారు..? వంటి అంశాలకు సంబంధించి పురపాలకశాఖ మంత్రి నారాయణ మొత్తం అన్ని వ్యవహారాలపై సమగ్రంగా సర్వే చేయాలని సీఆర్డీఏ అధికారులను గతంలో ఆదేశించారు. ఆ మేరకు రంగం లోకి దిగిన సీఆర్డీఏ అధికారులు విజయవాడ లోని అనేక ప్రాంతాల్లో భవనాల నిర్మాణాలకు సంబంధించి పూర్తి స్థాయి సర్వే కొద్దిరోజుల క్రితం నిర్వహించారు. ఇందుకు సంబంధించి ఎక్కడెక్కడ ఏమేం జరిగింది..? అక్రమ భవంతుల నిర్మాణాలకు ఏయే ప్రాంతాల్లో ప్రోత్సాహం అందించింది ఎవరెవరు..? అన్న అంశాలకు సంబంధించి సిఆర్డీఏ అధికారులు నివేదికను రూపొందించారని తెలిసింది. అతిత్వరలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ..రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల నేపధ్యంలో కొందరు తెలుగుతమ్ముళ్ల వ్యవహారశైలి ముఖ్యమంత్రికి తలనొప్పిగా మారింది. ఇక సీఆర్డీఏ అధికారుల నివేదిక ఇప్పటికే మంత్రి నారాయణ వద్దకు చేరిందని తెలిసింది. ఈ నివేదిక అంశాలను బహిర్గతం చేయకున్నా..నివేదికలో పేర్కొన్న విషయాలపై విచారణ జరపడం ఖాయమని అధికార వర్గాల సమాచారంగా ఉంది.

చేయడంలో ఎవరు విఫలమైనా ఉపేక్షించబోనని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను సున్నితంగా హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ సహకారం తీసుకుని ప్రతి రెండు వారాలకు ఒకసారి డ్రోన్లతో తీసిన చిత్రాలను తనకు తప్పనిసరిగా చూపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేస్తే పెట్టుబడిదారులు ముందుకు వస్తారని అభిప్రాయపడ్డారు. పనులకు

ఒకే వేదికపైకి ప్రభుత్వ శాఖలు

- ఈ-ప్రగతితో ఆర్టీజీని అనుసంధానం చేయాలి
- పాలనను ప్రజలకు చేరువ చేయాలి
- సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: రియల్ టైం గవర్నెన్స్ (ఆర్టీజి)తో ఈ ప్రగతిని అనుసంధానం చేయాలని దీనివలన మంచి ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగానికి సూచించారు. బుధవారం రాత్రి ఆయన తన నివాసంలో ఈ-ప్రగతి పై అధికారులతో సమీక్షించారు. సీఎం మాట్లాడుతూ ఆర్టీజీ ద్వారా ఈ-ప్రగతిని మరింత పటిష్టంచేయాలని ఆదేశించారు. ముప్పైకి పైగా ప్రభుత్వ శాఖలు, 130 ప్రభుత్వ విభాగాధిపతి కార్యాలయాలు, ఎనిమిది వందల సూచికలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఈ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయాలని దిశానిర్దేశం చేశారు. 15శాతం స్థిర వృద్ధి సాధనకు చర్యలు ఎంతోగానే దోహదపడతాయన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న వినూత్న సంక్షేమ కార్యక్రమాలు పారదర్శక పాలనకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించు కన్న తీరును ప్రముఖ పారిశ్రామిక వేత్త, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబాని కొనియాడిన విషయాన్ని సిఎం గుర్తు చేశారు. ప్రభుత్వం వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, చేపడుతున్న చర్యలను అధికారులకు, ప్రజలకు తెలిసేలా చేసేందుకు విరివిగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమీక్షలో ఐటి ముఖ్యకార్యదర్శి విజయానంద్, ఈ ప్రగతి సీఈవో బాల సుబ్రహ్మణ్యం, ఆర్టీజి సీఈవో బాబు ఎ, ముఖ్యమంత్రి కార్యదర్శి గిరిజా శంకర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతో మాజీ క్రికెటర్ లక్ష్మణ్ భేటీ



అమరావతి, ఆంధ్రప్రభ: భారత మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఈ సందర్భంగా లక్ష్మణ్ క్రీడలకు, క్రీడాకారులకు సిఎం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అభినందించారు. గతంలో తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు అనేక జాతీయ, అంతర్జాతీయ క్రీడా అకాడమీలు ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు కోసం కృషిచేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా ప్రస్తుత సమయంలో నవ్యాంధ్రను అభివృద్ధి బాటలో నడిపిస్తున్న సీఎం నవ్యాంధ్రలో యువ క్రికెట్ క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుదనే ఆశ భావాన్ని వ్యక్తం చేశారు.

జనంలోకి జగన్నాటకం!

(మొదటిపేజీ తరువాయి)

విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నప్పటికీ 2019లో జరగనున్న సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రావడం ఖాయం అనే ధీమాను వ్యక్తం చేశారు. ఏప్రిల్‌లో ఎంపీ పదవులకు రాజీనామా చేయడమనేది బూటకమని అన్నారు. ఒకసారి రాజీనామాలు సమర్పించిన అనంతరం వివరణలు అడగడానికే ఆరు నెలల సమయం పడుతుందని, ఎన్నికలు మరో ఆరు నెలలు ఉండగా రాజీనామాలను ఆమోదించేఅవకాశాలు ఉండబోవని ఆయన టీడీపీ నేతలతో అన్నారు. రాజీనామాలు ఆమోదించరని తెలిసి కూడా ఆ పార్టీ అధినేత నాటకాలు ఆడుతున్నారని వాటిని ప్రజా బాహుళ్యంలోకి వెళ్ళి తిప్పికొట్టాలన్నారు. అనివార్యమైన పరిస్థితుల్లో కేంద్ర కేబినెట్ నుంచి టీడీపీ మంత్రులు తప్పుకోవడానికి సిద్ధమేననే సంకేతాలు ఇచ్చిన ముఖ్యమంత్రి మళ్లీ పార్లమెంట్ సమావేశాలు జరిగిన అనంతరం సందర్భాన్ని బట్టి సమయానుకులంగా నిర్ణయం తీసుకోవచ్చని అన్నారు. ఇప్పటికి మిత్రధర్మం కాపాడుకుంటూనే ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనేదే టీడీపీ ప్రగాఢ ఆకాంక్ష అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో ఏ మేరకైన ఒత్తిడి తెచ్చే విషయంలో వెనుకంజ వేసేది లేదని చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. బీజేపీతో లాలూచీ పడినందు వల్లే విలువలకు తిలోదకాలు ఇచ్చి వైఎస్సార్‌సీపీ కొత్త నాటకానికి తెరలేపిందని అన్నారు. విభజన చట్టంలోని అంశాలను నెరవేర్చాలని చట్టబద్ధంగా కేంద్రంపై, ప్రధాన మంత్రిపై ఒత్తిడి తేవడంలో పొరపాటు ఏముందని ప్రశ్నించారు. ఇప్పటికే పలుమార్లు రాజీనామా బెదిరింపులు చేశారని, ఈ డ్రామాలకు తెరదించాల్సిన అవసరం ఉందన్నారు. కేసులపై లాలూచీ పడి రాష్ట్ర ప్రయోజనాలను జగన్ పార్టీ తాకట్టు పెడుతోందని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో ప్రత్యేక హోదాపై అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ స్పష్టమైన హామీని ఇచ్చారని ఐదేళ్ల పాటు హోదా వర్తించే విధంగా అమలు చేయాలంటూ నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా అడగలేనప్పుడు ప్రతిపక్ష స్థాయిలో వైఎస్సార్‌సిపి ఎలా కొనసాగుతుందని అన్నారు. పదవుల కోసం కక్కుర్తి పడి కేంద్ర ప్రభుత్వంలో కొనసాగాల్సిన అవసరం లేదని స్పష్టం చేసిన చంద్రబాబునాయుడు, 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కలిసి పోటి చేసినందువల్లే ఉమ్మడి హామీలను అమలు చేయాలంటూ రాష్ట్ర ప్రజల తరుపున అడిగే హక్కు ఏపీ ప్రభుత్వానికి లేదా అని అన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి ఓపిక పట్టామని రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు పార్లమెంట్ సభ్యులే స్వచ్ఛందంగా పార్లమెంట్ సమావేశాల్లో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం పట్ల ప్రశంసించారు. జగన్‌ది అంతా నేర చరిత్ర అని కేసుల కోసం సిబిఐ, ఈడీలకు భయపడి సోనియా కాళ్లు పట్టుకున్న వ్యక్తికి ఏపీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు.

అంబానీ అంశం ప్రస్తావన

రిలయన్స్ గ్రూప్ సంస్థల అధినేత అమరావతికి రావడంపై ముఖ్యమంత్రి కోర్ కమిటీ భేటీలో ప్రస్తావించారు. రిలయన్స్ లాంటి దిగ్గజ సంస్థ నవ్యాంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల కోసం సానుకూల దృక్పథంతో ఉండడం విశేషమేనని అన్నారు. ధీరూభాయ్ అంబానీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అంబానీ రాష్ట్రంపై ఉన్న ప్రత్యేకమైన అభిమానంతో పరిశ్రమల స్థాపనకు ముందుకు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తిరుపతికి జియో కంపెనీ, 150 ఎకరాలలో ఎలక్ట్రానిక్స్ పార్కు, 5 వేల గ్రామాల్లో సిటిజన్ సెంటర్లు, పెద్దాపురంలో సోలార్ ప్లాంట్, అమరావతిలో డిజిటల్ ఇన్‌ఫ్రా, టెలికాం, ఐటీ అభివృద్ధి, సాగు, విద్య, వైద్యంలో పెట్టుబడి, స్మార్ట్ అమరావతికి సహకారం వంటి పలు కీలకమైన అంశాలపై సమావేశంలో చంద్రబాబు నేతలకు వివరించారు.

బడ్జెట్‌ను మదింపు చేయండి...

సమావేశంలో బడ్జెట్‌పై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. భారీగా వివిధ శాఖల నుంచి ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిసిందని అయితే ఈ నెల 10వ తేదీ నుంచి ఆర్థికశాఖతో జరపనున్న సమావేశంలో బాగా ప్రాధాన్యత ఉన్న అంశాలపైనే దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అయితే 2018-19 వార్షిక బడ్జెట్ గత బడ్జెట్ కన్నా అధికంగా ఉంటుందన్న సంకేతాలను ఇచ్చారు. నామినేటెడ్ పదవులపై స్పందిస్తూ ఇప్పటికే ఇందుకు సంబంధించిన కసరత్తు దాదాపు పూర్తి కావచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టీడీపీ సంస్థాగత నిర్మాణంపై కార్యాచరణకు దిగాలని టీడీపీ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కోర్ కమిటీ భేటీలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వర రావు, నక్కా ఆనందబాబు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కె.అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

పెట్టుబడులు కూడా దక్కడంలేదు

- జగన్‌కు వేరుశనగ రైతుల వేడుకోలు



కృష్ణారెడ్డిపాళెం గ్రామం వద్ద ఎండిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జగన్

నెల్లూరు, ప్రభ న్యూస్ బ్యూరో: ప్రజాసంకల్పయాత్ర ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం మండలానికి చేరుకుంది. బుధవారం కలిగిరి శివారు ప్రాంతంనుంచి జగన్ పాదయాత్రను ప్రారంభించి మండల పరిధిలోని కృష్ణారెడ్డిపాళెం, కుడుముల దిన్నె పాడు, చిన్నన్నలూరు గ్రామాలమీదుగా ఆయన కొండాపురం మండలం మామిడివారిపాళెం, ఆదిమూర్తిపురం చేరుకున్నారు. పలు గ్రామాల్లో ప్రజలు ప్రజాసంకల్ప యాత్రకు బ్రహ్మరధం పట్టారు. అంతకుముందు ఆయన కలిగిరి, కొండాపురం మండలాల పరిధిలో రైతులు సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. అయితే అనేక ప్రాంతాల్లో పంటలకు పూర్తి స్థాయిలో నీరందక వేరుశనగ నిలువునా ఎండిపోతున్నాయి. ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు జగన్‌కు ఎండిన పంటను చూపించి పెట్టుబడులు కూడా దక్కడం లేదని పలువురు రైతులు ఆయనముంది తమ గోడు వెళ్ళబుచ్చుకున్నారు. యాత్రలో ఆయనవెంట నెల్లూరు పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు మేకపాటి గౌతమ్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, పోలుబోయిన అనీల్ కుమార్ యాదవ్, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు వాసురెడ్డి పద్మ తదితరులు ఉన్నారు.

టెట్ లోటుపాట్లపై గంటా ఆగ్రహం

• అధికారుల తీరుపై అసంతృప్తి • పరీక్షా కేంద్రాల కేటాయింపు లోపభూయిష్టం
• హాల్ టిక్కెట్లలో తప్పులపై అధికారులకు మంత్రి క్లాస్ • నేడు విజయవాడలో సమీక్ష



అమరావతి, ఆంధ్రప్రభ : ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ నిర్వహణకు సంబంధించిన లోటుపాట్లపై రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రాల కేటాయింపుల్లో పొరపాట్లు చోటు చేసుకోవడం పై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మంత్రి గంటా సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్షా కేంద్రాల కేటాయింపులో అభ్యర్థులను ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ నిలదీశారు. ఏ జిల్లా నుంచి అభ్యర్థి దరఖాస్తు చేస్తే ఆ జిల్లాలో కాకుండా ఒక మూల నుంచి మరో మూలకు విసిరేయడం ఏమిటని గట్టిగా నిలదీశారు. పరీక్ష కేంద్రాలను మార్చుకునేందుకు అంతరాష్ట్ర విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ అవకాశం కల్పించినా రాష్ట్రంలోనే దూర ప్రాంతాలకు వేసిన వారి గురించి ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. తొలిసారి ఆన్‌లైన్‌లో టెట్ పరీక్ష నిర్వహిస్తున్నందున ఏ చిన్న పాటి పొరపాటుకు తావివ్వొద్దని పదే పదే చెబుతున్నా ఆలసత్వం కనబరుస్తుండడ సరికాదని హెచ్చరించారు. టెట్ నిర్వహణ లోపాలు, ఇతర అంశాలపై గురువారం విజయవాడలో మంత్రి గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన సమీక్షా సమావేశం జరపాలని నిర్ణయించారు. ఈనెల 21 నుంచి మార్చి మూడో తేదీత వరకు ఆన్‌లైన్‌లో టెట్ పరీక్ష నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.హాల్ టిక్కెట్ల డౌన్ లోడ్‌కు సంబంధించి ఇబ్బందులు తొలగిపోయాయని సంబంధిత అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. హాల్ టిక్కెట్లలో తప్పిదాలపై అభ్యర్థుల నుంచి ఫిర్యాదులు వస్తోన్న విషయాన్ని మంత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పరీక్షా కేంద్రాల కేటాయంపులో ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ఏంటని మంత్రి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దరఖాస్తులో ఆప్షన్లు పెట్టకపోయినా, కొందరు విద్యార్థులకు పక్క రాష్ట్రాల్లో, మరికొందరికి రాష్ట్రంలోనే వందల కిలో మీటర్ల దూరంలో పరీక్షా కేంద్రాలు కేటాయింపు ఎందుకు జరిగిందని ప్రశ్నించారు. ప్రభుత్వం ముందు నుంచి ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తూ వస్తున్నా అవేవి పట్టించుకోకుండా ఇష్టానుసారం ప్రవర్తిస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కరెక్ట్ కాదన్నారు. ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అంటూ విరుకుపడ్డారు.హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్ దగ్గర నుంచి అనేక లోపాలు వెలుగులోకి వస్తున్నాయని, ఇదంతా ఏమిటని ప్రశ్నించారు.హాల్ టిక్కెట్లు లోపాభూయిష్టంగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిని సత్వరమే సవరించుకోవాలని ఆదేశించారు.ఇందుకు సంబంధించి గురువారం విజయవాడ సమావేశంలో సంపూర్ణంగా చర్చించి,లోటుపాట్లపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ తరహా నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం సహించేది లేదని కూడా మంత్రి గంటా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను దక్కించుకున్న ప్రైవేట్ సంస్థ సమర్థత, ఇతర అంశాలను చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంటా హాల్‌టిక్కెట్లలో దొర్లిన తప్పులపై అధికారులను నిలదీశారు. ఇలా ఎందుకు జరిగిందో క్లారిటీ కావాలని అడిగారు. గురువారం నాటి సమావేశానికి పూర్తి వివరాలతో రావాలని మంత్రి గంటా సంబంధిత అధికారులను ఆదేశించారు. కాగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) సంబంధించిహాల్ టిక్కెట్ల డౌన్ లోడ్‌లో ఇబ్బందులు ఎదురు కావడంతో అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మంత్రులకు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. అధికారులు చేసిన తప్పిదాలకు తాము బలికావాల్సి వస్తుందని ఆవేధన చెందుతున్నారు. ఫిబ్రవరి 10వ తేదీ నుంచి హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్‌కు విద్యాశాఖ షెడ్యూల్ విధించినా శని వారం మధ్యాహ్నం వరకు కూడా కమిషనర్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఏపీ వెబ్‌సైట్‌లో హాల్ టిక్కెట్లు అప్‌లోడ్ కాని సంగతి తెలిసిందే. తీరా 11 వ తేదీ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్ లోడ్ అవుతున్నా, తప్పులు తరకగా ఉండడంతో మరింత ఆందోళన చెందుతున్నారు.చిరునామాలు,ఫోటోలు, ఇతర అంశాల్లో ఇబ్బందులు తలెత్తున్నాయి. మొదటి నుంచి కూడా టెట్ పరీక్షపై నిర్లక్ష్య వైఖరి కొనసాగుతూనే ఉంది.మూడు సార్లు టెట్‌షెడ్యూల్ మార్చారు. ఆప్షన్లమార్పు విషయంలో కూడా ఇబ్బందిపడ్డారు. ఆన్‌లైన్‌లో పరీక్షను నిర్వహించే బాధ్యతను తీసుకున్న ప్రైవేట్ సంస్థకు పరీక్షా కేంద్రాల ఏర్పాటులో కూడా సమస్య తలెత్తడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ఆన్‌లైన్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. ఈ సంస్థకు రాష్ట్రంలో 175 వరకు పరీక్షా కేంద్రాలున్నాయి. అభ్యర్థులకు పరీక్ష నిర్వహించేందుకు ఈ సెంటర్లు సరిపోవని ఉన్నతాధికారులు తాజాగా భావిస్తున్నట్లు సమాచారం. టెట్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 4,46,833 మంది దరఖాస్తు చేశారు. మొదటి నాలుగు రోజులు పపర్ -1కు, ఆ తర్వాత పేపర్ -2, పేపర్ -3 పరీక్ష నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. పేపర్ -2కు 2,12,794 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.ఈ పరీక్షల్లో పరీక్షను ఎలా నిర్వహించాలనే దానిపై అధికారులు ఇప్పుడు సమీక్షలు చేపట్టారంటున్నారు. ముందు నుంచే సన్నద్ధంగా ఉండాల్సిన అధికారులు హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడ్ వరకూ సరైన సమీక్ష నిర్వహించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు తెలంగాణ రాష్ట్ర డీఎస్సీ,ఏపీ టెట్ పరీక్షలు ఒకే సమయంలో కొనసాగడంతో ఇరు రాష్ట్రాల అభ్యర్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. 20 శాతం కోటాలో ఉభయ రాష్ట్రాల అభ్యర్థులు ఈ పరీక్షలు రాసేందుకు అవకాశముంది. ఏపీ టెట్ పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఉపాధ్యాయ శిక్షణార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాల్ టిక్కెట్ డౌన్ లోడ్ సమయంలో ఈ ఇబ్బందులేమిటని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్న నేపథ్యంలో మంత్రి గంటా శ్రీనివాసరావు గురువారం విజయవాడలో అధికారులతో సమావేశం అవుతున్నారు. ఈ సమావేశంలో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందంటున్నారు.

200 'అన్న' క్యాంటీన్లు

• మంత్రి నారాయణ



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో 200 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖామంత్రి పి.నారాయణ తెలిపారు. తొలివిడతగా లక్షజనాభాపైబడిన 33 మున్సిపాల్టీల్లో మొదటి విడతగా అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాంటీన్లకు సొంత భవనాలు నిర్మించనున్నామన్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన బుధవారం జరిగిన సీఆర్డీఏ సమావేశంలో పలు విషయాలపై చర్చించిన అంశాలను అనంతరం మంత్రి నారాయణ సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూన్ 2 నుంచి రాష్ట్రంలో లక్ష జనాభా పైబడిన 33 మున్సిపాల్టీల్లో అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. తమిళనాడులో అమ్మ క్యాంటీన్లు, కర్నాటకలోని బెంగుళూరులో ఇందిరా క్యాంటీన్ల పనితీరును స్వయంగా పరిశీలించినట్లు మంత్రి తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు బెంగుళూరు అధికారులతో క్యాంటీన్ల నిర్వహణపై చర్చించినట్లు చెప్పారు. పూర్తిస్థాయి వివరాలను శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. బెంగుళూరు తరహాలో ఏపీలోనూ అన్న క్యాంటీన్లకు సొంత భవనాలు నిర్మించాలని నిర్ణయించినట్లు వివరించారు. కూలీలు, కార్మికులకు అందుబాటులో ఉండేలా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాజధాని పరిధిలో చేపట్టిన రోడ్లు, ఉద్యోగుల ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సమావేశంలో సీవరేజ్, విద్యుద్దీకరణ పనులపై సమీక్ష జరిపినట్లు చెప్పారు.

రాజధాని అమరావతి పరిధిలో చేపట్టిన రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. సీఆర్డీఏ పరిధిలో ఈస్ట్ నుంచి వెస్ట్ మధ్య 15 రోడ్లు, సౌత్ నుంచి నార్త్ మధ్య రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఈ 34 మేజర్ రోడ్లకు ఇప్పటికే 24 రోడ్లకు టెండర్లు పిలిచి, పనులు కూడా ప్రారంభించామన్నారు. పనులు జరుగుతున్న తీరును ఇటీవల సీఎం చంద్రబాబు హెలికాప్టర్ ద్వారా పరిశీలించినట్లు పేర్కొన్నారు. వారం రోజుల్లో రోడ్ల నిర్మాణాలు జరిగిన తీరుతెన్నులపై వివరాలను అందజేయాలని, అలాగే ఈ ఏడాది చివరికల్లా రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సీఆర్డీఏ సమావేశంలో సీఎం ఆదేశించారన్నారు. మిగిలిన 10 మేజర్ రోడ్లకు త్వరలోనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభిస్తున్నామన్నారు. రైతుల నుంచి సేకరించిన భూముల్లో చేపట్టిన రోడ్లు, ఇతర నిర్మాణాలు నిబంధనలకనుగుంగా జరుగుతున్నాయన్నారు. 34 రోడ్ల నిర్మాణాలను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. రోడ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నా, కొందరు అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వారంతా పనులు జరుగుతున్న తీరు స్వయంగా పరిశీలించి వాస్తవాలు తెల్సుకోవాలని మంత్రి నారాయణ హితవు పలికారు. ఐఏఎస్, గజిటెడ్, నాన్ గజిటెడ్, గ్రూప్ 1, 2, 3, 4 ఉద్యోగుల కోసం 3,840 ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ నాటికి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

రాష్ట్రంపై చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నుంచి బయటకు రండి

• చంద్రబాబుకు ముద్రగడ లేఖ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై విశ్వాసం, చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వంలో ఉన్న తెలుగుదేశంపార్టీ మంత్రులతో పాటు ఎంపీలతో రాజీనామా చేయించాలని మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును డిమాండ్ చేశారు. విభజన హామీలు పూర్తిగా అమలు చేయాలంటే జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, తనలాంటి వారు సరిపోరని పేర్కొంటూ ఈ మేరకు బుధవారం చంద్రబాబుకు రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు. తమ పరపతి కాపాడుకునేందుకు ప్రత్యేక హోదా (ప్యాకేజీ) ఉద్యమాన్ని పవన్ కల్యాణ్ భుజాలపై నెట్టి ఆయనను బలిచేయడం న్యాయమా అని ఆ లేఖలో ప్రశ్నించారు. గతంలో భాజపాతో పొత్తు తప్పిదం అన్నారని, గుజరాత్ అల్లర్ల పేరుతో మోడీకి మద్దతు ఉపసంహరించుకోమంటారా అంటూ వివిధ మతాల వారి సానుభూతి పొందేందుకు ప్రయత్నించారని ముద్రగడ ఆరోపించారు. భాజపా - తెదేపా పొత్తులు పెట్టుకున్న రెండుసార్లు కూడా ఆ పార్టీని ఎదగనిచ్చారా అని ఆయన ప్రశ్నించారు. అమెరికాలో కూడా తెదేపా గెలుపునకు ఆ దేశ ప్రజల ఓటుకోసం ఆరాట పడుతున్నారని మీవారే చెబుతున్నారని, అలాంటపుడు జాతీయ పార్టీకి ఆంధ్రప్రదేశ్‌లో ఎదగాలని ఉండకూడదా అని చంద్రబాబును నిలదీశారు. తిరుపతిలో ప్రధాని మోడీ సభలో ప్రత్యేక హోదా 10 ఏళ్ళు కావాలని డిమాండ్ చేశారని, కానీ ఇప్పుడు హోదా సంజీవిని కాదని, హోదా కన్నా ప్యాకేజీ మంచిదంటూ చెప్పడం భావ్యమా అని ఆయన ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసు నుంచి ప్రధాని మోడీ తనను కాపాడారని, మోడీ దేవుడితో సమానమని తమరి నోటే విన్నామని ఆ లేఖలో ముద్రగడ గుర్తుచేశారు. ప్రధాని ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయడం లేదని చెబుతున్న మీరు కూడా ఎన్నో హామీలు ఇచ్చారు కదా అని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎన్నింటిని అమలు చేశారని నా లాంటివారో, భాజపా నేతలు పురందేశ్వరి, సోము వీర్రాజులాంటి వారు అడిగితే మీరంతా జగన్‌కు అమ్ముడుపోయారంటే ఎదురు దాడి చేయించడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని ఆ లేఖలో విమర్శించారు.

గ్రూప్ - 1 ఇంటర్వ్యూ మార్కుల జాబితా బహిర్గతంపై

నిజాలు వెలికి తీస్తాం


• రుజువైతే క్రిమినల్ చర్యలు • నిబంధనల మేరకు ఇంటర్వ్యూలు • ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్



అమరావతి, ఆంధ్రప్రభ: దుమారం రేపుతున్న 2011 గ్రూప్ -1 ఇంటర్వ్యూ అభ్యర్థుల మార్కుల జాబితా బహిర్గతంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్ స్పష్టం చేశారు. బుధవారం ఏపీపీఎస్సీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కొన్ని ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో 2011 గ్రూప్ 1 అభ్యర్థుల ఇంటర్వ్యూ మార్కుల జాబితాలు బహిర్గతమైనట్లు రెండు రోజులుగా ప్రచారం జరుగుతోందని, దీనిపై విచారణ జరుపుతామని చెప్పారు. వాస్తవాలు వెల్లడైతే పోలీసులకు ఫిర్యాదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పబ్లిక్ పరీక్షల యాక్ట్ ప్రకారం విచారణ జరిపి, వాస్తవాలు వెలికితీస్తామని తెలిపారు. ఈ విషయమై గురువారం శాఖాధికారి చేత విచారించి, వాస్తవాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ప్రాథమిక విచారణలో కొన్ని వాస్తవాలు గుర్తించామన్నారు. గురువారం పూర్తి స్థాయిలో విచారించి, క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. అయితే మార్కుల జాబితా బహిర్గతమైనంత మాత్రాన అభ్యర్థులకు జరిగే నష్టమేమీ లేదన్నారు. వాస్తవానికి రాత పరీక్ష మార్కులకు, ఇంటర్వ్యూలో వచ్చే మార్కులకు ఎటువంటి సంబంధంలేదన్నారు. ఇప్పటివరకు ఏపీపీఎస్సీ 36 నోటిఫికేషన్లు జారీ చేసిందని, వాటిలో 30నోటిఫికేషన్లను విజయవంతం చేశామన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, యుపీపీఎస్సీ మార్గదర్శకాలు, పబ్లిక్ పరీక్షల యాక్ట్ నిబంధనలను అనుసరించి, ప్రతి నోటిఫికేషన్‌కు సంబంధించి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికల ప్రక్రియ పూర్తిగా ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తామని, ఇందులో ఎటువంటి అవకతవకలకు ఆస్కారమే ఉండదని చెప్పారు. గత రెండేళ్లుగా నిర్వ హిస్తున్న ఎంపికల్లో ఇంతవరకు ఎటువంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా ఎంపికలు చేస్తూ వస్తున్నామని అన్నారు. అయితే గ్రూప్- 1 (2011) కు సంబంధించి మీడియాలో జరుగుతున్న ప్రచారంపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతా మన్నారు. మార్కుల లీక్‌కు పాల్పడినట్లు తేలితే ఎంతటి వారినైనా సరే వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. అభ్యర్థులకు వచ్చిన మార్కులను తప్పనిసరిగా సీక్రెట్‌గా ఉంచడం జరుగుతుందని, ఇది ఏపీపీఎస్సీ సంప్రదాయమని చెప్పారు. ఇంటర్వ్యూ బోర్డులో ఉండాల్సిన సభ్యుల ఎంపిక కూడా ఎంతో పారదర్శకంగా ఉంటుందన్నారు. ఏపీపీఎస్సీ కార్యదర్శి వై.వి. ఎస్.టి. సాయి మాట్లాడుతూ మార్కుల జాబితా బహిర్గతంపై శాఖాపరంగా కూడా విచారణ జరిపి, వాస్తవాలు మళ్లీ మీడియా మందుంచుతామని సాయి స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ఏపీపీఎస్సీ సభ్యులు పద్మరాజు, విజయ్ కుమార్, రంగా జనార్ధన్ కూడా పాల్గొన్నారు.

22నాటికి బడ్జెట్‌పై స్పష్టత

• నేటి నుంచి శాఖల వారీగా ఆర్థిక మంత్రి యనమల సమీక్ష



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు నేటి నుంచి ప్రీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించనున్నారు. మొత్తం నాలుగు రోజుల పాటు జరుగనున్న ఈ సమావేశాల్లో మొదటి రోజు ఆర్థిక నిపుణులతో ఆయన కసరత్తు ప్రారంభిస్తారు. గత బడ్జెట్‌ను సమీక్షించడంతో పాటు 2018- 19 బడ్జెట్‌లో చోటు చేసుకోనున్న ప్రాధాన్యత రంగాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. వివిధ అంశాలపై, నిధులను ప్రభావితం చేయనున్న కీలకమైన అంశాలపై కూడా లోతుగా చర్చిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధామ్యాలను కూడా ఆర్థిక నిపుణులతో ఆయన సమీక్షించడం జరుగుతుంది. కాగా గురువారం మార్కెటింగ్, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, పౌరసర ఫరాలు, రవాణా, ఎస్సీ, ఎస్టీ బీసీ, మహిళా, శిశు సంక్షేమం, కార్మిక శాఖల మంత్రులు, అధికారులతో మంత్రి యనమల రామకృష్ణుడు చర్చిస్తారు. ఆయా శాఖల బడ్జెట్ ప్రతిపాదనలను మదింపజేస్తారు. అదే విధంగా 16వ తేదీన గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, రూరల్ హౌసింగ్, నీటి పారుదల, ప్రజా సంబంధాలు, రెవెన్యూ, రోడ్లు, భవనాలు, మైనింగ్, పర్యాటక, మానవ వనరుల అభివృద్ధి, వైద్య శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షిస్తారు. 19వ తేదీన అటవీ, హోం, విద్యుత్, దేవాదాయ, అబ్కారీ, పరిశ్రమలు, క్రీడాభివృద్ధి శాఖల మంత్రులు, అధికా రులతో సమావేశమవుతారు. వివిధ శాఖల ఖర్చులు, కేటాయింపులపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. మంత్రులతో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు, సహాయ కార్యదర్శులు, సెక్షన్ ఆఫీసర్లు కూడా ఈ సమావేశంలో పాల్గొనే అవకాశాలున్నాయి. మంత్రి యనమల రామకృష్ణుడు మంత్రులు, అధికారులతో నిర్వహించే సమావేశాల అనంతరం 2018-19 ఆంధ్రప్రదేశ్ వార్షిక బడ్జెట్ ఏ మేరకు ఉండబోతుందనే విషయమై స్పష్టత రానుంది. ఈ నెల 22వ తేదీ నాటికి బడ్జెట్‌కు సంబంధించి ఒక అవగాహనకు వచ్చే దిశగా ఆర్థిక శాఖ మంత్రి కసరత్తు చేస్తున్నారు. ఏయే రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందో ఇప్పటికే ఆయన ఆర్థిక శాఖకు కూడా దిశానిర్దేశం చేయడం జరిగింది. ప్రభుత్వ ఆలోచన లకు అనుగుణంగానే ఆర్థిక శాఖ అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ప్రతిపాదనలను పంపడం జరిగింది.

అపర చాణుక్యుడు సీఎం చంద్రబాబు

• అవసరమైన సమయంలో సరైన నిర్ణయం • వైకాపా ఎంపీల రాజీనామా జగన్నాటకం
• మోడీకి భయపడాల్సిన అవసరం సీఎంకు లేదు • మంత్రులు సోమిరెడ్డి, అచ్చెన్నాయుడు, ఆనందబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అపరచాణుక్యుడని, రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజాసంక్షేమం కోసం కేంద్రంపై ఢిల్లీలో, రాష్ట్రంలో రాజీలేని పోరాటం సాగిస్తామని, రాష్ట్రానికి న్యాయం జరక్కపోగే బీజేపీతో మిత్రపక్షంగా కొనసాగే విషయంపై సరైన సమయంలో సీఎం నిర్ణయం తీసుకుంటారని మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అచ్చెన్నాయుడు, నక్కా ఆనందబాబు అన్నారు. ప్రత్యేక హోదా కోసం వైకాపా ఎంపీలు రాజీనామాలు చేస్తారని జగన్ మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు అందుబాటులో ఉన్న మంత్రులతో బుధవారం ఉదయం సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. జగన్ చేసిన ప్రకటనపై మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించారు. వైకాపా అధినేత జగన్ చేసిన ప్రకటనను ఛేదించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై ముఖ్యమంత్రి అత్యవసర సమావేశ ప్రధాన అజెండా. ప్రస్తుత తరుణంలో బీజేపీతో మైత్రి కొనసాగించాలా ? లేదా మంత్రి వర్గం నుంచి బయటకు వచ్చి పోరాడాలా ? అనే విషయాలపై ముఖ్యమంత్రి మంత్రులతో చర్చించి వారి అభిప్రాయాలను సేకరించినట్లు సమాచారం. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు మాట్లాడారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటం: మంత్రి సోమిరెడ్డి

రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోపం తెలుగుదేశం పార్టీ ఢిల్లీలో, రాష్ట్రంలో మిత్రపక్షంగా కేంద్రంపై రాజీలేని పోరాటం సాగిస్తుందని మంత్రి సోమిరెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులో అన్యాయం జరిగిందని ఎంపీలు, రాజ్యసభ సభ్యులు పార్లమెంటులో పోరాడిన తీరు ప్రజలంతా గమనించారన్నారు. వైకాపా ప్రతిపక్షంగా ఉండి బీజేపీతో లాలూచీ పడిందని విమర్శించారు. బడ్జెట్, ప్రధాని మోడీ, అరుణ్‌జైట్లీపై జగన్ ఇప్పటి వరకు మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. వైకాపా ఎంపీల రాజీనామా పేరుతో మరోసారి జగన్నాటకమాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకు మూడు సార్లు రాజీనామా ప్రకటన చేసి వెనక్కి తగ్గిన విషయం తెల్సిందేనన్నారు. పార్లమెంటు సమావేశం జరుగుతున్న సమయంలో రాజీనామాలు చేయకుండా, సమావేశాలు ముగిసిన అనంతరం రాజీనామా చేస్తామని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీకి చెందిన కేంద్రమంత్రి సుజనాచౌదరి రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాటం చేస్తుంటే, వైకాపాకు దమ్ములేక ఆయన్ను నిలదీయం శోచనీయమన్నారు. ఢిల్లీకి వెళ్లి రాష్ట్రం కోసం ఎప్పుడైనా మాట్లాడారా అంటూ జగన్‌ను నిలదీశారు. అసెంబ్లీకి గైర్హాజరై రోడ్ల వెంట ముద్దులు పెడుతున్నారని వ్యంగోక్తి విసిరారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీల పాత్రను టీడీపీయే పోషిస్తోందని సోమిరెడ్డి అన్నారు.


మోడీకి భయపడాల్సిన అవసరం సీఎంకు లేదు: మంత్రి అచ్చెన్నాయుడు

తాము అవినీతికి పాల్పడలేదు.. మాపై కేసుల్లేవు.. ప్రధాని నరేంద్రమోడీకి భయపడాల్సిన అవసరం సీఎం చంద్రబాబుకు అంతకంటే లేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ప్రత్యేక హోదాతో కలిగే ప్రయోజనాలను ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఇస్తామంటేనే ఒప్పుకోవడం జరిగిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఓవైపు పార్లమెంటులో టీడీపీ ఎంపీలు ఆందోళన చేస్తుంటే, మరో వైపు వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి బడ్జెట్ బాగుందని ప్రశంసించడం విడ్డూరంగా ఉందన్నారు. డ్రామాల జగన్ ఎంపీల రాజీనామా పేరుతో మరో డ్రామాకు తెరతీసారని ధ్వజమెత్తారు. కేసులకు భయపడి పధాని, రాష్ట్రపతి, బీజేపీ నేతల ఇంటి చుట్టూ విజయసాయిరెడ్డి చక్కర్లు కొడుతున్నారన్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకే జగన్ ఆడుతున్న సరికొత్త డ్రామా రాజీనామా అంశమన్నారు. రాష్ట్రానికి రావల్సిన హక్కుల సాధన కోసం టీడీపీ మడమ తిప్పకుండా పోరాటం చేస్తుందన్నారు. సీఎం చంద్రబాబు అపరచాణుక్యుడంటి వారనీ, అవసరమైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారన్నారు.

మిత్రపక్షంగా ఉన్నా బీజేపీతో పోరాటం : మంత్రి ఆనందబాబు

కేంద్రంలో బీజేపీతో మిత్రపక్షంగా ఉన్నా, రాష్ట్రప్రజల సంక్షేమం కోసం టీడీపీ పోరాటం చేస్తుందని మంత్రి నక్కా ఆనందబాబు చెప్పారు. ఎక్కడైతే అన్యాయం జరిగిందో అక్కడే పోరాటం చేయాలనే లక్ష్యంతో టీడీపీ ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభల్లో ఆందోళన చేస్తున్నారన్నారు. రాష్ట్ర విభజన హేతుబద్ధంగా జరుగలేదని, దక్షిణాది రాష్ట్రాలతో సమానంగా ఉండేందుకు చేయూతనివ్వాలని కేంద్రాన్ని కోరడం జరిగిందన్నారు. విపక్షనేత జగన్ రాష్ట్ర అభివృద్ధికి సహకరించకపోగా అడుగడుగునా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న జగన్ పాతనాటకానికి తెరతీసారని ఆరోపించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరగాలనేది జగన్ కోరికని ఆరోపించారు. వైకాపా బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. విభజన హామీలు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు. రాష్ట్ర ప్రజల కోసం ఎలాంటి నిర్ణయమైనా తీసుకుంటామని స్పష్టం చేశారు.

డ్రామాల జగన్ : మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం, ప్రభన్యూస్: పాదయాత్రల్లో ప్రజలు ఆదరించడానికి గాను తిరస్కరించడంతో పాటు చంద్రబాబునాయుడు పరిపాలన దక్షతకు రాజకీయ నీడ పోతుందనే ఆందోళనతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి మరో కొత్త జగన్నాటకానికి తెరలేపుతున్నారని రాష్ట్ర మానవవనరుల మంత్రి గంటా శ్రీనివాసరావు ఆరోపించారు. రెండేళ్లుగా తన ఎంపిలతో రాజీనామా చేయించి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే నేపథ్యంలో కేంద్రంపై ఒత్తిడి తెస్తానన్న జగన్ పాతపాటే మళ్లీ పునరావృతం చేస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు పరిపాలన దక్షతతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తుండడం ప్రతిపక్షంలో కూడా తన ఉనికికి భంగం వాటిల్లే పరిస్థితి ప్రజల నుంచి తలెత్తడంతో అసమర్ధ ప్రతిపక్షనాయకుడిగా జగన్ మరోసారి పాడిన పాటే మొదలు పెట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా బుధవారం విశాఖపట్నంలోని ప్రభుత్వ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్ ప్రకటించి ఇంతకాలమవుతున్నా స్పందిం చని జగన్ తాజాగా మళ్లీ ఏప్రిల్ 5 వరకు వేచి ఉండి అప్పటికి కేంద్రం విభజన చట్టం లోని అంశాలను అమలు చేయకపోతే తన ఎంపీలతో రాజీనామా చేయిస్తాననడం మరో కొత్త డ్రామా అన్నారు. మిత్రపక్షంలో ఉన్న తెలుగుదేశం కేంద్రంలోని భాజా పాతో రాష్ట్ర ప్రయోజనాల నేపథ్యంలో పోరాటం చేస్తుంటే ప్రతిపక్ష నేతగా జగన్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. విశాఖ ఎంపి హరిబాబు 27 పేజీల నివేదికలో భాజా పా రాష్ట్రానికి ఎంతో చేసిందని చెబుతున్నప్పటికి విభజన చట్టంలోని అంశాలను అమలు చేయ్యాలని తేదేపా అడుగుతుంటే ఆయన ఇంకేదో చెబుతున్నారన్నారు. హరిబాబు పేర్కొంటున్నట్లు కేంద్రంలోని భాజాపాయే కాకుండా ఏ ప్రభుత్వం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వాలు అందివ్వాల్సిన కనీస అంశాలని ఆయన స్పష్టం చేశారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు ప్రకారం రాష్ట్రంలోని పలు విద్యా సంస్థలకు రూ.4500 కోట్ల నిధులు అవసరం కాగా కేవలం రూ.218 కోట్లు ఇచ్చి భాజాపా చేతు లు దులిపేసుకుందన్నారు. ఈ విద్యాసంస్థలన్నీ యూనివర్సిటీ వంటి తాత్కాలిక భవనాల్లోనే సర్దుబాటు చేసుకొని తదుపరి అభివృద్ధి నిదులు లేక నిలిచిపోయిన వైనం ఎంపి హరిబాబుకు తెలియదా అని అడిగారు. ఇలాంటివే అనేకం భాజాపా వలన నిలిచి పోయాయని పేర్కొన్నారు. ఏ పార్టీ మరొక పార్టీని తప్పుపట్టడం తమ ఉద్దేశం కాదని రాష్ట్ర ప్రయోజనాలకు నడుం కట్టి అవసరమైతే మిత్రపక్షంతోనైనా పోరాటం చేసేందుకు తాము సిద్దంగా ఉన్నామన్నారు. సమావేశంలో యలమం చలి శాసనసభ్యలు, రూరల్ తేదేపా అధ్యక్షులు పంచకర్లరమేష్‌బాబు పాల్గొన్నారు.

చంద్రబాబుపై మోడీకి ఈర్ష్య, ద్వేషం : జేసీ



అమరావతి, ఆంధ్రప్రభ: వివాదాస్పద వ్యాఖ్యలతో రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టించే ఎంపీ జేసీ దివా కర్‌రెడ్డి సీఎం చంద్రబాబంటే ప్రధాని మోడీకి ఈర్ష్య, ద్వేషమని సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం సచివాలయంకు వచ్చిన దివాకర్‌రెడ్డిని కలిసిన మీడియా తో ప్రధాని మోడీ, విపక్షనేత జగన్‌పై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసి మరోమారు వార్తల్లోకెక్కారు. కేంద్రం అన్నీ ఇస్తే రాజకీయంగా చంద్రబాబు ఎదుగుతారనే భయం ఉండడం వల్లే ప్రధాని మోడీ హామీలు అమలు చేయడం లేదోమోనన్న అనుమానం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ మాకు నామాలు పెట్టాడని, విపక్షనేత జగన్ కూడా అదేవిధంగా ప్రజలకు నామాలు పెడుతున్నారని ఎంపీల రాజీనామాల విషయంపై జేసీ ఎద్దేవా చేశారు. జగన్‌కు దమ్ముంటే తక్షణమే తన ఎంపీలతో రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు. జగన్ అనాలోచిత ప్రకటనలు జనం నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రెండేళ్ల క్రితమే రాజీనామా చేస్తామని చెప్పి, ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ప్రజల్లో సానుభూతి పొందడానికే ఎంపీల రాజీనామా డ్రామా ఆడుతున్నారని విమర్శించా రు. జగన్‌కు రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదనీ, కేవలం కపట సానుభూతి కోసమే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జగన్‌కు మాటమీద నిలబడే అలవాటు లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలు దగ్గర్లో ఉన్నాయి కాబట్టి ఇప్పుడు రాజీనామాలు చేయించి నా ఉప ఎన్నికలు రావు కాబట్టి ఏదొ ఒకటి చెప్పి ప్రజల్లో సానుభూతి పొందవచ్చనే జగన్ ప్రయత్నం ప్రజలందరికీ తెల్సునన్నారు. సీఎంను కలిసి కేంద్రం విషయంపై గట్టిగా ఉండాలని చెబుతానని అమీతుమీ తేల్చేయాల్సిన సమయం కూడా ఆసన్నమైందన్నారు. ఎంపీల పోరాటం కారణంగా మార్చి 5 లోపు కేంద్రం నుంచి నిధులు వస్తాయనే నమ్మకం ఉందనీ, అయితే అవి సంతృప్తికరంగా ఉంటాయా లేవా అనేది సందేహమన్నారు. రైల్వే జోన్ ఏర్పాటుపై కేంద్రానికి ఎలాంటి అభ్యం తరం లేకున్నా, ప్రకటించడంలో జాప్యం చేయడంపై ఆంతర్యమేమిటో అర్థం కావ డంలేదన్నారు. హోదా, ప్యాకేజీ పదాలు వేరనీ, ఫలితం ఒక్కటేనన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు తెలివైనవారు కాబట్టే ప్రత్యేక హోదాతో వచ్చే లాభాలన్నీ ప్యాకేజీ ద్వారా లభిస్తాయనే అంగీకరించారన్నారు. లోక్‌సభలో ఎంపీల ప్రవర్తన అనుచితంగా ఉందన్న బీజేపీ నేత విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలపై జేసీ స్పందించారు. ఎంపీ శివప్రసాద్ కళాకారుడు కాబట్టి రాష్ట్రానికి అన్యాయం జరిగిందని కళాకారుడిగా వేషధారణతో తన భావాన్ని వ్యక్తీకరించడం జరిగిందన్నారు.

ఎమ్మెల్యే చింతమనేనికి మూడేళ్ళ జైలు... వెంటనే బెయిల్



రచ్చబండ కార్యక్రమంలో వసంతకుమార్‌పై దాడి చేస్తున్న చింతమనేని (ఫైల్ ఫొటో)

ఏలూరు ప్రభన్యూస్: తెలుగుదేశం పార్టీ వివాదాస్పద ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కు కోర్టు ఊహించని షాక్ ఇచ్చింది. వివిధ కేసుల్లో ఆయనకు మూడేళ్ళ జైలు శిక్ష, ఐదు వేల జరిమానా విధించింది. 2011లో అప్పటి మంత్రి వట్టి వసంత్‌కుమార్‌పై చేయి చేసుకున్న చింతమనేనిని పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు కోర్టు దోషిగా తెల్చింది. 2011లో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో వట్టి వసంత కుమార్‌తో పాటు ఆయన గన్‌మ్యాన్‌పైనా చింతమనేని దాడి చేశారు. మంత్రి వట్టి వసంతకుమార్‌ను స్టేజీ మీదే కాలర్ పట్టుకుని లాగేశాడు. చింతమనేని, కిందిపడేసి పిడిగుద్దులు కురిపించారు. ఈ దృశ్యాలు మీడియా కెమెరాలకు కూడా చిక్కా యి. అందులో చింతమనేని దాడి చేస్తున్న దృశ్యాలు స్పష్టంగా ఉండడంతో కేసు నుంచి తప్పించుకోలేకపోయారు. మంత్రిపై దౌర్జ న్యం కేసులో రెండేళ్ళ జైలు శిక్ష విధించింది కోర్టు. గన్‌మ్యాన్‌పై చేయి చేసుకున్నందుకు ఆరు నెలల పాటు, రచ్చబండ కార్య క్రమాన్ని అల్లరి పట్టిం చినందుకు ఆరు నెలల శిక్షను కోర్టు విధించింది. దాదా పు ఏడు సంవత్సరాలపాటు ఈ కేసు విచారణ జరి గింది. తీర్పులేని శిక్షలన్నీ ఏకకాలంలో అమలు చేయాలంటూ కోర్టు ఆదేశించింది. తీర్పు చెప్పే సమ యంలో చింతమనేని ప్రభాకర్ కూడా కోర్టుకు హాజర య్యారు. చింతమనేనిపై ఈ కేసే కాకుండా చాలా కేసులున్నాయి. ఆయన పోలీసులను కొట్టారు, అధికారులను కొట్టారు. ఆ కేసులు విచారణలో ఉన్నాయి. అయితే అధికారంలో ఉన్నామన్న ధైర్యంతో తరచూ చింతమనేని రెచ్చిపోతూనే ఉన్నారు. కేసు విచారణ సమయంలో ఆయన ప్రవర్తన తీరుపై కోర్టు కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పుడు ఏకంగా జైలు శిక్ష పడడంతో చింతమ నేని కంగుతిన్నారు. సెక్షన్ 506 (2)గా రెండేళ్ళ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమా నా, సెక్షన్ 353గా ఆరు నెలల జైలు శిక్ష వేయి రూపా యల జరిమానా, సెక్షన్ 7(1)గా ఆరు నెలలు జైలు శిక్షతో పాటు 500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడిం చింది. మొత్తంగా మూడు సంవత్సరాల జైలు శిక్ష, 2500 జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ సంచలన తీర్పు ను ఇచ్చారు. తీర్పు వెలువడే సమయంలో చింత మనేని తన అను చరులతో చింతమనేని కోర్టుకు హాజరయ్యారు. తీర్పు వెలువడిన వెంటనే చింతమ నేని బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 15 ఫిబ్రవరి 2018

విధి లేకే సయీద్‌పై వేటు

ముంబయి దాడుల ప్రధాన సూత్రధారి హఫీజ్ సయీద్‌ని ఉగ్రవాదిగా పాకిస్తాన్ ప్రకటించడం అనూహ్య పరిణామం ఏమీ కాదు. పాకిస్తాన్‌ని ఇప్పుడు ఒక్క చైనా తప్ప ఎవరూ నమ్మడం లేదు. చైనా కూడా తాను తలపెట్టిన బృహత్ ప్రాజెక్టుల అమలుకు పాకిస్తాన్ సహకారం కావాలి కాబట్టి సమర్ధిస్తోంది. సయీద్‌ని గౌరవ భాజనుడనీ, ఆయన నేతృత్వంలోని జమత్ ఉద్ దవా (జెయుడి) గొప్ప ధార్మిక సంస్థ అని పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అనేక సందర్భాల్లో పొగిడారు. అదే నోటితో కాశ్మీరీ యువకులను సాయుధ పోరాటానికి సంసిద్ధంచేసి ఎదురుకాల్పుల్లో మరణించిన బుర్హాన్ వనీని అమరజీవి అంటూ కీర్తించారుకూడా. సయీద్‌కి పాకిస్తాన్ రహస్య గూఢచార సంస్థ ఐఎస్ఐతో సన్నిహిత సంబంధాలున్నాయి. నిజానికి ఆయన ఆదేశాలపైనే ఆ సంస్థ పని చేస్తోందనడం అతిశయోక్తి కాదు.అంతటి ప్రాధాన్యం కలిగిన వ్యక్తిని ఉగ్రవాదిగా పాక్ ప్రభుత్వం ప్రకటించిందంటే విడ్డూరమే. చాపకింద నీళ్ళు వచ్చిన చందంగా అన్ని వైపుల నుంచి ఒత్తిళ్ళు వెల్లువెత్తడంతో వేరే మార్గం లేకపోవడంతో పాక్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదు. పారిస్‌లో వచ్చే వారం జరిగే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటిఎఫ్) సమావేశంలో పాక్ పై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు వార్తలు వెలువడిన నేపథ్యంలో పాక్ ప్రభుత్వం దిగివచ్చింది. ఈ టాస్క్ ఫోర్స్‌ని 1989లో పారిస్‌లో జి-7 దేశాల శిఖరాగ్ర సమావేశాల సందర్భంగా ఏర్పాటు చేశారు. మనీ ల్యాండరింగ్, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం, ఆశ్రయం కల్పించడం, స్థావరాలు ఏర్పాటుకు అనుమతించడం వంటి చర్యలకు పాల్పడే దేశాలపై చర్యలు తీసుకునేందుకు ఈ టాస్క్ ఫోర్స్ ఏర్పాటైంది. జి- 7 కూటమి దేశాలే కాక, యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా ఈ సమావేశాలకు హాజరవుతూ ఉంటాయి. పాకిస్తాన్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడమే కాకుండా పూర్తి సహాయ సహకారాలను అందిస్తోందనే వాస్తవాన్ని అన్ని దేశాలూ గుర్తించాయి. ఇస్లామిక్ దేశాల మద్దతును కూడగట్టడానికి మతపరమైన సంఘీభావాన్ని పాచికగా ఉపయోగించింది. ఇస్లామిక్ దేశాల్లో ఉగ్రవాద బాధిత దేశాలు చాలా ఉన్నాయి. పాకిస్తాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థల వల్ల ఎక్కువగా నష్టపోతున్నది మన దేశమే. అదే మాదిరిగా ఐసిస్, అల్ ఖైదా వంటి ఉగ్రవాద సంస్థల వల్ల నష్టపోయిన, ఇప్పటికీ నష్టపోతున్న ఇస్లామిక్ దేశాలు ఉగ్రవాదంపై అంతర్జాతీయ పోరులో సహకరిస్తున్నాయి. పాకిస్తాన్ కూడా ఈ పోరులో అమెరికాకు భాగస్వామిగా ఉంటానని నమ్మబలికింది. అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. ప్రపంచంలోని అన్ని దేశాలూ ఏదో ఒక రూపంలో ఉగ్రవాదానికి దెబ్బతిన్నవే కావడంతో ఇప్పుడు అందరి నోటా ఉగ్రవాదాన్ని తుదముట్టించాలన్న మాట వినిపిస్తోంది. ఇప్పుడు ఆ దేశాలన్నీ ఒత్తిడి తేవడంతో పాక్ సయీద్‌పై చర్య తీసుకుంది. సయీద్ నెలకొల్పిన లష్కర్ ఎ తోయిబాను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి 1267తీర్మానం ప్రకారం నిషేధిత సంస్థగా 2005లోనే ప్రకటించింది. సయీద్ నేతృత్వం వహిస్తున్న జమాత్ ఉద్ దవా (జెయుడి)ని 2014లో విదేశీ ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది.

అమెరికా పరిధిలోని బ్యాంకుల్లో ఆ సంస్థ ఖాతాలను స్తంభింపజేసింది. మనీ ల్యాండరింగ్ వంటి అక్రమాలకు పాల్పడకుండా ఆదేశాలు జారీ చేసింది. పాక్ ప్రభుత్వం అండతో లష్కర్ సంస్థ ఇంతకాలం మనుగడ సాగిస్తోంది. లష్కర్‌ని పాక్ సైనికాధికారులు, రహస్య గూఢచార సంస్థ (ఐఎస్ఐ) అధికారులు ఇంతకాలం ఆదుకుంటూ వచ్చారు. అంతర్జాతీయ వేదికల మీద చైనా అండగా ఉంటూ వస్తోంది. సయీద్‌నీ, మసూద్ అజార్‌ని ఉగ్రవాదులుగా ప్రకటించే తీర్మానాలను సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశాల్లో చైనా చాలా సార్లు అడ్డుకుంది. చైనా అండతోనే పాక్ ప్రభుత్వం సయీద్ సంస్థలనే కాకుండా, పాక్‌కేంద్రంగా మసూద్ అజార్ నేతృత్వంలోని జైష్ ఎ మహ్మద్, హఖానీ నేతృత్వంలోని ఉగ్రవాద ముఠా, పాక్ తాలిబన్లు వంటి సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించాలన్న డిమాండ్ పలు వర్గాల నుంచి చాలా కాలంగా వినిపిస్తోంది. పాకిస్తాన్ దారికి వస్తుందేమోనని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన కొత్తలో స్నేహ హస్తాన్ని అందించారు. పాక్ వైఖరి మారకపోవడంతో ఆ దేశాన్ని ఏకాకి చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రతి విదేశీ పర్యటనలోనూ ఉగ్రవాదులకు పాక్ అండదండల గురించి ప్రస్తావిస్తూవచ్చారు. ఈ దేశాల్లో ఇస్లామిక్ దేశాలు కూడా ఉన్నాయి. ఇటీవల ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ఎర్రతివాచీ స్వాగతం పలికిన మోడీ ఇరాన్ ప్రధాని హసన్ రోహానీ కూడా అదే మాదిరిగా స్వాగతం పలకనున్నారు. ఇజ్రాయెల్‌కి బద్ధశత్రువైన పాలస్తీనాలో ఇటీవల మోడీ పర్యటన ముమ్మాటికీ చారిత్రాత్మకమైనదే. ఇస్లామిక్, యూదు దేశాలనే తేడా లేకుండా ఉగ్రవాదం ఉమ్మడి అజెండాగా అన్ని దేశాల సహాయ సహకారాలను తీసుకునేందుకు మోడీ సాగిస్తున్న కృషి ఫలించిందనడానికి ఇదే నిదర్శనం. జి-7 కూటమిలో అమెరికా, జపాన్, జర్మనీ, ఇటలీ, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఫ్రాన్స్‌లకు సభ్యత్వం ఉంది. ఈ దేశాలన్నీ ఉగ్రవాద బాధిత దేశాలే. అందువల్ల ఉగ్రవాదులకు ఆర్థికంగా సాయ పడుతున్న పాకిస్తాన్‌కి ముకుతాడు వేసేందుకు ఇవి కృత నిశ్చయంతో ఉన్నాయి. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిననాటి నుంచి ఉగ్రవాదులకు ఊతమివ్వడం మానుకోవాలని హెచ్చరికలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల పాక్‌కి ఇచ్చే సహాయాన్ని తగ్గించారు. సౌదీ అరేబియా రాజు సమక్షంలోనే పాక్‌ని హెచ్చరించడమే కాకుండా, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం వల్ల భారత్ ఎక్కువ నష్టపోతోందని ప్రకటించారు. ఇస్లామిక్ దేశాల నుంచి గతంలో మాదిరిగా ఇప్పుడు పాక్‌కి సాయం లభించడం లేదు. జి-7 దేశాల కూటమి ఏర్పాటు చేసిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ వచ్చే వారం పారిస్‌లో పాక్‌కి ముకుతాడు వేయడం గురించే ప్రధానంగా చర్చించే అవకాశం ఉందన్న వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వంపై వేటు పడే ప్రమాదం ఉందని గ్రహించి సయీద్‌ని పాక్ ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించింది.

మంచి మాట

తన ఆలోచనను అమలుపరచడానికి భయపడని వాడే నిజమైన స్వేఛ్ఛాజీవి.

✦ లియోన్ బ్లమ్

ఉన్నత మిధ్య



యుజీసీ నుండి అకస్మాత్తుగా విడుదలైన 84 పేజీల డ్రాఫ్ట్ భారతదేశ యువతను ఆందోళనలోకి నెట్టేసింది. దేశంలోని వర్సిటీలలో, డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకుల నియామానికి, ఇప్పటికే ఉన్నవారికి పదోన్నతులకి సంబధించిన ప్రతిపాదన లు అవి. ఈనెల 28వ తేదీ దాకా అభిప్రాయాలు తెలపమని సమయం కూడా ఇచ్చింది. వీటిలోని కొన్ని అంశాలు ఆశావహులకు తీవ్ర నిరాశ కలిగించేలా ఉన్నాయి. అవి ఒకటి 2021 జూలైకల్లా పీహెచ్‌డి పూర్తిచేసిన వారికే అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత ఉన్నట్టు. రెండు అధ్యాపకుల నియామ కానికి ఇంటర్వ్యూకి అర్హత సాధించడానికి వారి విద్యా జీవితం లో పొందిన డిగ్రీలలో శాతాన్ని బట్టి వారికి మార్కులు కేటా యించడం. వాస్తవానికి 2021 జూలై కల్లా పీహెచ్ డి తప్పనిసరి చేయడం ఒక పెద్ద జాతీయ విద్యా విపత్తు. ఇప్పటిదాకా నెట్ వంటి జాతీయ అర్హత పరీక్ష, సెట్ వంటి రాష్ట్రస్థాయి అర్హత పరీక్ష ఈ రెండు కాని పక్షంలో 2009 యుజీసీ గైడ్ లైన్స్ ప్రకారం పీహెచ్‌డి పూర్తి చేసినవారికి అధ్యాపకులుగా అవకాశం కల్పిస్తున్నారు. ఇప్పుడు వీటితో పాటు పీహెచ్‌డిని కూడా తప్పనిసరి చేయడం వల్ల ఒరిగే ప్రయోజనమేమీ లేకపోగా అసలే అధ్యాపక ఉద్యోగాల భర్తీ జరగక కునారిల్లుతున్న ఉన్నత విద్య, ప్రమాణాల పరంగా మరింత దిగజారుతోంది. ఒకపీహెచ్‌డి పూర్తి చేయడం డిగ్రీ పీజీ పూర్తి చేయడం వంటి ప్రక్రియ కాదు, నెట్, సెట్ వంటి జాతీయ రాష్ట్రస్థాయి అర్హత పరీక్షల ద్వారా గానీ , లేదా యూనివర్సిటీల ప్రవేశ పరీక్ష ద్వారా గానీ మాత్రమే పీహెచ్‌డి అడ్మిషన్ పొందగలం. దేశంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఏటా పీహెచ్‌డి అడ్మిషన్ల ప్రవేశ పరీక్షను నిర్వహిస్తాయి . తర్వాత ఇంటర్వ్యూల ద్వారా సంబంధిత సబ్జెక్టుల్లో ప్రవేశాలు చేపడతాయి. ప్రతి సబ్జెక్టులో అక్కడున్న అధ్యాపకుల అర్హతను బట్టి మరియు అప్పటికే తమ వద్ద ఉన్న ఖాళీలను బట్టి సీట్ల సంఖ్య ఉంటుంది. అందుకే వాటి సంఖ్య చాలా తక్కువ . ఇక రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డి ప్రవేశ పరీక్ష ఏటా జరగదు . రెండేళ్ళకోసారి, మూడేళ్లకోసారి నిర్వహిస్తుంటారు.

పీహెచ్‌డి పట్టా పొందాలంటే ఒక ప్రక్రియ ఉంటుంది. ఎవరైనా తమ సిద్దాంత గ్రంథాలు 3 సంవత్సరాల తర్వాత సమర్పించొచ్చు. వాటిని పరిశీలనకు పంపడం తరువాత ఆ సిద్ధాంతాన్ని డిఫెండ్ చేసుకునే వైవా ఇవన్నీ జరుగుతాయి. ఇదంతా జరగడానికి 4 ఏళ్ళు కనీసం పడుతుంది. కొన్నిసార్లు ఆలస్యమయ్యి ఆ సమయం 7 లేదా 8 ఏళ్ళు పట్టేవారు ఉన్నారు. ఇంత సమయం పట్టే ఒక డిగ్రీని అధ్యాపక ఉద్యోగాల నియామకానికి అర్హతగా పెట్టడం వల్ల ఏమి సాధించాలని కోరుకుంటున్నట్టు? పీహెచ్‌డి వంటి ఉన్నత విద్యపై ఇప్పుడిప్పుడే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవగాహన ఏర్పడుతున్న నేపథ్యంలో ఆ డిగ్రీనే ఒక నిర్దేశిత సమయానికి తప్పనిసరి చేసినట్లైతే వారి హక్కులు ఎలా కాపాడగలం. నిజంగానే ఈ అర్హత తప్పనిసరి చేస్తే ఇప్పుడు పీహెచ్‌డి అడ్మిషన్ పొందే విద్యార్థులు కూడా 2021 కి డిగ్రీ పొందలేరు. అదొకటైతే 2021 జూలై తరువాత, ఇప్పుడు అర్హతలుగా ఉన్న నెట్ మరియు సెట్ వంటి పరీక్షలలో ఉత్తీర్ణులైన వారు పీహెచ్‌డి పూర్తి చేసేదాకా అధ్యాపక ఉద్యోగాలకు అర్హులే కారు. ఇదెలా న్యాయం. ఇప్పుడు ఈ రూల్ పెట్టడం వల్ల, కొండంత ఆశతో జాతీయ స్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణులయ్యి టీచింగ్ వైపు మళ్లాలి అనుకునే ప్రస్తుత డిగ్రీ, పీజీ విద్యార్థుల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది ఈ నిర్ణయం.

దేశంలో జాతీయ విశ్వ విద్యాలయాలు మొదలుకుంటే రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కాలేజీల్లో ఖాళీలు కలిపితే సంఖ్య వేలల్లో తేలుతుంది. నిధులు లేక రాష్ట్ర విశ్వవిద్యాలయాలు మూలుగుతున్నాయి. అధ్యాపక ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడం, అభ్యర్ధుల నుండి ఫీజు వసూలు చేయడం ఏదోఒక కారణంతో వాయిదా వేయడం ఇలా అభ్యర్ధుల జేబులు గుల్ల కావడం తప్ప భర్తీ జరిగిందే లేదు. తెలుగు రాష్ట్రాలలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. నియమాకాలకు ఏదోఒక చట్టపరమైన కారణాలు అడ్డుపడుతూనే ఉన్నాయి. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పీహెచ్‌డి అడ్మిషన్లు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా ఇవ్వాలి అనే ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఇవెప్పటికి జరిగేనో తెలియదు. వీరంతా 2021 జూలై కల్లా పీహెచ్‌డి పూర్తవ్వాలనే నిబంధనతో బాధితులుగా మారతారనడంలో సందేహం లేదు. ఇక అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి అభ్యర్ధులను ఇంటర్వ్యూకి షార్ట్ లిస్టు చేయడానికి విద్యా జీవితంలో పొందిన డిగ్రీల మార్కుల శాతంని బట్టి ఇచ్చే ప్రాధాన్యంలో కూడా కొంత గందరగోళానికి తెరతీసింది. వర్సిటీలలో భర్తీచేసే ఉద్యోగాలకు పీహెచ్‌డికి ఇచ్చే మార్కులు 30 గా నిర్ణయిస్తే, కాలేజీల్లో అధ్యాపకుల భర్తీకి పీహెచ్‌డికి 20 మార్కులు కేటాయించారు. జాతీయ స్థాయి అర్హత పరీక్ష నెట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి వర్సిటీల్లో 7 మార్కులు కేటాయిస్తే కాలేజీల్లో భర్తీకి 10 మార్కులు కేటాయించారు. ఒకే తరహా ఉద్యోగాలకు ఒక డిగ్రీకి వేరు వేరు మార్కులు ఎందుకో ఇప్పటికీ అర్థం కాని పరిస్థితి.

దేశమంతా విద్యా వ్యవస్థ ఒకటిగా ఉన్నప్పుడు ఒకే రకమైన సదుపాయాలు అర్హత కలిగిన అధ్యాపకులు ఉన్నప్పుడు చేయాల్సిన పనిని అస్తవ్యస్తంగా ప్రాంతాలను బట్టి ప్రాధాన్యతలు మారిపోయే దేశంలో ఒక ఉన్నత స్థాయి కాలేజీ నుండి వచ్చిన వారికి, సదుపాయాలు లేని ప్రదేశాల నుండి అసలు చదువుకునే హక్కే తృణీకరించిన వర్గాల నుండి కష్టపడి చదువుకొన్న వారి మధ్య డిగ్రీ పీజీ మార్కుల శాతం ఏమి సాధిస్తుంది. అందరూ అర్హత కలిగిన వారే. అత్యవసరతలో పీహెచ్‌డి సిద్ధాంత గ్రంథం ఖచ్చితంగా ఒక విద్యా వ్యాపార వస్తువు (అకడమిక్ కమోడిటీ)గా మారుతుంది అనడంలో సందేహం లేదు.

అధ్యాపకుల నియామకాలకు అర్హతలు నిర్దేశిస్తున్న యుజీసీ అసలు అధ్యాపకుల నియామకం జరుగుతుందో లేదో చూడకపోవడం బాధాకరం. అధ్యాపకుల నియామకాల్లో అవినీతి జరుగుతుంది అంటూ రోజూ పత్రికల్లో చూస్తూనే ఉంటాం. భారతీయార్ వర్సిటీ వీసీ ఒక అధ్యాపక పోస్టు ఇవ్వడానికి 30 లక్షల లంచం డిమాండ్ చేసి ఇటీవల ఏసీబీకి దొరికిపోవడం చూశాం, ఆధ్యాపకుల నియమకాల్లో అవకతవకలు అంటూ ఇంటర్వ్యూ ప్రక్రియనే నిలిపేసిన సంఘటనలు ఆంధ్రాలో చూసాం, ఇంటర్వ్యూలో మార్కుల మాయాజాలం అంటూ తెలంగాణా నుండి వార్తలు చూశాం, పేరు గాంచిన డిల్లీ వర్సిటీలో లా అధ్యాపకుల నియామకంలో అవకతవకలు అంటూ టీచర్ల సంఘం ఆందోళన చూశాం, కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో 6000 పైగా బోధనా ఖాళీలు ఉన్నాయని సాక్షాత్తూ కేంద్రమే ప్రకటించాక ఇంత దారుణంగా పరిస్థితి ఉంటే చక్కదిద్దే పని చేయకుండా నేటి పరిస్థితికి ఎటువంటి ఉపయోగం చేయని నిబంధనలతో ఉన్నత విద్యను ఉత్త విద్యగా మార్చేసే నిర్ణయాలు ప్రతిపాదించడం పూర్తిగా అనవసరం. ఈ నిర్ణయమే తీసుకున్న నేపధ్యంలో తప్పకుండా ఇది ''జాతీయ ఉన్నత విద్యా విపత్తు''గా మారుతుంది అనడంలో సందేహమే లేదు.


✦ పచ్చల రాజేష్, 8331823086.

రెండో రాజధానిగా ఏది బెటర్?

పాలనా సౌలభ్యం కోసం దేశానికి రెండు రాజధానులు ఉండటం అసాధారణంకాదు. భౌగోళికంగా వేర్వేరు ప్రాంతాల ప్రజల ఆకాంక్షలు తీర్చడానికి ఒక్క రాష్ట్రా నికే రెండు రాజధానులు ఉండటం సహజమే. రెండో రాజధాని కోసం వివిధ ప్రాంతాల నుంచి డిమాండ్లు రావడమూ సహజమే. ఆశలూ, ఆకాంక్షలూ తీర్చడానికి ఆ డిమాండ్లను ఆమోదించిన ప్రభుత్వాలూ ఉన్నాయి. ఒకే రాష్ట్రా నికి రెండు రాజధానులు ఉన్నాయి. మహారాష్ట్రకు అసలు రాజధాని ముంబాయి నగరమైతే, వేసవి రాజధాని నాగపూర్.అలాగే, గుజరాత్‌కు మొదటి నుంచి రాజధానిగా అహ్మదాబాద్ ఉండేది.తర్వాత గాంధీనగర్‌ని కొత్త రాజధాని గా నిర్మించడంతో అహ్మదాబాద్‌ని వాణిజ్యరాజధా నిగా చేశారు.అలాగే, దేశానికి వాణిజ్య రాజధానిగా ముంబాయి ప్రసిద్ధి చెందింది.బ్రిటిష్ వారి కాలంలో ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలన్నీ కోల్‌కతా నుంచే జరిగేవి.తర్వాత ముంబాయికి,మద్రాసుకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇప్పటికీ కోల్‌కతా, ముంబాయి,చెన్నై సర్క్యూట్స్ కొనసాగుతున్నాయి. రెండవ రాజధానిగా ప్రకటిస్తే, తమ నగరంలో దేశ రాజధానితో సమానంగా మౌలిక సదుపాయాలు పెరుగుతాయని ఆయా నగరాల ప్రజల ఆకాంక్ష. మద్రాసు నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోయినప్పుడు తొలి రాజధానిగా కర్నూలును ఎంపిక చేశారు. విశాలాంధ్ర ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌ను రాజధానిగా చేశారు.

దేశాలకు కూడా రెండో రాజధానులు ఉన్నాయి. అగ్రరాజ్యమైన అమెరికా రాజధానిగా మొదట్లో న్యూయార్క్ ఉండేది.తర్వాత వాషింగ్టన్‌కి మార్చారు. అందువల్లనే, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం అక్కడే ఉంది.వరల్డ్ ట్రేడ్ సెంటర్ న్యూయార్క్ లోనే ఉంది. వాషింగ్టన్ దేశ రాజధాని అయిన తర్వాత అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థల ప్రధాన కార్యాలయాలు ఆ నగరానికి మార్చారు. పూర్వపు బర్మాయే మయన్మార్. బర్మా రాజధానిగా యాంగన్ ఉండేది.మయన్మార్ రాజధాని నయ్‌పయ్ థా. అలాగే,వియత్నాం రాజధానిగా పాతనగరం స్థానే కొత్త రాజధానినిర్మించి దానికి ఆ దేశానికి జాతిపితగా పరిగణించే హోచ్‌మిన్ పేరు పెట్టారు. పాకిస్తాన్‌తొలి రాజధాని రావల్పిండి కాగా, ప్రస్తుత రాజధాని ఇస్లామాబాద్. రావల్పిండిలో ఇప్పటికీ రక్షణ శాఖ ప్రధాన కార్యాలయం నడుస్తోంది. ఆఫ్ఘనిస్థాన్‌కి పూర్వపు రాజధాని కాందహార్ కాగా, ప్రస్తుత రాజధాని కాబూల్. చైనా కి బీజింగ్ రాజధాని కాగా, షాంఘై వాణిజ్య రాజధానిగా రెండవ రాజధాని హోదాని కలిగి ఉంది.ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి దేశానికీ, రాష్ట్రా నికీ రెండో రాజధాని డిమాండ్లు నానాటికీ పెరిగి పోతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ విభజనను నివారించడానికి హైదరాబాద్‌ని రెండో రాజధానిగా చేయాలన్న డిమాండ్లు అన్ని ప్రాంతాల నుంచి వచ్చాయి. దేశానికి రెండో రాజధాని అయ్యేందుకు అవసరమైన అర్హతలన్నీ హైదరాబాద్‌కి ఉన్నాయి. రాష్ట్రపతి వేసవి విడిది హైదరాబాద్. ఢిల్లీలోని రైసానా హిల్స్‌లో రాష్ట్రపతి భవన్ ఉంది.ఆ తర్వాత సికిందరాబాద్ బొలారం లో రాష్ట్రపతి నిలయం ఉంది. నిజాం కాలంలో హైదరాబాద్ స్టేట్‌కు రాజధానిగా ఉండటం వల్ల హైదరాబాద్ లో దేశంలో అన్ని ప్రాంతాలు,మతాలు, భాషలు,నాగరికతల వారు స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. హైదరాబాద్‌ని సకల సంస్కృతుల సంగమం అనీ,మినీ ఇండియా అని ఇప్పటికీ అభివర్ణిస్తుంటారు. రక్షణ శాఖకు చెందిన డిఆర్ డిఓ వంటి,సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీసు అకాడమీ,జాతీయ స్థాయిలో పేరొందిన కాసు బ్రహ్మానంద రెడ్డి జాతీయ పార్కు,సీసీఎంబి,భారత్ ఎలక్ట్రానిక్స్ (బిహెచ్ ఈఎల్), హిందూస్తాన్ ఎయిరో నాటిక్స్ (హెచ్ఏఎల్)వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా ఉంది.వాయుసేన వైమానిక విన్యాసాలను సికిందరాబాద్‌లో నిర్వహిస్తూ ఉంటుంది. ఆర్థిక పరంగా రిజర్వు బ్యాంకు కార్యాలయం ఉంది . రాజధానిఢిల్లీలో మొగలాయీ ల కాలం నాటి కట్టడాలు ఉన్నట్టే,హైదరాబాద్‌లో చార్మినార్,గోల్కొండ కోట, సాలార్ జంగ్ మ్యూజియం వంటి చారిత్రక ప్రదేశాలు న్నాయి. అందువల్ల హైదరాబాద్‌ని రెండవ రాజధానిగా చేయాలన్న డిమాండ్



రాష్ట్ర విభజన సమయంలో పలువురి గళాల నుంచి వినిపించింది.హైదరాబాద్‌ని రెండో రాజధాని చేస్తే ఎన్నో మౌలిక సదుపాయాలు ఏర్పడతాయన్న వాదనలు కూడా వినిపించాయి. రాష్ట్ర విభజనపై ఏర్పాటైన శ్రీకృష్ణ కమిషన్ సూచించిన ప్రత్యామ్నాయాల్లో హైదరాబాద్ ని రెండో రాజధానిగా చేయాలన్న ప్రతిపాదనకూడా ఉంది. శివరామకృష్ణకమిటీ సూచించిన ప్రత్యామ్నాయాల్లో కూడా ఇది ఉంది. కట్టలు తెగిన భావోద్వేగాల మధ్య ఈ ప్రత్యామ్నాయాలన్నీ దూది పింజలయ్యాయి. ఇప్పుడంతా సర్దుకుని నాల్గేళ్ళుగా తెలుగు రాష్ట్రాలు అభివృద్ధిపై దృష్టిని ముందుకు సాగుతున్న సమయంలో, అభివృద్ధిలో ఎవరు ముందున్నారని బేరీజు వేసుకునే సమయంలో వనరులు, ఆస్తుల పంపిణీ జరుగుతుండటం. స్థిర ఆస్తులను



దేశానికి రెండో రాజధాని అంశం మళ్ళీ చర్చకు వచ్చింది. రాజకీయ కోణం నుంచి కాకుండా, భౌగోళికంగా, ఆర్థిక పరంగా అన్ని ప్రాంతాలకూ అనుకూలంగా ఉండే నగరాన్ని రెండో రాజధానిగా చేయాలన్న ఆలోచన మంచిదే.బెంగళూరును రెండో రాజధానిగా చేయాలన్న ప్రతిపాదన అసెంబ్లీ ఎన్నికలనేపథ్యంలో రాజకీయ కోణం నుంచేవచ్చింది. కానీ, వాస్తవ పరిశీలన జరిపితే, బెంగళూరు కన్నా, హైదరాబాద్ అన్ని విధాల అర్హమైనదన్న అభిప్రాయం చాలా మందిలో ఉంది. ఈరెండునగరాలకూ దక్షిణాదిన ప్రాధాన్యం ఉన్నప్పటికీ, రెండో రాజధానిగా దేనికి ఎక్కువ సానుకూలతలు ఉన్నాయన్న అంశంపై విశ్లేషణ ఇది....

విడగొట్టలేని పరిస్థితులు ఉన్నప్పుడు మళ్ళీ రెండో రాజధాని మాట తెరమీదికి వచ్చింది.

కేసీఆర్ ఇప్పుడు సుముఖం!

ఈ మాట ఎవరో సామాన్యుల నోటంట కాకుండా, సాక్షాత్తూ తెలంగాణ ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) అధ్యక్షుడు కల్వకుంట చంద్రశేఖర రావు (కేసీఆర్) నోటివెంట వచ్చింది. రెండో రాజధానిగా హైదరాబాద్‌ని చేయాలన్న ప్రతిపాదనకు గతంలో ససేమిరా అన్న కేసీఆర్ ఇప్పుడు అందుకు అభ్యంతరం లేదని చెప్పడం గుణాత్మక పరిణామమే. దీనిపై తెలుగునాట మేధావుల మస్తిష్కాలు జోరుగా పని చేస్తున్నాయి. హైదరాబాద్ డెక్కన్ ప్రాంతంగా వ్యవహరించబడుతున్నప్పటికీ, దక్షిణాది రాష్ట్ర రాజధానిగానే చాలా కాలంగా ప్రసిద్ధి చెందింది.అందువల్ల దక్షిణాది వారి ఆకాంక్ష మేరకు హైదరాబాద్‌ని రెండో రాజధానిగా చేయడం అన్ని విధాలా అభిలషణీయమని వాదించేవారేఎక్కువ .

రేసులో బెంగళూరు: తెలుగువారంతా కలిసి ఈ డిమాండ్‌ని సాధించేస్తారేమోనని కన్నడిగుల్లో వణుకు ప్రారంభమైంది. రెండో రాజధానిగా బెంగళూరును చేయాలని కోరుతూ ప్రధానికి ఒక లేఖ రాసినట్టు కర్నాటక మంత్రి,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆర్ వి దేశపాండే ఈ మధ్య ఒక ఇంటర్వ్యూలో వెల్లడించడంతో ప్రకంపనాలు మొదలయ్యాయి. ఆయన రాష్ట్ర శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చేసిన ప్రతిపాదనగా బీజేపీ వారూ, ఇతరులూ కొట్టి వేశారు. బెంగళూరు నగరంలోనూ, దాని ఆనుకున్న శివార్లలోనూ 24 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. సాధారణంగా వీరంతా ఐదేళ్ళ కోసారి కాంగ్రెస్, బీజేపీలను వంతుల వారీగా గెలిపిస్తూ ఉంటారు. ఈసారీ అలాగే జరుగుతుందేమోనని మళ్ళీ అధికారంలోకి రావలనుకుంటున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకునిగా ఆయన ఈ ప్రతిపాదనపై చర్చకు తెరలేపారు. సాధారణంగా ఇలాంటి ప్రతిపాదనలపై పారిశ్రామికవేత్తలూ, వాణిజ్య వేత్తలూ వెంటనే స్పందిస్తూ ఉంటారు. ఈసారీ అలాగే జరిగింది. బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ వంటి పారిశ్రామికవేత్తలు వెంటనే స్పందించారు. ఇది ఏ నాటి నుంచో పరిశీలనలో ఉన్న ప్రతిపాదన అంటూ ఆమె స్వాగతించారు.

దేశపాండేది ఎన్నికల జిమ్మిక్ అని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి సురేష్ కుమార్ తేలిగ్గా కొట్టి వేశారు. బెంగళూరులోనూ, శివారులలోని 24అసెంబ్లీ స్థానాల్లో 20 సీట్లను తమ పార్టీ సునాయాసంగా గెలుస్తుందని ఆయన ధీమాగా చెప్పారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బెంగళూరు నగరంలో అభివృద్ధి కార్యక్రమాలకు వేల కోట్ల రూపాయిలను కుమ్మరిస్తున్నారు. సబ్సిడీ రేట్లపై అల్పాహారం, భోజనం సరఫరా చేసేందుకు చెన్నైలో అమ్మ క్యాంటీన్ల మాదిరిగా క్యాంటీన్లను ప్రారంభించారు. ఇంకా ఎన్నో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీ మాదిరిగా బెంగళూరు సాఫ్ట్ వేర్ పరిశ్రమకు కేంద్రంఅయిందనీ,ఎన్నో మెడికల్ సంస్థలు వెలిశాయని వాదిస్తున్నారు.

బీజేపీ నాయకుడు సురేష్ కుమార్ పేర్కొన్నట్టు ఇది ఎన్నికల ఎత్తుగడే కావచ్చు. ఏమైనా, దేశానికి రెండో రాజధానిగా దక్షిణాది రాష్ట్ర రాజధానిని చేయడంఎంతైనా అవసరం. పంజాబ్, హర్యానాలకు ఉమ్మడి రాజధానిగా ఉన్న చండీగఢ్‌ని రెండో రాజధానిగా చేయాలన్న ప్రతిపాదన కూడాచాలా కాలంగా వినిపిస్తోంది.

రాజకీయ కోణం నుంచి కాకుండా, భౌగోళిక, వాణిజ్య, ఆర్థిక,సాంస్కృతిక కోణాల నుంచి పరిశీలిస్తే, హైదరాబాద్ రెండో రాజధానిగా మేలైనదని నిపుణులు,అభివృద్ధి హితైషులు ఏనాడోతేల్చారు. ఏపీ విడిపోయినప్పటికీ, పదేళ్ళ పాటు ఉమ్మడి రాజధానిగా ఉండాలన్న నిబంధన విభజన చట్టంలో స్పష్టంచేశారు కనుక, అలా చేస్తే, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ఉమ్మడి రాజధానిగా, దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్ అభివృద్ధి చెందేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. అలాంటి సందర్భంలో అమరావతి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రా నికి రెండో రాజధానిగా చేయవచ్చు. వరంగల్‌ని తెలంగాణకు రెండో రాజధానిగా చేయాలన్న ఆ ప్రాంత వాసుల ఆకాంక్షా నెరవేరుతుంది. రాజకీయ కోణం నుంచి కాకుండా, పాలనాసౌలభ్యపరంగా ఇది సానుకూలమైన ప్రతిపాదన.

✦ ఎ.పి.స్వామి

అన్నీ అలవి కాని వాగ్దానాలే!

అచ్చేదిన్ వారి కలర్‌ఫుల్ ఎన్ని'కలల' బడ్జెట్ (2018-19)లో వాగ్దానాల వెల్లువ తప్ప మరేదీ కనిపించడం లేదు. ఇప్పటి వరకూ ఇచ్చిన వాగ్దానాలను ఏమేరకు అమలు చేశారో ప్రస్తావన పూర్వకంగానైనా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొనలేదు. ఎన్నికల సంవత్సరం కావడం వల్ల వాగ్దానాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అందరికీ ఆరోగ్యం, ఉచిత విద్య, మహిళలకు పెద్ద పీట మొదలైనవన్నీ వినడానికి ఆకర్షణీయంగానే ఉంటాయి. వీటిని అమలులో పెట్టేందుకు ఎంత సమయం పడుతుందో ఎవరూ చెప్పలేరు. ఇది దేశ ప్రజలకు అనుభవైకమే. ఈసారి మోడీ ప్రభుత్వం గ్రామీణ ఓటర్లకు గాలం వేసింది. నాలుగు సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాలనూ, రైతులను పట్టించుకోని ప్రభుత్వం చివరి సంవత్సరంలో భారీ ఎత్తున సాయమందిస్తుందంటే నమ్మశక్యం కాదు. ఈ బడ్జెట్‌లో ప్రకటించిన ఆరోగ్య పథకం అమలులోకి రావాలంటే చాలా వ్యవధి పట్టవచ్చు. గిరిజన సంక్షేమం గురించి బడ్జెట్ లో చేసిన ప్రతిపాదనలు అమలవ్వాలంటే మరింత సమయం తీసుకోవచ్చు. కేవలం ఓటర్లకు గాలం వేయడానికే ఈ వాగ్దానాలు చేసినట్టుగా కనిపిస్తోంది. మధ్యతరగతి వేతన జీవుల ఆశలపై నీళ్ళు చల్లారు. తెలుగు రాష్ట్రాలకు మొండిచేయి చూపించారు. కార్పొరేట్ల రాయితీలూ ఇస్తూ, వరాలు ప్రకటించారు. సామాన్య ప్రజలపై భారాలు మోపారు. మొత్తానికి ఎన్నికల మాయల మరాఠీ గారడి బడ్జెట్‌ను జైట్లీ ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో చెప్పే అంకెలు వేరు తరువాత కేటాయించే అంకెలు వేరు ఈ కేటాయింపులోంచి వాస్తవంగా ఖర్చు పెట్టేది వేరు. ప్రజాసంక్షేమమే పరమావధిగా భావించి, సత్వర సామాజిక ఆర్థికాభివృద్ధిని సాధించాలి.

కార్పొరేటీకరణ మొదలైనప్పటి నుంచి బడ్జెట్ అర్థం పూర్తిగా మారిపోయింది. కడుపులో చల్ల కదలకుండా కార్పొరేట్లకు ఎర్ర తివాచీలు పరిచి మరి వారిపై వరాల జల్లులు, అనేక రాయితీలు కల్పిస్తూ బడ్జెట్‌లు తయారౌతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే బడ్జెట్ రూపకల్పన మొత్తం ప్రపంచ బ్యాంకు దేశ, విదేశీ కార్పొరేట్ల కనుసన్నల్లో రూపుదిద్దుకుంటే అట్టహాసంగా తెచ్చి పార్లమెంట్‌లో చదవటమే ఆర్థిక మంత్రుల పని ఇందులో వారి ప్రయోజనాలే ఉంటాయి. భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధిరేటు అమాంతంగా 7.5 శాతం పెరిగి చైనాను కూడా మించిపోయిందని మోడీ ప్రభుత్వం ఊదరగొడుతోంది. మరోవైపు ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో బడా పారిశ్రామిక వేత్తలకు వేల కోట్లు రాయితీలు ఇస్తూ, సాధారణ పేద ప్రజానీకానికి ఇచ్చే సబ్సిడీలకు కోత పెడుతోంది. ఇది సహించరానిది ఉపాధి దొరకక, ఉద్యోగ భద్రత లేక కార్మికులు వేతన భరోసాలేని అడ్డాకూలీలుగా మారుతున్నారు.ప్రకృతి ప్రతికూలతలు, నకిలీ విత్తనాలు రుణభారాలు, గిట్టుబాటు ధరలు లభించక దేశవ్యాప్తంగా రైతులు నిరాశ నిస్పృహలకు లోనయి ఈ దశాబ్దంలో వేల సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతులకు గిట్టుబాటు ధర కూడా కల్పించలేని చేతకాని స్థితిలో ప్రభుత్వాలున్నాయి. దీనికి సమాధానం బడ్జెట్‌లో ఉందా? ఈ బతుకు తెరువు సంక్షోభాన్ని పరిష్కరించలేని ఉత్తుత్తి బడ్జెట్‌లు ఎందుకు? ఇక ఆరోగ్యరంగానికి అరకొర నిధులే విదిలించారు. ఈరంగానికి రూ.1.38 లక్షల కోట్లు కేటాయించారు. కొత్త బీమా పథకం అంటూ కొత్త ముసుగు వేశారు. ఈ పథకం కొత్త సీసాలో పాత సారాలా ఉంది. ఈ నిధులు ఎలా సరిపోతాయి? భారత పాలకులు ప్రజలకు వైద్యం అందించే బాధ్యత నుండి ఎప్పుడో తప్పుకున్నారు. ఇక్కడ రోగం మార్కెట్ సరకు గాను, వైద్యం వ్యాపారంగాను మారింది. అనుత్పాదక రంగమైన రక్షణ రంగానికి ఈ బడ్జెట్‌లో గతేడాది కంటే 7.81 శాతం మేరకు కేటాయింపులు పెంచారు. (రూ.2.95 లక్షల కోట్లు). ఇన్ని లొసుగులుంటే ఈ దేశం బాగుపడమంటే ఎలా బాగుపడుతుంది. రోజులు గడుస్తున్నకొద్దీ దేశ ప్రజలకు అచ్చేదిన్ ఆంతర్యం అర్థమవుతోంది. త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సామాన్యులకు అర్థం కాని అంకెల గారడి తప్పితే ఏమి లేదు. ఉపాధి లేమి ద్రవ్యోల్బణం, పేదరికం లాంటి సమస్యలకు పరిష్కారం చూపడంలో బడ్జెట్ విఫలమైంది. బడ్జెట్ కేటాయింపుల్లో దాగిన మోడీ సర్కారు సంపన్న సేవా తత్పరత మరోమారు తేటతెల్లమైంది.

✦ షేక్ కరిముల్లా, 9705450705

అహింసకు ప్రతిరూపం

నేడు సేవాలాల్ జయంతి

తిరుపతి తిరుమల, శ్రీశైలం, వేములవాడ రాజన్న, సమక్క-సారలమ్మ, సప్తమాతలు (బంజారా) నిర్దేశము తెలియని బంజారాలకు దిశా నిర్దేశం చేసిన మహానుభావుడు సంత్ సేవాలాల్ మహరాజ్.సమస్త జీవకోటికి అమ్మగా వెలిసిన భవాని మాత పూజించాలని కాని ఫలితాన్ని ఆశించవద్దని బంజారాలకు బోధించాడు ఆయన. సేవాలాల్ మహారాజ్ జననం 1739 ఫిబ్రవరి 15వ తేదీన అనంతపూర్ జిల్లా రాంజీ నాయక్ తండాలో జన్మించారు. ఈయనకు సేవాలాల్ అని నామకరణం చేశారు. జగదాంబ ప్రత్యక్షమై సేవాలాల్‌ని నాకు అప్పజెప్పమని భీమనాయక్‌ను అడుగుతుంది.

అమ్మ వారికి ఇచ్చిన వాగ్దానం ప్రకారం సేవాలాల్ అందుకు ఒప్పుకోడు. తల్లిదండ్రులు సేవాలాల్‌ను అమ్మవారికి అప్పగిస్తుంటే నేను శాఖాహారిని జగదాంబ మాంసాహారి కనుక ఆమెకు నేను ఎలాంటి జీవాలను బలి చేయదలచుకోలేదని అంటాడు. అప్పుడు మేరామ సేవాలాల్ ఎన్నో కష్టాలకు గురి చేస్తుంది. అమాయక మూగ జీవుల్ని బలిచేస్తుంటే చూడలేక,అమ్మవారికి బలులను వ్యతిరేకిస్తాడు. ఒకవేళ అమ్మవారికి బలే ఇష్టమైతే తానే బలైపోతానని సేవాలాల్ ప్రజల సమక్షంలో తన తలను ఖండించుకొని అమ్మవారి కాళ్ల దగ్గర పడేస్తారు. అమ్మవారు సేవాలాల్ శిరస్సును తిరిగి అతని శరీరానికి జోడించి జీవం పోస్తారు. అప్పటినుంచి సేవాలాల్ అన్ని విద్యలను నేర్చుకొని బంజారాల సేవలో నిమగ్నమయ్యాడు.

✦ జి.శంకర్ నాయక్, 9908817986

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.11,400 కోట్ల కుచ్చుటోపీ



• వజ్రాల రారాజు నీరవ్ మోడీ హస్తం • విదేశాల్లో సొంత ఖాతాలకు బదలీ • సీబీఐకి పిఎన్‌బీ ఫిర్యాదు • నీరవ్, ఆభరణాల కంపెనీపై అభియోగం • బీఎస్ఈకి సమాచారం • భయం వద్దు... ఆర్థిక శాఖ అభయం

ఒక వజ్రాల వ్యాపారి బంధు, మిత్ర, సపరివార సమేతంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.11,400 కోట్ల మేరకు కుచ్చుటోపీ పెట్టాడు. కేవలం 10 రోజుల వ్యవధిలో అదే బ్యాంకును రెండు సార్లు మోసగించాడు. మొదట వందల కోట్లకు మోసగించిన డైమండ్ కింగ్ నీరవ్ మోడీ, రెండవసారి వేల కోట్ల రూపాయలకు బరితెగించాడు. ముంబైలోని ఒకానొక బ్రాంచ్‌లో గోల్‌మాల్ జరిగిందంటూ పిఎన్‌బి చేసిన ఫిర్యాదులతో సిబిఐ రంగంలోకి దిగింది. మోసపూరిత ఆర్థిక లావాదేవీలు జరిపిన నిందితులు సొమ్ము చేసుకున్న నగదును ఇతర బ్యాంకుల ద్వారా విదేశాల్లోని సొంత ఖాతాలకు బదిలీ చేసుకొని ఉంటారని పిఎన్‌బి గగ్గోలు పెడుతున్నది. అంతర్జాతీయంగా పేరుగడించిన నీరవ్ మోడీకి అన్ని రంగాల పెద్దల వద్ద మంచి పరపతి, పలుకుబడి ఉంది. కేంద్ర ఆర్థిక శాఖ మాత్రం పిఎన్‌బి ఆర్థిక కుంభకోణంపై కంగారుపడాల్సిన అవసరం లేదని అభయం ఇస్తున్నది.



న్యూఢిల్లీ: కోట్లకు పడగలెత్తిన వజ్రాల డిజైనర్ నీరవ్ మోడీ, ఒక ఆభరణాల కంపెనీతో కలిసి దాదాపు రూ.11,400 కోట్ల విలువైన మోసపూరిత లావాదేవీలకు పాల్పడ్డారని పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) అభియోగం మోపింది. ఈ మేరకు పిఎన్‌బీ నుంచి మంగళవారం తమకు రెండు ఫిర్యాదులు అందాయని సీబీఐ అధికారులు తెలిపారు. ఫిర్యాదులను రూఢీ చేసుకున్న అనంతరం నీరవ్ మోడీ, సదరు ఆభరణాల కంపెనీపై తగిన న్యాయపరమైన చర్య తీసుకుంటామని వారు వెల్లడించారు. అయితే ఇంతటి భారీ ఆర్థిక మోసంపై సీబీఐ భవిష్యత్ కార్యాచరణ ఏమిటనేది అధికారులు స్పష్టం చేయలేదు. నీరవ్ మోడీ రూపొందించే ఆభరణాలకు అంతర్జాతీయ సెలబ్రెటీల్లో ఎంతో పేరు ఉంది. ఒకానొక పిఎన్‌బి శాఖ వద్ద రూ.280 కోట్ల మేరకు మోసపూరితమైన లావాదేవీలకు పాల్పడ్డారనే అభియోగానికి సంబంధించి మోడీపై సీబీఐ దర్యాప్తు ప్రస్తుతం కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు. అయితే ఫిర్యాదుల్లో పేర్కొన్న ఆభరణాల కంపెనీ నీరవ్ మోడీకి సంబంధించినది లేనిదీ తెలియరాలేదు. ఆభరణాల కంపెనీ పేరును అధికారులు గోప్యంగా ఉంచారు. మోసపూరితంగా జరిగిన లావాదేవీలు దేనికి సంబంధించినవనే దానిపై సీబీఐ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

బీఎస్ఈకి సమాచారం

ముంబైలోని ఒకానొక శాఖలో 1771.69 మిలియన్ డాలర్లకు పైగా విలువైన మోసపూరిత, అనధీకృత లావాదేవీల గురించి బీఎస్ఈ స్టాక్ ఎక్స్‌చేంజ్‌కు కూడా బ్యాంక్ తెలియపరిచింది. ఈ లావాదేవీలు ప్రాతిపదికగా ఇతర బ్యాంకులు విదేశాల్లో ఈ ఖాతాదారులకు నగదు బట్వాడా చేసినట్టు కనిపిస్తున్నది అని బీఎస్ఈకి సమర్పించిన పత్రంలో వెల్లడించింది. కేసును పరిశీలించి నిందితులను అదుపులోకి తీసుకునే దిశగా ఈ మోసాన్ని దర్యాప్తు ఏజెన్సీలకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొంది.

10 రోజుల్లోనే రెండో మోసం

ఒక బ్యాంకు కేవలం 10 రోజుల్లోనే రెండు సార్లు మోసపోవడం భారతీయ బ్యాంకుల చరిత్రలో ఇదే తొలిసారి. 2017లో రూ.280.70 కోట్లుకు పైగా పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసగించారనే అభియోగంపై నీరవ్ మోడీ, ఆయన సోదరుడు నిశ్చల్, భార్య అమి, నీరవ్ వ్యాపార భాగస్వామి చినుభాయి చోస్కిలను సీబీఐ బుక్ చేసింది. వారంతా బ్యాంక్ అధికారులతో కలిసి మోసానికి పాల్పడి నష్టం చేకూర్చారంటూ పిఎన్‌బిచేసిన ఫిర్యాదుపై స్పందించిన సిబిఐ పై చర్య తీసుకుంది.

భయాందోళన వద్దు.. కేసు చేయి దాటిపోలేదు

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన రూ.11,300 కోట్ల విలువైన మోసపూరిత లావాదేవీలపై భయాందోళనలను పారద్రోలడానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రంగంలోకి దిగింది. ఆర్థికసేవల విభాగం సంయుక్త కార్యదర్శి లోక్ రాజన్ బుధవారం న్యూఢిల్లీలో మాట్లాడుతూ ఇది చేయి దాటి పోయిందని నేను భావించడంలేదు. ప్రస్తుతానికి ఇది పెద్దగా ఆందోళన చెందాల్సిన పనిలేదు అని అన్నారు.

నీరవ్ మోడీ... డైమండ్ కింగ్

• మూడు ఖండాల్లో వ్యాపార విస్తరణ • ప్రియాంక చోప్రా బ్రాండ్ అంబాసిడర్

న్యూఢిల్లీ: ప్రస్తుతం పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంలో ప్రముఖంగా వినిపిస్తున్న వజ్రాల వ్యాపారి కమ్ డిజైనర్ నీరవ్ మోడీ జీవన ప్రస్థానం అత్యంత ఆసక్తికరమైనది. నీరవ్ మోడీ వజ్రాల వ్యాపారుల కుటుంబంలో జన్మించాడు. ప్రపంచానికి వజ్రాల రాజధానిగా పేరుగాంచిన బెల్జియంలోని యాంట్‌వెర్ప్‌లో పెరిగారు. అమెరికాలోని పెన్సిల్వేనియాలో వార్టసన్ స్కూల్‌లో విద్యాభ్యాసాన్ని మధ్యలోనే వదిలేశాడు. వజ్రాల వ్యాపారంలోకి రంగప్రవేశం చేశాడు. నీరవ్ తన మొట్టమొదటి స్టోర్‌ను 2014లో ఢిల్లీలో ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత ముంబైలో మరో దుకాణం నెలకొల్పాడు. ముంబైని తన కంపెనీకి ప్రధాన కేంద్రంగా చేసుకున్నాడు. 2016లో న్యూయార్క్ సమీపంలోని మ్యాడిసన్ స్క్వేర్ వద్ద ఒక స్టోర్‌ను అత్యంత అట్టహాసంగా ప్రారంభించాడు. స్టోర్ ప్రారంభ కార్యక్రమానికి హాలీవుడ్ యాక్టర్ నయోమి వాట్స్, బాలీవుడ్ నటీమణులు, మోడల్స్ లిసా హెడన్. నిర్మత్ కౌర్, టాప్ ఫ్యాషన్ మోడల్ కొకొ రోచా హాజరయ్యారు. నీరవ్ ఆభరణాల డిజైన్లకు బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా వ్యవహరిస్తున్నారు. అతడు వజ్రాలను ఆభరణాలుగా మాత్రమే కాక పెట్టుబడిగా ప్రమోట్ చేస్తుంటాడు. ఫోర్బ్స్ పత్రిక భారత్‌లో అత్యంత పిన్నవయస్కుడైన బిలియనర్ అంటూ నీరవ్ మోడీని ఆకాశానికి ఎత్తేసింది. 2.3 బిలియన్ డాలర్ల విలువైన ఫైర్‌స్టర్ డైమండ్ కంపెనీకి ఆయన వ్యవస్థాపకుడు. ఆసియాలో చైనా నుంచి ఉత్తర అమెరికాలో హవాయి దీవుల దాకా నీరవ్ వ్యాపారం మూడు ఖండాలకు విస్తరించింది.

ఆయన 2013లో ఫోర్బ్స్ మిలియనీర్ల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. అప్పటి నుంచి అదే జాబితాలో తన స్థానాన్ని పదిలపరుచుకున్నాడు. 2016లో ప్రపంచంలో 1,067, భారత్‌లో 46వ ర్యాంకును నీరవ్ పొందాడు. అంతకు ఏడాది ముందు అంతర్జాతీయంగా 1,054, భారత్‌లో 82వ ర్యాంకును దక్కించుకున్నాడు. నీరవ్ మోడీని ఫోర్బ్స్ పత్రిక 2016లో భారతదేశపు వజ్రాల రారాజుగా వర్ణించింది.

ఆయన మిగతా సెలబ్రెటీల తరహాలో ప్రజలకు అంత తేలిగ్గా కనిపించే సెలబ్రెటీ కాదు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఫిర్యాదుల మేరకు 10 రోజుల క్రితం సీబీఐ బుక్ చేసేంతవరకు సామాన్యులకు నీరవ్ మోడీ గురించి పెద్దగా తెలియదు. శక్తిమంతమైన వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు, వజ్రాల కొనుగోలుదార్లకు నీరవ్ సుపరిచితుడు.

ప్రస్తుతం పిఎన్‌బిని మోసం చేశారనే అభియోగాలను ఆయన ఎదుర్కొంటున్నాడు. సీబీఐ మొదట దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో మోసపూరితంగా లావాదేవీల విలువ రూ.280 కోట్లు అని పేర్కొంది. గీతాంజలి బ్రాండ్ పేరుతో ఆభరణాలు, రత్నాభరణాల గొలుసుకట్టు దుకాణాలు నిర్వహిస్తున్న మోహుల్ చోస్కీ, నీరవ్ మోడీపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఇద్దరూ కలిసి రూ.280 కోట్ల మేరకు మోసం, ఫోర్జరీకి పాల్పడ్డారని ఆరోపిస్తూ పిఎన్‌బి చేసిన ఫిర్యాదుకు స్పందనగా సీబీఐ కేసు నమోదు చేసింది. కానీ ప్రస్తుతం ఆ లావాదేవీల విలువ రూ.10,000 కోట్లుగా ఆవిర్భవించింది.

మోసం కేసులో పిఎన్‌బి సీబీఐకి ఒక లిఖిత పూర్వక ఫిర్యాదు చేసిన రెండు రోజుల తర్వాత అంటే జనవరి 31న ఆదాయ పన్ను అధికారులు ఢిల్లీ, సూరత్, జైపూర్‌లోని నీరవ్ కార్యాలయాలపై దాడులు జరపడంతో నీరవ్ మోడీ ఎవరనేది ప్రజా బాహుళ్యానికి తెలిసివచ్చింది.

ఎన్నికల కమిషనర్ల జీతాలు పెంపు



న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘంలోని ఎన్నికల కమిషనర్ల జీతాలు రెండు రెట్లు పెరిగాయి. చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌తో పాటు ఎన్నికల సంఘంలోని మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల వేతనాలు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల జీతాలతో సమానంగా పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ లోని కమిషనర్‌లకు నెలకు రూ. 90 వేల జీతాలు చెల్లిస్తుండగా.. తాజా నిర్ణయం ప్రకారం ఇకనుంచి వారికి నెలకు రూ. 2.50 లక్షల వేతనం అందనుంది. పెంచిన వేతనాలు జనవరి 1, 2016 నుంచి వర్తిస్తాయి. ఈ ఈ నిర్ణయంతో గత చీఫ్ ఎలక్షన్ కమిషనర్లు, ఎలక్షన్ కమిషనర్లకు కూడా లబ్ది చేకూరనుంది.వారివారి సేవలకు అనుగుణంగా జీతాల పెంపు చేసినట్లు తెలుస్తోంది. గతనెల 25న సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల జీతాల పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కు కూడా అదే విధానాన్ని అమలు చేసినట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. కేంద్రం నిర్ణయంతో ముగ్గురు ఎన్నికల కమిషనర్లు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులతో సమానంగా జీతాలు పొందనున్నారు. ఎలక్షన్ కమిషన్ చట్టం 1991 లోని సెక్షన్ -3 ప్రకారం ఎన్నికల సంఘంలోని చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర కమిషనర్లకు సుప్రీంకోర్టు న్యాయ మూర్తులు, హైకోర్టు సీజేలతో సమానంగా వేతనం ఇవ్వాలి. ఈనేపథ్యంలోనే కేంద్రం జీతాల పెంపు నిర్ణయం తీసుకుంది.

'రోడ్డు ప్రమాదంలో 23మంది దుర్మరణం'

ట్రిపోలి: లిబియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 23 మంది వలస కార్మికులు దుర్మరణం చెందగా..100 మందికిపైగా గాయపడ్డారు. 300 మంది వలస కార్మికులతో వెళ్తున్న ట్రక్ బనీ వాలిడ్ నగరానికి సమీపంలో ప్రమాదానికి గురవ్వడంతో అక్కడికక్కడే 23 మంది మృతి చెందారు. వలస కార్మికులంతా ఇరిట్రియన్, సోమాలియా దేశాలకు చెందిన వారుగా అధికారులు గుర్తించారు. పరిమితికి మించి ప్రయాణికులను ట్రక్కులో ఎక్కించుకోవడం వల్లే ప్రమాదం జరిగిందని తెలిపారు. గాయపడిన వారిలో కొంత మంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలియజేశారు.

'ప్రజారోగ్యానికి తోడ్పాటునివ్వండి'



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యం కోసం ఏర్పాటు చేసుకున్న లక్ష్యాల సాధనలో ప్రైవేటు రంగం ఇతోధికంగా తోడ్పడాలని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు చెందిన రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఢిల్లీ బ్రాంచిని ప్రారంభించిన ఆయన, అనంతరం చేసిన ప్రసంగంలో దేశంలోని వైద్య, ఆరోగ్య రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ప్రస్తావించారు. ఢిల్లీలోని మాలవీయనగర్‌లో మధుకర్ ట్రస్ట్ భాగస్వామ్యంతో రెయిన్‌బో హాస్పిటల్స్ గ్రూపు పిల్లల కోసం 150 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నెలకొల్పింది. ఈ కార్యక్రమంలో కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, స్థానిక ఎంపీ రమేశ్ బిధూరి, స్థానిక ఎమ్మెల్యే సోమనాథ్ భారతి, రెయిన్‌బో హాస్పిటల్స్ ఛైర్మన్ డా. రమేశ్ కంచర్ల, ఎంపీలు కేశినేని శ్రీనివాస్ (నాని), డా. కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం చివర్లో ప్రసంగించిన ఉపరాష్ట్రపతి, దేశంలో పిల్లల్లో పౌష్టికాహార లోపం తీవ్రమైన సమస్యగా కొనసాగుతోందని, అభివృద్ధికి ఇదే అతిపెద్ద సవాలుగా నిలుస్తోందని వ్యాఖ్యానించారు. ఒక అంచనా ప్రకారం ప్రతి ఏటా 10.8 లక్షల మంది ఐదేళ్ల లోపు చిన్నారులు చనిపో తున్నారని, కారణాలను విశ్లేషిస్తే తక్కువ బరువుతో పుట్టడం, నెలలు నిండకుండా ప్రసవించడం, నిమోనియా, డయేరియా వంటి అంశాలే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయని ఆయనన్నారు.

నేతాజీ మరణంపై మేనల్లుడి పుస్తకం

న్యూఢిల్లీ : భారత స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణంపై ఇప్పటికే పలు పుస్తకాలు వచ్చాయి. అయినా ఆయన మరణంపై ఎప్పుడూ ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంటుంది. దీనికి ముగింపు పలకాలనే ఉద్దేశంతో నేతాజీ మేనల్లుడు ఆశిష్ రే నిర్ణయించుకున్నారు. అందుకే బోస్ మరణం వెనుక సంఘటనలపై అధికారిక, అనధికార నివేదికలు, వివరాలను సేకరించి 'లెయిడ్ టు రెస్ట్' పేరుతో పుస్తక రూపంలో తీసుకు వచ్చారు. నేతాజీ కుమార్తె అనితాబోస్ పఫఫ్స్ ముందు మాటతో ఈ పుస్తకం మొదలవుతుంది. ఇందులో పొందు పరిచిన 11 విచారణ నివేదికలూ చివరికి నేతాజీ ఆగష్టు 18 1945లో మరణించినట్లు తేల్చాయి.ఢిల్లీలోని బికనీర్ హౌస్‌లో జరిగిన పుస్తకావిష్కరణ సందర్భంగా రచయిత మాట్లాడుతూ.. వీరోచిత మూర్తి సుభాష్ చంద్రబోస్ మరణంపై ఉన్న ఊహాగానాలకు ఈ పుస్తకం ముగింపు పలుకుతుందనే ఆశిస్తున్నా. ఈ 11 నివేదికలలో 4 ఇండియా, 3 జపాన్, 3 బ్రిటీష్, 1 తైవాన్‌కు చెందినవి ఉన్నాయి. ఇవన్నీ దాదాపుగా మావయ్య 1945 ఆగష్టు 18నే మరణించినట్లు తేల్చాయి.

యాసిడ్ బాధితురాలితో నిశ్చితార్థం

మానవత్వం చాటుకున్న మెడికల్‌రిప్ సాహు

లక్నో: 2009లో ప్రేమికుల దినోత్సవం రూపంలో ఆమెను మృత్యువు తరుముకొచ్చింది.. 25 ఏళ్ల యువతి యాసిడ్ దాడికి గురై బుధవారానికి తొమ్మిదేళ్లు పూర్తయ్యాయి. ఆ సమయంలో ఈ ఘటన లక్నోలో తీవ్ర దుమారం రేపింది. ఆమె చికిత్సకు ఎంతో సహాయంగా నిలిచిన సరోజ్ సాహుతో ఆమెకు బుధవారం నిశ్చితార్థం జరిగింది. ఒడిశాలోని జగద్‌పూర్‌లో ప్రమోదిని యాసిడ్ దాడికి గురైంది. ఆ సమయంలో ఆమె శరీరం 80శాతం కాలిపోవడంతో పాటు కంటి చూపు కోల్పోయింది. వైద్య చికిత్సల అనంతరం ఆమెకు 20 శాతం చూపు మాత్రమే వచ్చింది. 'ఆ రోజు పరీక్షరాసి ఇంటికి వెళ్తున్న సమయంలో యాసిడ్ దాడి జరిగింది. దీంతో నేను తీవ్రంగా గాయ పడ్డాను. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తొమ్మిది నెలలు శారీరక, మానసిక క్షోభ అనుభవించాను' అని ప్రమోదిని నాటి ఘటన తలుచుకుంది. ఐదేళ్ల పాటు మంచానికి పరిమితమైంది.

భారత్ ఓ అద్భుత శక్తి

న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల్లో సంక్షేమం విషయంలో భారత్‌కు ఎదురులేదని, భవిష్యత్ కాలంలో ఓ అద్భుత శక్తిగా ఎదుగుతుందని కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయపడ్డారు. మార్చిలో నిర్వహించతలపెట్టిన వేదిక్ యజ్ఞలో భాగంగా మట్టి, నీటి సేకరణలో బుధవారం రాజ్‌నాథ్ సింగ్ రథ్‌యాత్రను ఇండియా గేట్ వద్ద ప్రారంభించారు.

మోడీ పన్ను... ట్రంప్ ఫైర్

వాషింగ్టన్: భారతదేశం హార్లీ-డేవిడ్‌సన్ మోటార్‌సైకిళ్ళపై దిగుమతి సుంకాన్ని అధికంగా మోపుతున్నదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విమర్శించారు. ఇది ఇలాగే కొనసాగిన పక్షంలో అమెరికా దేశానికి వేలాదిగా వస్తున్న భారతీయ మోటార్‌సైకిళ్ళపై దిగుమతి సుంకం పెంచుతామని బెదిరించారు. డోనాల్డ్ ట్రంప్ ఉక్కు పరిశ్రమపై కాంగ్రెస్ సభ్యులతో చర్చ చేపట్టిన సందర్భంగా దిగుమతి సుంకాన్ని 75 శాతం నుంచి 50 శాతానికి తగ్గిస్తూ భారత ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావించారు. అది సరిపోదని అన్నారు. అమెరికా తరహాలో మోటార్ సైకిళ్ళపై దిగుమతి సుంకం విధించరాదని ట్రంప్ సూచించారు . మోటార్ సైకిల్‌ను భారత్‌కు దిగుమతి చేయడానికి 50 నుంచి 75 శాతం సుంకం చెల్లించాలి. భారతదేశం అమెరికాకు వేలాది మోటార్ సైకిళ్ళను విక్రయిస్తుంటుంది. వాటిపై అమెరికా సుంకం విధించడం లేదని ట్రంప్ పేర్కొన్నారు.వుంటే పరస్పర పన్ను విధానం ఉండాలి అని తెలిపారు. అప్పుడే అది హేతుబద్ధమైన వాణిజ్యమని అనిపించుకుంటుంది.

చైనా వాణిజ్య విధానంపై మండిపడ్డ ట్రంప్

అధ్యక్ష పదవిలో కూర్చుంది మొదలు కీలక, వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న అమెరికన్ అధ్యక్షుడు ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు ప్రకటించారు. అది చైనాతో ఉన్న వాణిజ్య సంబంధాలపై కావడం మరింత ఆసక్తిని రేపుతోంది. బుధవారం తన మంత్రివర్గ సహచరులతో వైట్ హౌస్‌లో నిర్వహించిన ఓ సమావేశంలో చైనా అనుసరిస్తున్న అసంబద్ధమైన వాణిజ్య విధానం అమెరికన్ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపు తోందని, ఇది రెండు బలమైన ఆర్థిక వ్యవస్థలు కలిగిన అగ్ర దేశాల మధ్య ఆర్థిక యుద్ధానికి దారి తీసేలా ఉందని ట్రంప్ పేర్కొన్నట్లు అధ్యక్షుడి వాణిజ్య కార్యదర్శి విల్‌బర్ రోజ్ పేర్కొన్నారు. మనదేశం స్టీల్, అల్యూమినియం ఉత్పత్తుల ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం, ఉపాధి అవకాశాలను కలిగి ఉంది.. కానీ చైనా తన అవసరానికి మించి వీటిని ఉత్పత్తి చేస్తోంది. అంతేకాకుండా ఆ అదనపు ఉత్పత్తులను అమెరికన్ మార్కెట్‌లలో డంప్ చేస్తోంది. దీని వల్ల అమెరికా ఆదాయంతో పాటు ఉద్యోగాల విషయంలో కూడా ఇబ్బందులు ఎదురౌతున్నాయి. దీనిపై ఇప్పటికే మా నిపుణుల బృందం అన్ని అంశాలను, క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. సత్వరం తగిన చర్యలు తీసుకోక పోతే భవిష్యత్‌లో మరిన్ని కొత్త ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది అని ట్రంప్ అన్నారు.

ఆ పోర్న్‌స్టార్‌కు ట్రంప్ డబ్బు చెల్లింపు నిజమే

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ పోర్న్‌స్టార్ స్టెఫానీక్లిఫ్ఫోర్డ్ అలియాస్ స్ట్రోమీ డేనియల్స్‌కు 1,30,000 వేల డాలర్లను చెల్లించిన మాట నిజమేనని ట్రంప్ వ్యక్తిగత న్యాయవాది మైఖేల్ కోహెన్ మీడియాకు వెల్లడించారు. అయితే ఇది ఎందుకు చెల్లించాల్సి వచ్చిందో మాత్రం వివరించలేదు.

అమెరికాలో కాల్పుల మోత: ముగ్గురి మృతి,

అమెరికాలోని న్యూ ఓర్లియన్స్‌లో రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ముగ్గురు మృతి చెందగా..ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సాంప్రదాయ కవాతు మార్గంలో బుధవారం మధ్యాహ్నం సాయుధుడు రెండుసార్లు జరిపిన కాల్పుల్లో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. చిన్నారి సహా మరోవ్యక్తి తీవ్రంగాగాయపడ్డాడు. మరో ప్రదేశంలో కారులో వెళ్తున్న ఐదుగురిపైదుండగుడు కాల్పులు జరిపాడు. కారులోని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు అధికారులు వివరించారు. ప్రజలు హౌస్ పార్టీ నిర్వహించుకుంటుండగా మూడోసారి కాల్పులు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. అందరీ సెలబ్రేషన్స్‌లో ఉండగా ఒక్కసారిగా తుపాకుల మోత జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

సముద్రంలో ఊడి పడిన విమాన ఇంజిన్ కవర్

యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం తృటిలో ఘోర ప్రమాదం నుంచి తప్పించుకుంది. విమాన ఇంజన్ పై కవర్ ఊడి పోవడంతో పైలెట్‌లు చాకచక్యంగా వ్యవహరించి అత్యవసర లాండింగ్‌కు చర్యలు తీసుకోవడంతో 373 మంది ప్రాణాలు గాలిలో కలిసి పోకుండా ఆపగలిగారు. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 1175 విమానం శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి హొనలులు బయలు దేరింది. విమానం పసిఫిక్ మహాసముద్రంపై ఎగురుతుండగా దాని కుడివైపున ఉన్న ఇంజిన్ కవర్ ఊడి సముద్రంలో పడిపోయింది. దీంతో విమానం కుదుపులకు గురైంది. విషయాన్ని గమనించిన పైలెట్‌లు అత్యవసర ల్యాండింగ్‌ను ప్రకటించి, చాకచక్యంగా డేనియల్ కె ఇనోయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా దించారు.



టీసీఎస్ ఎంటర్ ప్రైజెస్ డేటాలేక్ ఆవిష్కరణ

న్యూయార్కు / ముంబై : టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) బుధ వారం నాడు ఎంటర్‌ప్రైజెస్ డేటా లేక్ (ఈడీఎల్) అడ్వాన్స్డ్ ఎనలిటిక్స్‌ను అమెజాన్ వెబ్‌స ర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్) కోసం ఆవిష్కరించింది. ఈ సేవలు కావాలనుకొనే కంపెనీలు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగానికి చెం దిన వారికి కూడా ఈ సేవలందిస్తామని ప్రకటించింది. బ్యాంకింగ్‌తో పాటు ఫైనాన్షియల్ కంపెనీలు ఇతర వ్యాపారాలు తమ డేటా ను వేగవంతంగా పం పించుకోవచ్చునని తెలిపింది. సాధారణంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీ సెస్‌లో డేటా పంపించడంలో కొన్ని ఇబ్బందు లు తలెత్తుతుంటాయని, దీంతో బ్యాం కులు, ఫైనా న్షియల్ సర్వీసెస్‌లు ప్రా డె కంటే కస్టమర్‌లను దృష్టిలో ఉంచుకొన్ని కొత్త ప్లా ట్‌ఫాంకు మారిపోవాలని సూ చిం చింది. ఎం దుకంటే బ్యాం కింగ్, ఫైనాన్షియల్ రంగాల్లో పెద్దమొత్తంలో డేటా చెయిన్‌తో కూడుకున్నదని, కస్టమర్‌కు వీలైనంత త్వరగా డేటా అంది వ్వా ల్సిన బాధ్యత బ్యాంకులపై ఉం టుందని టీసీఎస్ గ్లోబల్ హెడ్ అండ్ అల యె న్స్ టె క్నాలజీ యూనిట్ రామన్ వెంకటరామన్ ఒక ప్ర కటనలో తెలిపారు. ప్రపం చవ్యా ప్తంగా ఉన్న తమ క స్టమర్లు కొత్త టెక్నాలజీ ద్వారా లబ్ది పొందవచ్చునని తెలిపారు.



ఎఫ్‌పీఐలను మించిన

దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు

• గతేడాది మొత్తం పెట్టుబడి 1400కోట్ల డాలర్లు

న్యూఢిల్లీ : భారత్ స్టాక్ మార్కెట్లో గతేడాది దేశీయ ఇన్వెస్టర్లు రికార్డు స్థాయిలో 1400 కోట్ల డాలర్లు (రూ.90,700 కోట్లు) పెట్టబుడులు పెట్టాయి. విదేశీ ఇన్వెస్టర్లతో పోల్చుకుంటే ఇది రెట్టింపు అని తాజా నివేదికలో వెల్లడైంది. దేశీయ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడంతో విదేశీ ఇన్వెస్టర్ల ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. దీంతో మార్కెట్లు స్థిరపడతాయి. భారతీయ ఫండ్ మేనేజర్లే కాకుండా దేశీయ ఇన్వెస్టర్ కూడామార్కెట్లో పెద్ద కరెక్షన్ రావాలని చూస్తున్నారని.. ఎందుకంటే కరెక్షన్ వస్తే పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టాలని వారి ఆలోచన అని మార్నింగ్‌స్టార్ సీనియర్ రీసెర్చి ఎనలిస్టు హిమాంషు శ్రీవాత్సవ తెలిపారు. గతేడాది మొత్తానికి చూస్తే దేశీయ ఇన్వెస్టర్లు రూ.90,700 కోట్లు పెట్టుబడులు పెడితే, విదేశీ ఇన్వెస్టర్లు రూ.51,000 కోట్లు మాత్రమే పె ట్టుబడులు పెట్టాయి. కేవలం మార్చి నెలలో మాత్రం దేశీయ ఇన్వెస్టర్లు షేర్లని వి క్రయించారు. అటు తర్వాత నుంచి వరుసగా కొనుగోళ్లకు పాల్పడ్డారని త్రెలియజేశారు.

అపోలో లాభం రూ.67.44కోట్లు



న్యూఢిల్లీ : అపోలో హాస్పిటల్స్ ఎంటర్ ప్రైజెస్ డిసెంబర్‌తో ము గిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతి పది కన నిక రలాభం 7.4 శాతం క్షీణించి రూ.67.44 కోట్ల కు దిగి వచ్చింది. దీనికి ప్రధాన కారణం కంపెనీ వ్యయం పెర గడమేనని బీ ఎస్ఈకి సమా చారం అం దించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.72.80 కోట్లని.. రెవెన్యూ విష యానికి వస్తే డిసెంబర్ త్రైమాసికంలో రూ.1896.14 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏ డాది ఇదే త్రైమాసికంలో రూ.1680.61 కోట్లని తెలియజేసింది. అయితే కంపెనీ వ్యయం రూ.1806.16 కోట్లకు చేరిపోగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1599.62 కోట్లుగా తేలింది. హెల్త్‌కేర్ సర్వీసెస్ ద్వారా రూ.1,008.21 కోట్ల రెవెన్యూ ఆర్జిస్తే.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.891.89కోట్లుగా ఉంది. ఫార్మా వ్యాపారం రెవెన్యూ రూ.888.09 కోట్లు కాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.788.84 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది.

లేటెస్ట్ వన్ డాట్‌కామ్

రెవెన్యూ 18శాతం వృద్ధి

హైదరాబాద్ : పాల్‌రెడ్ టెక్నాలజీస్ లిమిటెడ్‌కు చెందిన లేటెస్ట్‌వన్ డాట్ కామ్ ...డిసెంబర్ త్రైమాసికంలో రెవెన్యూ 18 శాతం వృద్ధితో రూ.13.91కోట్ల ఆర్జించినట్లు ప్రకటంచింది. అదే సమయంలో నష్టాలను కూడా 14 శాతం నుంచి ఆరు శాతానికి తగ్గించుకుందన్నట్లు తెలిపింది. ఈ- కామర్స్ రంగానికి చెందిన కంపెనీ వరుసగా గత రెండు ఆర్థిక సంవత్సరాల నుంచి మెరుగైన ఆర్థిక ఫలితాలను సాధిస్తోందని పేర్కొంది. గత తొమ్మిది నెలల నుంచి రోజుకు 3,500 నుంచి 5,000 వరకు ఆర్డర్లను ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపింది.

గ్యారెంటీ పీఎన్‌బీది...

షోకు నీరవ్‌మోడీది!

• యూనియన్, అలహాబాద్, యాక్సిస్ బ్యాంకులకు సెగ



హైదరాబాద్ : ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.11,400 కోట్ల మోసం జరిగిందన్న వార్త బ్యాంకింగ్ రంగాన్ని కుదిపేసింది. కేంద్రంలో ఆర్థికమంత్రిత్వశాఖ షాక్ గురైంది. బిలియనీర్ నగల వ్యాపారి నీరావ్ మోడీ మోసపూరితంగా ముంబైలోని పీఎన్‌బీ బ్రాంచీ నుంచి లెటర్ ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఒక విధంగా చెప్పాలంటే బ్యాంకు గ్యారంటీ) తీసుకున్నారు. ఈ బ్యాంక్ గ్యారంటీ దక్కించుకోవడానికి ఆయన బ్యాంకుకు చెందిన ద్వితీయ శ్రేణి అధికారులతో సహాయంతో దక్కించుకున్నారు. పీఎన్‌బీ బ్యాంకు గ్యారంటీని తీసుకుని మోడీ విదేశీ బ్యాంకులతో పాటు భారతీయ బ్యాంకుల నుంచి వేలాది కోట్ల రూపాయల రుణాలు తీసుకున్నారు. దీనిపై సీబీఐ విచారణ చేపట్టింది. బ్యాం కు యాజమాన్యం పది మంది అధికారులు సస్పెన్షన్ చేసింది. రూ.11,400 కోట్ల పీఎన్‌బీఐ గ్యారంటీతో మోడీ ఇతర ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులతో పాటు ప్రైవేట్ బ్యాంకుల నుంచి రుణాలను తీసుకున్నారు. అవి యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకులున్నాయి. ఈ బ్యాంకులు కూడా పీఎన్‌బీ ఇచ్చిన బ్యాంకు గ్యారంటీని తీసుకుని రుణాలు ఇచ్చినట్లు చెప్పుకోచ్చాయి. సాధారణంగా బ్యాంకులు వ్యాపారులకు లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ (ఎల్ఓయు)లను జారీ చేస్తుంటాయి. ఇక్కడ పీఎన్‌బీ జారీ చేసిన ఎల్ఓయును తీసుకుని బ్యాంకులు మోడీకి పెద్దమొత్తంలో రుణాలు ఇచ్చాయి. సాధారణంగా బ్యాంకుల ఎల్ఓయులను వ్యాపారులకు జారీ చేస్తుంటాయి. ఈ లెటర్‌ను తీసుకొని సదరు వ్యాపారవేత్త ఆ బ్యాంకు బ్రాంచీ నుంచేకాకుండా ఇతర బ్యాంకుల నుంచి .. లేదా అవే బ్యాంకులు విదేశాల్లోని బ్రాంచీలు ఉంటే వాటిని రుణాలు తీసుకున్నారు. సాధారణంగా బ్యాంకులు నగల కంపెనీలతో మంచి సంబంధాలు కొనసాగి స్తుంటాయి. వారి వ్యాపార టర్నోవర్‌ను బ్యాలెన్స్‌షీట్లను బట్టి బ్యాంకులు వారిపై నమ్మకంతో ఎల్ఓయులు జారీ చేస్తుంటాయి.గత వారం పీఎన్‌బీకి సీబీఐకి చేసిన ఫిర్యాదులో నగల వ్యాపారి మోడీ మోసపూరితంగా జనవరి 16వ తేదీన ఎల్ఓయు దక్కించుకున్నారని తెలిపింది. దీంతో విదేశాల్లో బ్రాంచీలపై నియంత్రణా సంస్థలుదృష్టి పెట్టాయి. నీవార్‌మోడీకి చెందిన నగల కంపెనీకి విదేశాల్లో పెద్ద షోరూంలున్నాయి. ఆయనకు హాంగ్‌కాంగ్, దుబాయి, న్యూయార్కులో షాపులున్నాయి. బ్యాంకింగ్ వర్గాల సమాచారం ప్రకారం ఆయన 2010 నుంచి బ్యాంకుల నుంచి క్రెడిట్ ఆధారిత ఎల్ఓయూ తీసుకుంటున్నారని తెలిసింది. పీఎన్‌బీఐ ఇచ్చే ఎల్ఓయులను గతకొన్ని సంవత్సరాల వరకు బ్యాంకులు అంగీకరించి మోడీకి డబ్బులు సమకూర్చి పెట్టాయి. చివరగా జనవరి 5వ తేదీన కూడా బ్యాంకులు మోడీ ఇచ్చిన పీఎన్‌బీ గ్యారంటీకి నగదు సమకూర్చాయి. ఇంతకు అసలు చిక్కు ఎక్కడ వచ్చిందంటే జనవరి 25వ తెదీన మోడీ చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో అసలు కథ బయటికి వచ్చింది. బ్యాంకింగ్ వర్గాల సమాచారం ప్రకారం పీఎన్‌బీ నగల వ్యాపారాన్ని అదనంగా పది శాతం మార్జిన్ కట్టాలని కోరింది. ఎంత రుణం తీసుకుంటారో దానికి అదనంగా పది శాతం ఇస్తే ఎల్ఓయు ఇస్తామని, లేదంటే ఎల్ఓయు ఉపసంహరించుకుటామని స్పష్టం చేసిందని చెబుతున్నారు. ఇతర బ్యాంకులు నుంచి వస్తున్న ఎల్ఓయు చెల్లింపులను చెల్లించడానికి పీఎన్‌బీ ఆయా బ్యాంకులకు డబ్బు చెల్లించడానికి నిరాకరించింది. దీంతో ఒక బ్యాంకు హాంగ్‌కాంగ్ సెంట్రల్ బ్యాంకుకు, రిజర్వుబ్యాంకుకు పీఎన్‌బీపై ఫిర్యాదు చేశాయి. అయితే ఎల్ఓయుపై ఇతర బ్యాంకులు ఇచ్చిన రుణాల గురించి ఆ బ్యాంకులు చెప్పేదేమిటంటే తాము వ్యక్తిని చూసి రుణం ఇవ్వమని.. పీఎన్‌బీఐ ఎల్ఓయు జారీ చేసింది కాబట్టి దాన్ని గౌరవించి రుణాలు ఇస్తామని స్పష్టంచేస్తున్నాయి. పీఎన్‌బీ జారీ చేసిన ఎల్ఓయును చూసి రూ.2,000 కోట్లు రుణాలు మంజూరు చేశామని పేరుచెప్పడానికి నిరాకరించిన బ్యాంకర్ ఒకరుచెప్పారు. దీనిపై హాంగ్‌కాంగ్ సెంట్రల్ బ్యాంకుకు ఫిర్యాదు కూడా చేసినట్లు, వివరాలు కూడా ఇచ్చినట్లు ఆ బ్యాంకర్ చప్పారు. ఇదిలా ఉండగా పీఎన్‌బీఐ బుధవారం నాడు బీఎస్ఈకి ముంబై బ్రాంచీలో 1.77 బిలియన్ డాలర్ల మోసం జరిగినట్లు గుర్తించినట్లు చెప్పింది. ఎంపిక చేసిన ఖాతాల్లోనే ఈ లావాదేవీలు జరిగాయని గుర్తించామని తెలిపింది.ఇదిలా ఉండగా పీఎన్‌బీఐలో జరిగిన మోసం ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది.

ఇప్పటికే మొండిబకాయిలతో కునారిల్లు తున్న పీఎస్‌యు బ్యాంకులను గాడిలో పెట్టాలని ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తోంది. దీనికి గాను రూ. 2.11 లక్షల కోట్ల మూలధనం ఇవ్వాలనుకుంది. తాజాగా రూ.88వేల కోట్ల మూలధనం కూడా బ్యాం కులకు మంజూరు చేసింది. తాజా పరిణామంలో ఆర్థికమంత్రిత్వశాఖ షాక్ గురైనా.. తర్వాత తబాయించుకుని పరిస్థితి చేయి దాటలేదని సర్ధి చెబుతోంది.ఇక్కడ అసలు విషయానికి వస్తే పంజాబ్ నేషనల్ బ్యాంకు మొత్తం రూ.4.5 లక్షల అడ్వాన్స్‌లు ఇచ్చింది. అంటే రుణాలుగా చెప్పుకోవచ్చు. ఈ బ్యాంకు మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.36వేలకోట్లు.. మొత్తం ఇచ్చిన రుణాల్లో రూ.11,400 కోట్ల మోసం జరిగితే మొత్తం ఇచ్చిన అడ్వాన్స్‌లో 2.5 శాతం ఎన్‌పీఏగా మారిపోయినట్లు అని బ్యాంకర్లు చెబుతున్నారు. 2015లో ఢిల్లీలోని బ్యాంకు ఆఫ్ బరోడాలో బిలియన్ డాలర్ల స్కాం బయటపడింది. భారతీయ కరెన్సీ ప్రకారం రూ.6 లక్షల కోట్లు చెప్పుకోవచ్చు. ఇక్కడ సిబ్బందితో వ్యాపారులు కుమ్మక్కయ్యారు. ఇలాంటి మోసాలు పీఎస్‌యు బ్యాంకుల్లో ఇంకా ఎన్ని వెలుగు చూడాల్సి వస్తోందో కాలమే చెప్పాలి.

జీఎంఆర్ నష్టాలు

రూ. 566 కోట్లు

హైదరాబాద్ : జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరనష్టం రూ.568.94 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.643.44 కోట్లు ఆర్జించినట్లు బీఎస్ఈకి కంపెనీ సమాచారం అందించింది. కంపెనీ ఆదాయం కూడా స్వల్పంగా తగ్గి రూ.2295.83 కోట్లకు దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2587.26 కోట్లుగా ఉంది. అదే సమయంలో కంపెనీ వ్యయం కూడా కాస్తా దిగి రూ.2487.90 కోట్లకు దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.2623.74కోట్లని తెలిపింది. జీఎంఆర్ గ్రూపు విషయానికి గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ విమానాశ్రయాలు, ఎనర్జీ, రవాణా, పట్టన మౌలికరంగాల్లో వ్యాపారాలు చేస్తోంది. కంపెనీ ఫోర్టుపోలియో విషయానికి వస్తే ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, హైదరాబాద్‌లో రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రమయం, మాక్టాన్ సెబు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును మెగావైడ్ భాగస్వామ్యంతో ఫిలిప్పీన్స్‌లో నిర్మిస్తోంది. అలాగే గోవాలో మోపా గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మిస్తోంది. గ్రీస్‌లో కూడా భాగస్వామ్యంలో విమానాశ్రయాలు నిర్మించి .. నిర్వహిస్తుంది. అలాగే ఢిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాలను ఆనుకొని స్మార్ట్‌సిటిలను నిర్మిస్తుంది.



రీసైక్లింగ్ మెటీరియల్‌తో

అదానీ విల్‌మార్ వంటనూనె ప్యాకింగ్

adani wilmar

హైదరాబాద్: వంటనూనెల రంగంలో మార్కెట్ లీడర్ అదానీ విల్‌మార్ లిమిటెడ్ (ఎడబ్ల్యుఎల్), మార్కెట్లో ఫార్చ్యూన్ ఎడిబుల్ ఆయిల్ బ్రాండ్‌ను (వంటనూనె)ను విక్రయిస్తోంది. పర్యావరణానికి హానికలిగించే ప్యాకేజికి బదులు రీసైక్లింగ్ మెటిరియల్ వినియోగించి కొత్త ప్యాక్‌లో ఫార్చ్యూన్ వంటానూనెలు త్వరలో మార్కెట్లో విడుదల చేయబోతోంది. ఒక లీటర్ వంటనూనెను ప్యాక్ దేశంలో మొట్టమొదటిసారి మార్కెట్లో విడుదల చేస్తామని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఈఫీ సర్ అగ్నుష్ మాలిక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే రోజుల్లో కంపెనీకి చెందిన ఇతర బ్రాండ్‌లను కూడా రీసైక్లింగ్ మెటిరియల్ ప్యాకింగ్‌ను వినియోగిస్తామని ఆయన చెప్పారు. అదానీ గ్రూపు, విల్‌మార్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సింగపూర్‌లో 1999లో ప్రారంభించారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.22వేల కోట్ల వ్యాపారం చేస్తోంది. దేశీయ వంట నూనెల మార్కెట్లో 21 శాతం వాటాను కైవసం చేసుకుంది.

సన్‌ఫార్మా లాభంలో 75శాతం ఆవిరి!

• క్యూ3లో రూ. 365కోట్లు

న్యూఢిల్లీ : ఫార్మా దిగ్గజం సన్‌ఫార్మా డిసెంబర్ త్రైమాసికం ఫలితాలు నిరుత్సాహానికి గురి చేశాయి. నికరలాభంలో 75.2శాతం క్షీణించి రూ.365.4 కోట్లకు దిగివచ్చాయి. అనుకోని పన్ను వ్యయం భారం లాభాలపై పడింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.1,471.82 కోట్లని కంపెనీ బీఎస్ఈకి సమాచా రం అందించింది. అనుకోకుండా రూ.513.02 కోట్ల వ్యయం భరించాల్సివచ్చిం దని తెలిపింది. రెవెన్యూ విషయానికి వస్తే 16 శాతం క్షీణించి రూ.6653.23 కోట్లకు దిగివచ్చింది. బీఎస్ఈ దాని షేరు 2.53 శాతం క్షీణించి రూ.574.45 వద్ద ముగిసింది.

స్వల్పంగా తగ్గిన టాటాపవర్ లాభాలు

• క్యూ3లో రూ. 611కోట్లు


TATA POWER

ముంబై : టాటాపవర్ నికర లాభం ఏడాది ప్రాతిపదికన చూస్తే స్వల్పంగా తగ్గి రూ.611 కోట్లకు దిగివచ్చింది. కంపెనీకి ఖర్చులతో పాటు రెవెన్యూ కూడా పెరిగింది. పన్ను లబ్ది కొంత వరకు కలిసొచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.619 కోట్లు ఆర్జించింది. కాగా రెవెన్యూ విషయానికి వస్తే 6 శాతం పెరిగి రూ.6,949 కోట్లు సాధించగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.6,574 కోట్లని ఒక ప్రకటనలో తెలియజేసింది.

గ్రాసీమ్ ఇండస్ట్రీస్‌కు

ఐడియా సెగ!

• తగ్గిన లాభాలు • క్యూ3లో రూ. 787కోట్లు



న్యూఢిల్లీ : ఆదిత్యబిర్లా గ్రూపునకు చెందిన గ్రాసీమ్ ఇండస్ట్రీస్ డిసెంబర్‌తో ము గిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభం రూ.786. 87 కోట్లు ఆర్జిం చింది. కంపె నీకి అను బంధ సంస్థ నష్టా లు శాప ంగా మారాయి. క్రితం ఏడా ది ఇదే త్రైమాసి కంలో కంపెనీ నికరలాభం రూ.952.33 కోట్లని బీఎస్ ఈకి సమా చారం అందించింది. మొత్తం ఆదాయం క్యూ3లో రూ.15, 523. 75కోట్లు కాగా క్రి తం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 7, 743.51 కోట్లని తెలి పింది. అయితే డిసెం బర్ త్రైమాసికం ఆదాయాన్ని గతేడా ది తో పోల్చు చూడరాదని కోరింది. ఎందు కంటే ఆదిత్యబిర్లా నువో కు చెందిన అ ను బంధ సంస్థ అల్ట్రాటెక్ సిమెంట్ గతేడాది జయప్రకాశ్ అసోసియేట్ లిమిటెడ్‌తో పాటు జెపీ సిమెంట్ కార్పొరేషన్‌ను గత ఏడాది టేకోవర్ చేసింది. దీంతో పాటు జులై 1,2017 నుంచి కొత్త జీఎస్టి అమల్లోకి వచ్చినందు వల్ల డిసెంబర్ త్రైమా సి కం రెవెన్యూ... అంతక ం ముందు ఏడాదితో పో ల్చుకోరాదని పేర్కొంది. కంపెనీ లాభాలు తగ్గడానికి ప్రధాన కారణం ఐడియా సెల్యూలార్ లిమిటెడ్‌తో పాటు దా ని అనుబంధ సంస్థలు భారీగా నష్టపోవడమే కారణం తెలిపింది. కంపెనీకి చెం ది ను అనుబంధ సంస్థ ఫలితాలు ఇలా ఉన్నా యి. దేశీయ విస్కోస్‌స్టేపల్ ఫైబ ర్(వీ ఎస్ఎఫ్) అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 9 ట శాతం పెరిగాయి. అల్ట్రాటెక్ రెవె న్యూ 34 శాతం పెరిగి రూ.8,019 కోట్లకు చే రిందని గ్రాసీం ఇండస్ట్రీస్ తెలిపింది. కంపెనీ భవిష్యత్తు గురించి ప్రస్తావిస్తూ.. వీ ఎస్ఎఫ్ వ్యాపారంపై మరింత ఫోకస్ పెడతామని, ప్రభుత్వం మౌలికరంగంతో పాటు గ్రామీణాల్లో చౌకగృ హాలను పెద్దెత్తున నిర్మిస్తామని ప్రకటించడంతో సిమెంట్‌కు డిమాండ్ ఉంటుం దన్నారు.

ఆస్పత్రుల్లో రోగులకు విక్రయించే ఆహారంపై జీఎస్టీ లేదు

న్యూఢిల్లీ : ఆసుపత్రుల్లో రోగులకు అందించే ఆహారంపై జీఎస్టీ విధించవద్దని డాక్లర్ల సలహాకు ప్రభుత్వం సమ్మతించింది. అయితే ఆస్పత్రుల్లో రోగులను చేర్చకపోతే (రోగుల తరపున వచ్చిన వారికి) మొత్తం ఆహారం విలువపై టాక్స్ చెల్లించాల్సి వస్తుందని స్పష్టం చేసింది. రెవెన్యూశాఖకు తరచూదీనిపైవచ్చే ప్రశ్నకు ప్రభుత్వం సమాధానంఇచ్చింది. వీటితో పాటు ఆస్పత్రుల్లో సీనియర్ డాక్టర్లు, కన్సెల్టెంట్లు, టెక్నిషియన్లసేవలపై కూడా జీఎస్టి విధించమని వివరించింది. వీరంతా హెల్త్‌కేర్ సర్వీసెస్‌కు కిందికి వస్తారని పేర్కొంది.

ఆంధ్రాబ్యాంకు ఎంసీఎల్ఆర్ రేట్లు తగ్గింపు

హైదరాబాద్ : ప్రభుత్వరంగానికి చెందిన ఆంధ్రాబ్యాంకు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ .. బేస్డ్ ఆన్ లెండింగ్ రేట్స్ (ఎంసీఎల్ఆర్)15.02.-18 నుంచి .. వోవర్‌నైట్ కాలానికి వడ్డీరేట్లను 15 బేసిస్ పాయింట్లు తగ్గించింది. 8.00 శాతంనుంచి 7.85 శాతానికి సవరించింది. ఒక నెల కాలపరిమితిపై10 బేసిస్ పాయింట్లు 8.05 శాతం నుంచి 7.95 శాతానికి మూడు నెలలు, ఆరు నెలలు, ఒక సంవత్సరం కాలానికి మాత్రం రేట్లలో ఎలాంటి మార్పుల్లేవు. ఒక సంవత్సరం కాలపరిమితిపై బ్యాంకు వడ్డీరేటు 8.40 శాతంలో ఎలాంటి మార్పులేదని ప్రకటనలో పేర్కొంది.

భారత్ మార్కెట్ కీలకం: బీఎండబ్ల్యు

• ప్రీమియం బైక్‌ల ధర రూ. 15.6లక్షల నుంచి రూ. 29.9లక్షలు • ఆటోఎక్స్ 2018లో ప్రదర్శన




న్యూఢిల్లీ : జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల కంపెనీ బీఎండబ్ల్యుకు అనుబంధ సంస్థ బీఎండబ్ల్యు మోటోరాడ్ ప్రీమియం మోటారసైకిల్‌ను తయారు చేస్తోంది. భవిష్యత్తులో భారత్ తమకు కీలకమార్కెట్‌ని స్పష్టం చేసింది. గతేడాది భారత్ మార్కెట్లో ప్రీమియం బైక్‌లను విక్రయించడం మొదలు పెట్టింది. ప్రారంభించిన తొమ్మది నెలల కాలానికి 252 యూనిట్లు విక్రయించింది. వీటి ధర రూ.15.6 లక్షల నుంచి రూ. 29.9 లక్షలు (ఎక్స్ షోరూం). ప్రస్తు తం ఢిల్లీలో కొనుసాగుతున్న ఆటోఎక్స్‌లో కంపెనీ కొత్త రెండు మోడల్స్ బీఎండబ్ల్యు ఎఫ్ 750 జీఎస్ ధర రూ.12.2 లక్షలు, బీఎండబ్ల్యు ఎఫ్ 850 జీఎస్ దీని ధర రూ.13.7 లక్షలుగా ప్రకటించింది.

ఈ ఏడా ది రెండవ సగభాగం నుంచి కంపెనీ ఎంట్రీ లెవెల్ మోడల్స్‌ను జీ310 రేంజి బైక్‌లను మార్కెట్లో విడు దల చేస్తుంది. ఈ బైక్‌లను దీనికి దీర్ఘకాలిక భాగ స్వామి చెన్నైకు చెం దిన టీవీఎస్ మోటార్ కంపెనీలో ఉత్పత్తి చేస్తుంది. మొత్తానికి తమ ప్రీమిమం బైక్‌లకు భారత్ కీ లక మార్కెట్ అని బీఎం డబ్ల్యు మో టోరాం డ్ వైస్ ప్రెసి డెంట్, మార్కె టింగ్ సేల్స్ టిమో రెచ్ చెప్పా రు. దీంతో పాటు మెరు గైన డీలర్ నెట్‌వర్కు కూడాకావాల్సి ఉంటుందన్నారు. ప్రస్తు తం దేశ వ్యా ప్తంగా ఏడు మంది డీలర్లు ఉన్నారు. ఈ ఏడాది చి వరినాటికి 10 డీలర్లకు పెంచుతామని.. కనీసం నాలుగు కొత్త మోడల్స్ ను తీసుకొస్తామ న్నారు. జీ310 రేంజి బైక్‌లను గ్లోబల్ మార్కెట్లు మె క్సికో, బ్రెజిల్, యూరోప్‌లో విడుదల చేశామని.. ఈ ఏడాది చివరి నాటికి భారత్ మార్కెట్లో ఎంట్రీ ఇస్తుందని వివరించారు.

ఎన్ఎండీసీ లాభం రూ.887కోట్లు

• క్యూ3లో 40శాతం వృద్ధి



హైదరాబాద్ : ప్రభుత్వరంగానికి చెందిన ఎన్ఎండీసీ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం టర్నోవర్ స్వల్పంగా ఒక శాతం తగ్గి రూ.2,469 కోట్లకు దిగివచ్చింది. అయితే పన్ను చెల్లించడానికి ముందు నికరలాభం 50 శాతం వృద్ధితో రూ.1,377 కోట్లకు చేరగా.. పన్ను చెల్లించిన తర్వాత రూ.887 కోట్లకు చేరిందని ఒక ప్రకటనలో తెలిపింది. అదే తొమ్మది నెలల కాలానికి చూస్తే టర్నోవర్‌లో 30 శాతం పెరిగి రూ.7,732 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే తొమ్మిది నెలల కాలానికి రూ.5,958 కోట్లుగా తేలింది. పన్ను చెల్లించడానికి ముందులాభం 37 శాతం పెరిగి రూ.4,187 కోట్లు కాగా.. అంతకు ముందుఏడాది ఇదే కాలంలో రూ.3062 కోట్లుగా తేలింది. పన్ను చెల్లించిన తర్వాత నికరలాభం 30 శాతం పెరిగి రూ.2,700 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదేకాలంలో రూ.2,077 కోట్లని ఎన్ఎండీసీ ఒక ప్రకటనలో పేర్కొది. కాగా ముడి ఇనుము ఉత్పత్తి తొమ్మిది నెలల కాలానికి 24.23 మిలియన్ టన్నులకు చేరింది. ఉత్పత్తిలో మూడు శాతం పెరిగింది. అయితే అమ్మకాల్లో మాత్రం ఒక శాతం క్షీణించి 25.24 మిలియన్ టన్నులకు దిగివచ్చింది. మూడు నెలల కాలానికి ముడి ఇనుము ఉత్పత్తి 12 శాతం క్షీణించి 8.56 మిలియన్ టన్నులకు దిగిరాగా.. అమ్మకాల విషయానికి వస్తే 20 శాతం క్షీణించి 8.06 మిలియన్ టన్నులకు దిగివచ్చిందని కంపెనీ ఒకప్రకటనలో తెలిపారు. మంగళవారం నాడు ఎన్ బైజేంద్రకుమార్ చైర్మన్ నేతృత్వంలో బోర్డు సమావేశంలో క్యూ3 ఫలితాలను ఆమోదించారు.

లాభాల స్వీకరణ!

• భారీగా క్షీణించిన బ్యాంకు షేర్లు • 10శాతం నష్టపోయిన పీఎన్‌బీ • గ్లోబల్ మార్కెట్లో మిశ్రమ స్పందన • 114పాయింట్ల పతనం

ముంబై : మార్కెట్ చివరి గంటలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్ప డ్డంతో సెన్సెక్స్ 144 పాయింట్ల వరకు పతనమైంది. రిజర్వుబ్యాంకు మొండి బకాయిలు గుర్తించేందుకు కొత్త నిబంధనలు తీసుకొస్తున్నట్లు ప్రకటించిన నేప థ్యంలో బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు కుప్పకూలాయి. ప్రభుత్వరంగానికి చెం దిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) లో 1.77 బిలియన్ డాలర్లు రూ.11,335 కోట్ల మోసం జరిగినట్లు బహి ర్గతం కావ డం తో పీ ఎస్‌బీ షేరు 9.81 శా తం క్షీ ణిం చింది. బ్యాంకులు మొండి బకాయిలు త్వరగా గుర్తించడానికి కొన్ని నిబంధనలు కఠినతరం చేసింది. రుణాలు చెల్లింపులో జాప్యాన్ని గుర్తించడానికి ఆర్ బీఐ కొన్ని ని బంధనలు తీసుకొచ్చింది. ఆర్‌బీఐ ఇప్పటికే అరడజను రుణపునర్వ్యవస్థీకరన ప్రతి పాదనను రద్దు చేసింది. దీనికి బదులు 180 రోజుల గడువు ఇచ్చింది. బ్యాంకులు వీ టిని అంగీకరించిన వెంటనే డిఫాల్టర్‌ను ఖాతాను బ్యాంక్‌రప్టసీ కోడ్‌ను పంపిస్తుంది. ఇక మార్కెట్ల విషయానికి వస్తే ప్రారంభంలో 34,436.98 వద్ద ప్రారంభమైంది. అ టు తర్వాత గ్లోబల్‌మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు రావడంతో వెంటనే సూచి 34,473.33 పాయింట్లకు ఎ గబాకింది. అయితే చివరిగంటలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో 144.52 పాయింట్లు క్షీణించి 34, 155.95వద్ద ము గిసింది. నిఫ్టీ విషయానికి వస్తే 38.85 పాయింట్లు నష్టపోయి 10,500.90 వద్ద ము గిసింది. ఇం ట్రాడేలో 10. 590.55 నుంచి 10, 456.65 మధ్య త చ్చాడింది. అయితే సోమవారం నాడు విడుదలైన డిసెం బర్ పారిశ్రామికోత్పత్తి 7.1శాతానికి ఎగబాకడంతో పాటు రిటైల్ ద్రవ్యోల్బణం కాస్తా తగ్గడంతో ఈ రెండు అంశాలు మా ర్కెట్లకు బాగా కలిసొచ్చాయి. ఆర్‌బీఐ రుణాల పున ర్వ్య వస్థీకరణ పథకాన్ని రద్దు చేయడంతో పీఎస్‌యు బ్యా ంకు లు నష్టాల్లో మునిగిపోయాయని మార్కెట్ నిపుణులు చెబు తున్నారు. ఇదిలా ఉండగా విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ)లు సో మవారం నాడు రూ.814.11 కోట్ల షేర్లను విక్రయించగా, విదేశీయ ఇన్వెస్టర్లు రూ. 1342.70 కోట్ల షేర్లు కొనుగోలు చేసినట్లు మార్కెట్ గణాంకాలు తెలి య జేస్తు న్నాయి. బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్ల విషయానికి వస్తే ఎస్ బ్యాంకు 4.40 శాతం, ఎస్‌బీఐ 4.06 శాతం, యాక్సిస్ బ్యాంకు 3.35 శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 2. 29 శాతం, బ్యాం కు ఆఫ్ బరోడా 1.75 శాతం వరకు నష్టపోయాయి. వీటితో పాటు ఓ ఎన్‌జీసీ, సన్‌ఫా ర్మా, టీసీఎస్, పవర్‌గ్రిడ్, ఎన్ టిపీసీ, ఐటీసీ, బజాజ్‌ఆటో, మా రుతి సుజుకి, డాక్టర్ రెడ్డీస్, టాటాస్టీల్, హీరోమోటోకార్ప్, ఇన్ఫోసిస్, కోటక్ మ హీంద్రా బ్యాం కు, 2.62 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతి రేకంగా కోల్ ఇం డియా, రిల్, విప్రో, భారతి ఎయిర్‌టెల్, అదానీపోర్ట్స్, టాటామోటార్స్, ఎల్ అండ్‌టి, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, హెచ్‌యూఎల్, ఇండస్‌ఇండ్ బ్యాంకు 2.47 శాతం వ రకు లాభపడ్డాయి.



మిర్చి రైతు కంట్లో కారం!



- డిమాండ్ ఉన్నా దక్కని మద్దతు ధర
- వారంలోనే రూ.2 వేలు పడిపోయిన వైనం
- ఆందోళనలో అన్నదాతలు
- గత ఏడాదీ ఇదే పరిస్థితి
- కనీస మద్దతు ధర ప్రకటించని ప్రభుత్వాలు

అమరావతి, ఆంధ్రప్రభ: మిర్చి రైతు కళ్లలో కారం కొట్టేందుకు మళ్లీ రంగం సిద్ధమౌతోంది. నిన్నమొన్నటి వరకూ ఉన్న ధర ఒక్కసారిగా పడిపోవడం మొదలైంది. గత రెండు వారాలుగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, తెలంగాణలోని ఖమ్మం, వరంగల్ మిర్చి యార్డులకు మిర్చి పంట భారీగా తరలివస్తోంది. సగటున రోజుకు లక్ష టిక్కీలు వంతున మార్కెట్ యార్డులకు చేరుతోంది. గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1.22 లక్షలు, మంగళ వారం 90 వేలు, బుధవారం సాయంత్రానికి లక్ష టిక్కీల పైచిలుకు వంతున వచ్చాయి. గురువారం వీటి సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఇదే పరిస్థితి ఖమ్మం మిర్చియార్డులోనూ నెలకొంది. అయితే, గత వారం రోజుల్లో రూ.1000 నుండి రూ. 2,000 మేర ధరలు పడిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఇదే విధంగా ధరలు పడిపోయాయని గతాన్ని గుర్తుచేసుకుని తమకు న్యాయం జరిగేలా చూడాలని పాలకులను కోరుతున్నారు. ఈ ఏడాది జెమిని వైరస్ సోకడం వల్ల పంట దిగుబడులు గణనీయంగా తగ్గాయి. అనేచోట్లలో సహజంగానే పంటకు డిమాండ్ పెరగాల్సి ఉంది. కానీ, గత వారం ఇటీవలి వరకు నిలకడగానే ఉన్న ధరలు, సరుకు వస్తున్న కొద్దీ క్రమంగా పడిపోతున్నాయి. మార్కెట్లో వ్యాపారులు, దళారులు సిండికేట్ అవ్వడమే ఇందుకు ప్రధాన కారణమని రైతులు చెబుతున్నారు. వీరు సిండికేట్‌గా మారి తమ పంటను దోపిడీ చేస్తున్నారని చెబుతున్నారు. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోతే తమ ఆశలు ఆవిరైపోతా బ్రతుకు భారంగా మారిపోతుందని ఆవేదన చెందుతున్నారు. సరిగ్గా పంట ఉత్పత్తులు మార్కెట్ యార్డులకు వచ్చే సమయానికి దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు నియంత్రణకు పాల్పడుతున్నారు. 2016 డిసెంబర్ తరువాత అప్పటివరకు మిర్చి రైతుకు గిట్టుబాటు ధర లభించలేదు. 15 రోజుల వరకు గుంటూరు, ఖమ్మం, వరంగల్ మిర్చియార్డులో క్వింటాల్ మిర్చి రూ.11,275లు ఉండగా, ఈనెల 10వ



తేదీనాటికి రూ.9 వేలకు పడిపోయింది. దీంతో రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. మరో రెండు నెలల పాటు మార్కెట్‌కు మిర్చి భారీగా తరలిరానున్న తరుణంలో ఈ పరిణామం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారు. పరిస్థితి ఏంటనే భయం మిర్చి రైతును వెంటాడుతోంది. గతేడాది జనవరి 10న క్వింటాల్ మిర్చి ధర రూ.11,500 లు ఉంటే ఆ మరుసటి రోజున రూ. 11,200 పలికింది. ఆ తరువాత ఫిబ్రవరి 1వ తేదీన రూ. 10,400 వేలు ఉండగా, 3వ తేదీన రూ.9,900, 6వ తేదీన రూ. 9,100 పలికింది. చివరికి ఏప్రిల్ 27వ తేదీ నాటికి క్వింటాల్ ధర ఏకంగా రూ.2 వేలకు పడిపోయింది. దీంతో ఆరేడోజు తీవ్ర ఆగ్రహానికి గురైన రైతులు ఖమ్మం మిర్చియార్డులో విధ్వంసానికి దిగారు. వ్యవసాయ మార్కెట్ యార్డుపై దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో దాడికి పాల్పడిన రైతులకు బేడీలువేసి కోర్టుకు తరలించడం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సంచలనం సృష్టించింది. ఇది రాజకీయంగా పెనుదుమారం లేపింది. ఇక గుంటూరు మిర్చి యార్డులో కూడా రైతులు ఆందోళనలు చేశారు. పంటను రోడ్డు మీద పడేసి తమ నిరసన తెలిపారు. దీంతో మిర్చి కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపుతున్నామంటూ హామీ ఇచ్చి మరిచిపోయారు.

ఈ సారికూడా అదే పరిస్థితి తలెత్తుతుందని మిర్చి రైతులు ఆందోళనతో ఉన్నారు. సాధారణంగా తెలంగాణలో ఖమ్మం, వరంగల్, మెహబూబ్ నగర్ తదితర జిల్లాల్లోనూ, ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లోనూ వేలాది ఎకరాల్లో సాగవుతోంది. ఏప్రిల్‌లో ఈసారికూడా వ్యవసాయ మార్కెట్‌లకు మిర్చి పంట భారీగా తరలిరానున్నట్లుగా అంచనా వేస్తున్నారు. తెలంగాణలో 87,220 మెట్రిక్ టన్నులు, ఆంధ్రలో లక్ష టన్నులపైచిలుకు మిర్చి ఈసారి ఉత్పత్తి కావచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. నిజానికి మిర్చి పంటకు కనీస మద్దతు ధర లేదు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నారు. నిరుడు మద్దతు ధర అందుబాటులో లేకపోవడంతో కోల్డ్ స్టోరేజీలు కూడా ఏమాత్రం సహాయకారిగా ఉండకపోవడంతో రైతులు బాగా నష్టపోయారు. మార్కెట్‌కు మిర్చి తరలివచ్చే సమయానికి వ్యాపారులందరూ మొదలవుతుంది. డిమాండ్ పెరిగిన సమయంలో అమ్మేందుకు అనుకూలమైన ధర లేకపోయిందని కష్టపడి పండించిన పంటను తక్కువ ధరలకే అమ్ముకున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తగినన్ని కోల్డ్ స్టోరేజీలు లేనందువల్లే ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఉన్నవాటి కొద్ది కోల్డ్‌స్టోరేజీలు వ్యాపారుల చేతిలో ఉండటంతోనే రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారవుతోంది. నాణ్యతలేదంటూ కొందరి రైతుల పంటను కొనుగోలు చేయని ఘటనలు చాలా ఉన్నాయి. ఈ సారి కూడా అదే పరిస్థితి తలెత్తితే తమ పరిస్థితి ఏమిటని మిర్చి రైతులు భయాందోళనలకు గురవుతున్నారు.



ముందస్తుకు పరీక్ష!

(మొదటిపేజీ తరువాయి)

వర్గాల్లో ముందస్తు అంశం చర్చనీయాంశం అవుతోంది. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా, మోడీ హవా మసకబారక ముందే సార్వత్రిక ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ భావిస్తోందా? అంటే అవుననే సంకేతాలు ఆ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.

మరోసారి ఢిల్లీ పీఠంపై కాషాయ పతాక ఎగురవేసేందుకు కమలనాథులు తహతహలాడుతున్నారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్న సమయంలోనే ఎన్నికలకు వెళ్తే మంచిదన్న అభిప్రాయంతో ఉన్నారు. ఇప్పటికైతే ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఆశాజనకంగానే ఉన్నాయి. ద్రవ్యోల్బణం అదుపులో ఉంది. వృద్ధిరేటు అంచనాలను చేరుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి సంస్థలు భారత దేశ వృద్ధిరేటుపై సానుకూలంగా ఉన్నాయి. అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు కూడా ఇండియాకు అనుకూలంగానే ప్రగతి నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇదేసమయంలో మూడున్నరేళ్లలో నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయ, గ్రామీణ భారతానికి జవసత్వాలు ఇచ్చేందుకు బడ్జెట్‌లో జైట్లీ సింహభాగం కేటాయింపులు ఇచ్చారు. తద్వారా రైతులు, పల్లెజనాల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని తొలగించే చర్యలు చేపట్టారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనుభవాల నుంచి పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు సాగనుంది.

8 రాష్ట్రాల ఎన్నికలే కీలకం

ఈ యేడాది జరగనున్న ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే ముందస్తును ఖరారు చేస్తాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒకరకంగా ప్రధానిగా నరేంద్ర మోడీ పరిపాలనకు ఈ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా భావించవచ్చన్నది వారి వాదన. ప్రజలు బీజేపీ, దాని మిత్రపక్షాలకు జైకొడితే గనుక అదే సమరోత్సాహంతో మోడీ సర్కారు ముందస్తు ఎన్నికలకు తప్పక వెళ్తుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీనికితోడు రబీ సీజన్ కూడా ముందస్తును ప్రభావితం చేసే అవకాశం ఉంది. రుతుపవనాలు అనుకూలించి, ఆశించిన స్థాయిల్లో పంట దిగుబడులు రావాలి. విపణిలో రైతు పండించిన పంటలకు సరైన మద్దతు ధర లభించాలి. అప్పుడే అన్నదాత మోడీ పరిపాలనను స్వాగతిస్తాడు.లేదంటే గుజరాత్ తరహా అనుభవం ఎదురయ్యే ప్రమాదం ఉంది. పై రెండు అంశాలు ఏమాత్రం ప్రతికూలమైనా, ముందస్తు ఆలోచనను ఎన్డీయే విరమించుకోక తప్పదని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ మధ్య కాలంలో నిరుద్యోగ యువత ఆకాంక్షలను నెరవేర్చే ప్రయత్నం చేయాల్సిన అవసరం కూడా ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగునకు మోడీ ప్రభుత్వం తక్షణ కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

చమురు సెగల కలవరం!

నరేంద్ర మోడీ ప్రధానిగా పగ్గాలు చేపట్టిన నాటినుంచి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ముడిచమురు అంశం దన్నుగా నిలిచింది. 2014 ప్రారంభంలో బ్యారెల్ ధర 110 డాలర్లుగా ఉన్న క్రూడాయిల్ మరుసటి ఏడాది ద్వితీయార్థం నాటికి 30 డాలర్ల కనిష్ఠ స్థాయికి చేరింది. దాదాపు 80 డాలర్ల మేరకు పతనమైంది. ఈ తగ్గుదలను నేరుగా వినియోగదారులకు బదలాయించని కేంద్రం, ఖజానా లోటును భర్తీ చేసుకుంటూ వచ్చింది. ఈ క్రమంలో ద్రవ్యలోటు అదుపులోకి రావడం, వృద్ధిరేటు ఊతమిచ్చింది. ప్రజాసంక్షేమ పథకాలకు ఇతోధికంగా నిధులు కేటాయించే వెసులుబాటు ఎన్డీయేకి లభించింది. ముడిచమురు ధరలు ప్రస్తుతం వృద్ధిరేటే దిశలో ఉన్నాయి. నిన్నమొన్నటి వరకు మోడీ ప్రభుత్వానికి వరంగా మారిన చమురు అంశమే ఇప్పుడు కలవరానికి గురిచేస్తున్నది. కనిష్ఠస్థాయి నుంచి ఊర్ధ్వముఖంగా పరుగులు తీస్తున్నది. ప్రస్తుతం 65 డాలర్లకు చేరువయింది. రానున్న రెండు త్రైమాసికాల్లో పెట్రో ధరలు 75-80 డాలర్లకు చేరొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తద్వారా ద్రవ్యోల్బణం రంకెలు వేసే ప్రమాదం ఉంది. సంక్షేమ పథకాల నిధులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశమూ ఉంది. ఇదేగనుక జరిగితే ముందస్తు ఎన్నికల మాట వినిపించకపోవచ్చు.

కాషాయభారతం సాకారమయ్యేనా?

2014లో నరేంద్రమోడీ ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టిన తర్వాత, కాషాయ పార్టీ అనూహ్యంగా పుంజుకుంది. ఒక్కో రాష్ట్రాన్ని క్రమంగా తమ ఏలుబడిలోకి తెచ్చుకుంటూ, కాషాయ భారత్ లక్ష్యానికి చేరువగా వచ్చింది. దేశంలోని 29 రాష్ట్రాలకు గాను 19 రాష్ట్రాలు బీజేపీ కూటమి నియంత్రణలో ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర వంటి ప్రధాన రాష్ట్రాల్లో బీజేపీయే అధికారంలో ఉంది. సొంతంగా 14 రాష్ట్రాల్లో, మిత్రులతో కలిసి మరో 5 రాష్ట్రాల్లో కమలం పాగావేసింది. ఈ యేడాది ఎనిమిది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నందున, బీజేపీ కాషాయ భారతం ఆశలు ఏమేరకు నెరవేరతాయో వేచిచూడాలి.

ఎందుకు? ఎవరికి? దుగ్గరాజపట్నం!



(మొదటిపేజీ తరువాయి)

కూడా లేకపోలేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఆ పోర్టును పూర్తిగా వ్యతిరేకిస్తోంది. అందుకే గడిచిన నాలుగు సంవత్సరాల్లో పోర్టు అభివృద్ధి కోసం ఎటువంటి ప్రణాళికలు రూపొందించలేదు. అటు కేంద్రంలోను ఒక సామాజిక వర్గానికి చెందిన నాయకులు, ఇటు రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వంలో అదే సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ నాయకులు సైతం పోర్టు ఏర్పాటు వైపు మొగ్గు చూపడం లేదు. అయితే ఇదే సమయంలో బీజేపీలోని మరో సామాజిక వర్గానికి చెందిన జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు పోర్టు ఏర్పాటు చేయాలంటూ గత కొంతకాలంగా నెల్లూరు జిల్లాలో ఆందోళన చేస్తుండడం చూస్తుంటే దుగరాజపట్నం పోర్టు రెడ్ సిగ్నల్ వెనుక పెద్ద వ్యవహారమే నడుస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వాకాడు మండలం దుగరాజపట్నం సముద్రతీరం వద్ద పోర్టు ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం ఉందని రైట్ సంస్థ 2007లోనే సర్వేచేసి అందుకు సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను అప్పటి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. రామాయపట్నం, కృష్ణపట్నం సముద్ర తీరంతో పోలిస్తే దుగరాజపట్నం తీరం 80 అడుగులకు పైగా లోతు ఉందని దీంతో భారీ నౌకలను సైతం ఈ ప్రాంతంలో లంగరు వేసేదానికి అనుకూలంగా ఉందని పై సంస్థ అప్పట్లోనే తన నివేదికలో స్పష్టం చేసింది. దీంతో అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పోర్టు నిర్మాణానికి ఆమోద ముద్ర వేయడంతో పాటు ఆ దిశగా భూములు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దీంతో 2013 సెప్టెంబర్ 16వ తేది అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో సమావేశమైన రాష్ట్ర మంత్రి వర్గం దుగరాజపట్నం పోర్టుకు 5481.85 ఎకరాల భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. అందులో 966.75 ఎకరాలు ప్రభుత్వ భూమి, 560.84 ఎకరాల సీజేఎఫ్ఎస్, 3954.20 ఎకరాల పట్టా భూమిని పోర్టు ఏర్పాటుకు కేటాయించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అందుకు సంబంధించి అప్పట్లో జిల్లా రెవెన్యూ అధికారులు కోట, వాకాడు మండలాల పరిధిలోని 9 గ్రామాల్లో భూసేకరణకు సంబంధించి సర్వే కూడా పూర్తి చేశారు. అందుకు సంబంధించిన రికార్డులను కూడా గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో భద్రపరిచారు. అయితే ఆ రికార్డులు ప్రస్తుతం మాయమైనట్లు ప్రచారం జరుగుతోంది. అవి నిజంగానే కనిపించడం లేదా.. లేక మాయం చేశారా అన్నది తెలియాల్సి ఉంది.

పులికాట్‌కు ఇబ్బంది లేకుండా తూపిలిపాలెం వద్దకు పోర్టు పరిధి మార్పు

దుగరాజపట్నం పోర్టు ఏర్పాటు వల్ల సమీపంలోని పులికాట్ సరస్సుకు పలు ఆటంకాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని తద్వారా పక్షుల సంరక్షణకు కూడా ఇబ్బంది ఉందని గతంలో పలు రాజకీయ పార్టీలు, పలువురు మేధావులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పోర్టు పేరునే మార్చాలని ప్రయత్నం చేసింది. అయితే భారత ప్రభుత్వం అప్పట్లో విడుదల చేసిన గెజిట్‌లో దుగరాజపట్నం పోర్టుగా చూపడంతో అవన్నీ మార్పులు చేయడం ఇప్పట్లో సాధ్యం కాదని అప్పట్లో కేంద్ర ప్రభుత్వంలోని పెద్దల సూచనల మేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పోర్టు పరిధిని 4 కిలోమీటర్లు వెనక్కి తగ్గించి తూపిలిపాలెం వద్ద దుగరాజపట్నం పోర్టును ఏర్పాటుచేసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. దీనివల్ల పులికాట్ సరస్సుకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు ఉండబోవు. అదేవిధంగా ప్రతియేటా నిర్వహించే పక్షుల పండుగకు పోర్టు వల్ల ఆటంకం కలిగే అవకాశం కూడా లేదు. పోర్టు పరిధిని తూపిలిపాలెం వద్దకు మార్చడం వల్ల దుగరాజపట్నం పోర్టు వల్ల పులికాట్‌కు ఇక ఎటువంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం లేదు. అయినా ప్రస్తుతం కొంతమంది పదేపదే పులికాట్ అంశాన్ని అడ్డం పెట్టుకుని పోర్టు ఏర్పాటుకు గండి కొట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

పోర్టు ఏర్పాటు వల్ల అందరికీ మేలు జరుగుతుంది: తిరుపతి ఎంపీ వరప్రసాద్



కేంద్ర ప్రభుత్వం పరిధిలోని దుగరాజపట్నం పోర్టు ఏర్పాటు వల్ల జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగడంతోపాటు పారిశ్రామికంగా జిల్లా ఎంతో అభివృద్ధి సాధించడానికి అవకాశం కలుగుతుందని తిరుపతి పార్లమెంట్ సభ్యులు వరప్రసాద్ అన్నారు. పోర్టు ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వంపై తాము ఒత్తిడి తెస్తున్నామని అయితే ఎందుకో ప్రభుత్వం పోర్టు వైపు మొగ్గుచూపడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దుగరాజపట్నం పోర్టు ఏర్పాటు వల్ల కృష్ణపట్నం పోర్టుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, చెన్నైలో 8 కిలోమీటర్ల పరిధిలోనే 3 పోర్టులు ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఆలోచించి పోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సామాజిక వేత్తలు కోరుతున్నారు.

రాకెట్ ప్రయోగాలకు.. ఇబ్బంది లేదన్న షార్ కంట్రోలర్

దుగరాజపట్నం పోర్టు ఏర్పాటు వల్ల రాకెట్ ప్రయోగాలకు ఎటువంటి ఇబ్బందులు లేవని షార్ అధికారులు గత ఏడాది సెప్టెంబర్ 9న అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా లేఖ రాశారు. అయితే ప్రయోగం జరిగే సమయంలో మాత్రం మూడు గంటలు పోర్టు పరిధిలో 25 కిలోమీటర్ల మేర నౌకల రాకపోకలను నిషేధించాలని మాత్రం లేఖలో సూచించారు. దీన్ని బట్టి చూస్తుంటే భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)కు పోర్టు ఏర్పాటు వల్ల ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టమైంది. అయినా కేంద్రం, రాష్ట్రంలోని కొంతమంది నాయకులు పోర్టు ఏర్పాటు వల్ల భవిష్యత్తులో షార్ ప్రయోగాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, అదేవిధంగా భద్రతకు కూడా ఆటంకాలు ఎదురవుతాయని పనికట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి షార్ అధికారులే పోర్టు ఏర్పాటు వల్ల ఇబ్బందులు లేవని గత ఏడాదే తమ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించారు.

కృష్ణపట్నం పోర్టు అభివృద్ధికి దుగరాజపట్నం ఆటంకం కాదంటున్న నిపుణులు

ఆంధ్రప్రదేశ్‌కు పొరుగునే ఉన్న తమిళనాడులోని చెన్నై పోర్టుకు 8 కిలోమీటర్ల పరిధిలోనే వరుసగా 3 పోర్టులు ఉన్నాయి. అయినా ఆ మూడు పోర్టులు ఒకదానికొకటి పోటీగా తమ ఆదాయాన్ని పెంచుకుంటూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయి. అయితే దుగరాజపట్నం పోర్టు వల్ల కృష్ణపట్నం పోర్టు అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని పలువురు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న వాదనా ఉంది. దుగరాజపట్నం పోర్టుకు, కృష్ణపట్నం పోర్టుకు మధ్య 20 కిలోమీటర్లకు పైగా వ్యత్యాసం ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 8 కిలోమీటర్ల లోపు కొత్త పోర్టు ఏర్పాటు చేయకూడదు. రాష్ట్రంలో విశాఖపట్నం పోర్టును నేవీకి కేటాయించిన తరువాత అందుకు ప్రత్యామ్నాయం గా మరో పోర్టును ఏర్పాటు చేయాలని అప్పట్లోనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే విశాఖ వద్ద నక్కపల్లి, ప్రకాశం జిల్లాలోని రామాయపట్నం, నెల్లూరు జిల్లాలోని దుగరాజ పట్నం ప్రాంతాలను పరిశీలించి అన్నింటికీ అనుకూలంగా దుగరాజ పట్నం ఉందని ఆ దిశగా పోర్టు ఏర్పాటుకు అప్పట్లోనే పచ్చజెండా ఊపింది. అయితే కృష్ణపట్నం పోర్టు అభివృద్ధికి దుగరాజపట్నం ఏ మాత్రం అడ్డంకి కాకపోయినప్పటికీ ఒక సామాజిక వర్గానికి చెందిన కొంతమంది నాయకులు వివిధ కారణాలు చూపుతూ దుగరాజపట్నం పోర్టును అడుగడుగునా అడ్డుకుంటున్నారని భారతీయ జనతా పార్టీలోని మరో సామాజిక వర్గం బహిరంగంగా విమర్శలు చేస్తోంది. ఆ విమర్శలకు బలం చేకూర్చే విధంగా ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయి.

కేంద్ర మాజీ మంత్రి బోళ్ల కన్నుమూత



తణుకులో బోళ్ల భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సీఎం

తణుకు, ప్రభ న్యూస్ : ప్రముఖ పారిశ్రామికవేత్త, కేంద్ర మాజీ మంత్రి బోళ్ల బుల్లిరామయ్య(91) బుధవారం ఉదయం తణుకులో మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బోళ్ల బుల్లి రామయ్య తణుకులోని ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. బుల్లి రామయ్య నాలుగుసార్లు ఎంపీగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. ఆయన ఆంధ్రా విశ్వవిద్యాలయం బిఎస్సి(సుగర్ టెక్నాలజీ), ఎంఎస్సీ (కెమికల్ టెక్నాలజీ) పూర్తి చేశారు. 1953లో ఆంధ్రాసుగర్‌లో టెక్నికల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా చేరారు. అనంతరం సంస్థ అభివృద్ధి, విస్తరణలో కీలక పాత్ర వహించారు. సుగర్ పరిశ్రమను అభివృద్ధి చేయడంతో పాటు అనేక పరిశ్రమలు స్థాపించి వేల మంది కార్మికులకు ఉపాధి కలిపించారు. ఇస్రో పరిశోధనా కేంద్రంలో రాకెట్ ఇంధనం సరఫరా చేసే పరిశ్రమను తణుకులో స్థాపించి తణుకు పట్టణానికి ప్రపంచ పటంలో మంచి గుర్తింపు తెచ్చారు. 2011 నుంచి ఆంధ్రాసుగర్స్‌కు మానేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి 7 సార్లు ఎంపిగా పోటీ చేసి 4 సార్లు గెలుపొందారు. కేంద్ర వాణిజ్య మంత్రిగా పనిచేసిన సమయంలో ప్రపంచ వాణిజ్య సంస్థల్లో భారతదేశ వాణిజ్య ప్రయోజనాల సంరక్షణ కోసం వివిద దేశాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించారు. ఒక సాంకేతిక నిపుణునిగా, పారిశ్రామికవేత్తగా తనకున్న అపార అనుభవాన్ని తన పదవీ బాధ్యల నిర్వహణలో తనదైన శైలితో వ్యవహరించేవారు. ఆయన మృతితో తణుకు పట్టణంలో విషాదచాయలు అలుముకున్నాయి. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసేసి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆరోగ్య శాఖా మంత్రి కామినేని శ్రీనివాస్, దేవాదాయశాఖా మంత్రి పైడికొండలు మాణిక్యాలరావు, ఎక్సైజ్ శాఖా మంత్రి కేఎస్ జవహర్, జడ్పీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఎంపి గోకరాజు గంగరాజు, తదితరులు ఆయన భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన స్వగ్రామమైన తూర్పుగోదావరి జిల్లా తాటిపాక లో గురువారంమధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.


భావితరాలకు బోళ్ల ఆదర్శం... చంద్రబాబు

తణుకులో బోళ్ల బుల్లిరామయ్య భౌతికకాయాన్ని ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం మధ్యాహ్నం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోళ్ల బుల్లిరామయ్య నన్నెంతో అభిమానించేవారని గుర్తు చేశారు. ఆయన భావితరాలకు ఆదర్శం గా నిలుస్తారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషి శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. రాజకీయాల్లో ఒక విశిష్టమైన పాత్రను పోషించారని, 7 సార్లు పార్లమెంట్‌కు పోటీచేసి 4 సార్లు యంపిగా గెలుపొందారని, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిం చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్రపోషిం చారన్నారు. పార్టీ అన్ని కార్యక్రమా ల్లో భాగస్వాములై పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. తెలుగుదేశం పార్టీలో 1984లో చేరిన ఆయన పార్టీకి పెద్ద దిక్కుగా ఉండేవారన్నారు. అటువంటి వ్యక్తిని పార్టీ కోల్పోవడం దురదృష్టకరమన్నారు. అనంతరం మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఆయన అమెరికాలో ఉన్నత విద్యనభ్యసించి ఆంధ్రాసుగర్ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారన్నారు.

స్పీకర్, మంత్రుల సంతాపం

అమరావతి, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి, ఆంధ్రా సుగర్స్ ఎండీ బోళ్ల బుల్లి రామయ్య(91) మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. బుల్లి రామయ్య రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషిచేశారని, ఆయన మరణం రాష్ట్రానికి, పార్టీకి తీరని లోటని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ఏపీ అబ్కారీ శాఖ మంత్రి కెఎస్ జవహర్ అన్నారు.అదేవిధంగా ఉపముఖ్య మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నారా లోకేష్, కామినేని శ్రీనివాస్, పైడికొండల మాణిక్యాలరావు, పితాని సత్యనారాయణ,మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు బుల్లిరామయ్య మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గుంటూరులోని టీడీపీ రాష్ట్రకార్యాలయంలో బుల్లి రావయ్య చిత్రపటానికి ఎమ్మెల్సీ వివివి చౌదరి, పార్టీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు.

ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే ఎం.వి.కృష్ణారావు మృతి



శ్రీకాకుళం, ప్రభ న్యూస్ బ్యూరో: ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే ఎం.వి.కృష్ణారావు బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన వయస్సు 83 సంవత్సరా లు. ఇచ్ఛాపురం ప్రాంతంలో కాంట్రాక్ట్ పనులతో ఇక్కడ వారికి పరిచయమైన ఎం.వి.కృష్ణారావు, తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తరువాత ఆ పార్టీలో చేరారు. పెద్దమనిషిగా ఎన్‌టిఆర్ వద్ద గుర్తింపు పొందిన ఆయన ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి 1983లో పోటీచేసి గెలుపొందారు. ఆ తరువాత ఆయన 85, 89, 99 సంవత్సరాలలోకూడా తెలుగుదేశంపార్టీ టిక్కట్టుపై పోటీచేసి గెలుపొందారు. 1994 ఎన్నికల సమయానికి ఎంవి కృష్ణారావుపై అనర్హతవేటు పడటంతో ఆ ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేకపోయారు. ఆ ఎన్నికల్లో కృష్ణారావు తన అనుచరుడైన దక్కత అచ్యుతరామిరెడ్డిని పోటీకి నిలిపి, ఆయన విజయంలో కీలక పాత్ర పోషించారు. మళ్లీ ఆయన 1999లో ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. 2004 లో ఎం.వి.కృష్ణారావును స్థానికేతరుడు అనే కారణంగా వేరేవారికి పార్టీ టిక్కట్టు ఇవ్వడంతో తీవ్ర మనస్థాపం చెందిన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆ తరువాత ఆయన వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో చేరారు.

సీఎం సంతాపం

ఇచ్ఛాపురం మాజీ ఎమ్మెల్యే ఎంవి.కృష్ణారావు మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ తరుపున నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ఉత్తరాంధ్రలో జనాధారణ కలిగిన నేతగా నిలిచారని శ్లాఘించారు. కృష్ణారావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

హస్తినకు హరీశ్, దేవినేని

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద దేశవ్యాప్తంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్మించ తలపెట్టిన 99 సాగునీటి ప్రాజెక్టులపై నేడు ఢిల్లీలో జరిగే సమావేశానికి తెలుగు రాష్ట్రాల నీటి పారుదల శాఖా మంత్రులు హాజరుకానున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు బుధవారం రాత్రి ఢిల్లీ చేరుకోగా, తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావు గురువారం ఉదయానికల్లా చేరుకోనున్నారు. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నేతృత్వంలో జరిగే ఈ సమావేశంలో రాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రులు, ఆయా రాష్ట్రాల ఇరిగేషన్ విభాగం ఉన్నతాధికారులు, ఆర్థిక శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులు, కేంద్ర జల సంఘం ఛైర్మన్, నాబార్డ్ ఛైర్మన్, తదితర ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. పీఎంకేఎస్‌వైలో ఎంపిక చేసిన ప్రాజెక్టుల నిర్మాణంపై సమీక్షిస్తూ, ఇందుకు అవసరమైన నిధులు, నాబార్డు ద్వారా అందిన మొత్తం తదితర అంశాలపై చర్చించనున్నారు.

వాలెంటైన్స్ వీక్‌లో పెరుగుతున్న ప్రెగ్నెన్సీలు

లండన్ : ప్రేమికుల రోజు దంపతులకు తీపి జ్ఞాపకాలను మిగులుస్తున్నట్లు ఇంగ్లాండ్ జాతీయ ఆరోగ్య సేవల అధ్యయనంలో వెల్లడైంది. ప్రతి ఏడాది ఫిబ్రవరి 14ను ప్రేమికులు వాలంటైన్స్ డే ను జరుపుకుంటుగా.. ఆ వారంలో ప్రెగ్నెన్సీల సంఖ్య సాధారణం కంటే 5శాతం ఎక్కువగా నమోదైన్నట్లు అధ్యయనంలో తేల్చారు. 2015 నుంచి అధ్యయనం నిర్వహించగా.. వాలంటైన్స్ వీక్‌లోనే దాదాపు 16వేల 263 మంది గర్భం ధరించినట్లు తెలిసింది.సంవత్సరంలోని ప్రతీ వారాన్ని ప్రామానికంగా తీసుకుని ప్రెగ్నెన్సీలపై అధ్యయనం చేయగా.. సాధారణ వారంలో 15వేల 427 మంది గర్భం దాల్చగా ప్రేమికుల రోజు జరుపుకున్న వారంలో మాత్రం ఈ సంఖ్య 16 వేల 263 మందితో 5శాతం ఎక్కువగా నమోదైనట్లు పేర్కొన్నారు.

ఏపీలో హవాలా దందా!

● ప్రధాన పట్టణాల్లో ముఠాలు
● సమాచారం ఇచ్చిన హైదరాబాద్ పోలీసులు ● రహస్య విచారణ సాగిస్తున్న అధికారులు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో హవాలా మాఫియా కార్యకలాపాలు జోరుగా సాగుతున్నా యనే సమాచారంపై పోలీసు, ఆదాయ పన్ను శాఖలు అప్రమత్తమయ్యాయి. ఏపీలోని విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి కేంద్రంగా రోజుకు రూ.10కోట్ల మేర హవాలా మార్గంలో నగదు మార్పిడీ వ్యవహారం సాగుతున్నట్లు ఆయా శాఖలకు కీలక సమాచారం అందింది. రెండు రోజుల కిందట హైదరాబాద్ పోలీసులు హవాలా వ్యాపారం నిర్వహిస్తున్న జయేష్‌కుమార్ పటేల్‌ను అదుపులో తీసుకోవడంతో ఆంధ్రప్రదేశ్‌లోని హవాలా వ్యాపా రుల విషయం వెలుగులోకి వచ్చింది. జయేష్‌సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసు, ఆదాయ పన్ను శాఖల అధికారులు రహస్య విచారణ సాగిస్తున్నారు. కొందరు బ్యాంకు అధికారులపాత్ర కూడా వెలుగులోకిరావడంతో లోతుగా దర్యాప్తు జరిపేందుకు ఆయా శాఖలు నిర్ణయించినట్లు తెలిసింది. పోలీసు, ఆదాయ పన్ను శాఖలు దృష్టిసారించడంతో హవాలా వ్యాపారులు, కొందరు బ్యాంకు అధికారులు ఆందోళన చెందుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లో హవాలా వ్యాపారుల మూలాలు గతంలోనే ఉన్నప్ప టికీ నోట్ల రద్దు, జీఎస్టీ వంటి విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత మరింత పెరిగినట్లు పోలీసు అధికారులు గుర్తించారు. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ, విశాఖపట్టణం, తిరుపతి పట్టణాలు వ్యాపార, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాయి. అనేక పరిశ్రమలు, వస్త్ర, బంగారు నగల షాపులు పెద్ద ఎత్తున వెలిశాయి. రాజధాని అమరావతి కేంద్రంగా సీఆర్‌డీఏ పరిధిలో రియల్ వ్యాపారం కూడా పెద్ద ఎత్తున సాగుతోంది. ఆర్థికపరమైన అన్ని లావాదేవీలు ఆన్‌లైన్ చేయడంతో పన్నుల నుంచి బయటపడేం దుకు వ్యాపారులు, రియల్టర్లు హవాలా మార్గాన్ని ఆశ్రయించినట్లు అధికారుల విచారణలో వెలుగు చూసింది. పెద్ద మొత్తంలో కూడగట్టిన నల్లధనం తెల్లధనంగా మార్చుకునేందుకు హవాలా వ్యాపారులు వీరికి సహకరిస్తున్నట్లు చెపుతున్నారు. కొన్ని పేరొందిన షాపుల్లో ఏ విధమైన వ్యాపార లావాదేవీలు నిర్వహించకుండానే నకిలీ బిల్లులు జారీ చేసి వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు బిల్డప్ ఇస్తున్నారు. తద్వారా రూ.కోట్ల రూపాయల నగదు తెల్లధనంగా మార్చుతున్నారు. నోట్ల రద్దు సమయం లోనే పాత నోట్ల మార్పిడీలో హవాలా వ్యాపారులే కీలక పాత్ర పోషించారు. వీరిని నిలువరించడంలో ఆయా శాఖలు వైఫల్యం చెందాయి.

పాత నోట్ల ముఠాలను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పిన అధికారులు..ఆ తర్వాత దర్యాప్తును మరిచిపోయారు. అప్పటి నుంచి కూడా వీరు ఇదే తరహాలో హవాలా వ్యాపారం నిర్వహిస్తున్నారు. అమరావతి రాజధాని సమీపంలో భూముల ధరలు మూడేళ్లుగా ఆకాశాన్నంటాయి. రాయలసీమ, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు పెద్ద మొత్తంలో భూములు కొనుగోలు చేశారు. పెద్ద మొత్తంలో నగదు తీసుకురావడం ఇబ్బంది కావడంతో వీరంతా హవాలా వ్యాపారులను ఆశ్ర యించారు. ఒక్క విజయవాడ పాతబస్తీ కేంద్రం గానే అరడజను మంది హవాలా వ్యాపారంలో ఆరితేరిన వారు ఉన్నట్లు చెపుతున్నారు. వీరందరికీ కొందరు పోలీసు అధికారుల వెన్నుదన్ను, బ్యాంకు అధికారుల సహకారం ఉందన్నా ఆరోపణలు ఉన్నాయి. మిగిలిన పట్టణాల్లో క ూడా పెద్ద మొత్తంలో వ్యాపారులను సమీకరించి వీరు హవాలా రూపంలో నగదు మార్పుడి వ్యవహారాలను చక్కబెడుతు న్నారు. గుట్టు చప్పుడు కాకుండా ఏళ్లతరబడి సాగుతున్న వీరి హవాలా దందా హైదరాబాద్ పోలీసుల అప్రమత్తతతో వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే ఆయా ప్రాంతాలకు చెందిన హవాలా వ్యాపారుల జాబితాను ఏపీ పోలీసులకు, ఐటీ అధికారులకు హైదరాబాద్ పోలీసులు అందజేశారు. అక్కడి పోలీసుల సమాచారంతో వీరి వివరాలు రాబట్టే పనిలో ఉన్నారు.

బ్యాంక్ మేనేజర్ ఇంట్లో

రూ.50 లక్షల విలువైన బంగారం చోరీ



వివరాలు సేకరిస్తున్న సిఐ దేగల ప్రభాకర్

కర్నూలు నగరంలో దొంగల హల్‌చల్

కర్నూలు క్రైం, ప్రభ న్యూస్: కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీ సమీపంలో బుధవారం మిట్ట మధ్యాహ్నం బ్యాంకు మేనేజర్ ఇంటి తాళాలు పగలగొట్టి రూ.50లక్షల విలువైన బంగారు ఆభరణాలు అపహరించుకుపోయిన దొంగలు. వివరాలలోకి వెళితే ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్న సుగుణమ్మ విధుల నిమిత్తం బ్యాంకు కు వెళ్లారు. ఆమె భర్త కాంట్రాక్టర్ అయినందువల్ల ఆయన క ూడా ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం 12 నుండి 1 గంట సమయంలో ఇంటి పక్కల ఉన్న జనాల సమాచారంతో ఇంటి తలుపులు తీసి చూడగా బెడ్రూంలోని బీరువా తాళాలు పగలగొట్టి ఉండి వస్తువులు చెల్లాచెదురుగా పడివుండటంతో తమ నగదు, బంగారు ఆభరణాలు దొంగలించబడినట్లు గుర్తించి రెండవ పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై పవన్‌కిషోర్‌రెడ్డి కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేపట్టారు. సుమారుగా రూ.50లక్షల విలువైన బంగారు నగలు అపహరణకు గురైనట్లు బాధితురాలు తెలిపింది. ఈ సంఘటనపై సిఐ దేగల ప్రభాకర్ స్పందిస్తూ ఒక బ్యాంకు అధికారి అయివుండి కనీస జాగ్రత్తలు తీసుకోకుండా అంత పెద్దమొత్తంలో బంగారాన్ని, బ్యాంకు లాకర్లలో ఉంచకుండా ఇంటిలో ఉంచడం సరికాదని, వార్తలలో వస్తున్నట్లుగా నగదు అపహరణకు గురికాలేదని, 19 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్టు తమకు సమాచారం వచ్చిందని, ఏదిఏమైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు నగదు, బంగారాన్ని బ్యాంకు లాకర్లలో కానీ, బంధువుల వద్ద కానీ ఉంచుకోవాలని తెలిపారు. పోలీసు పెట్రోలింగ్ సిస్టం ద్వారా వేరే ప్రాంతాలకు వెళ్లే పోలీసుస్టేషన్లకు సమాచారం అందించాలని, తర్వాతే దోపిడీ దొంగలను పట్టుకొంటామని ఆయన తెలిపారు. గతంలో కన్నా ఎక్కువ మొత్తంలో పట్టపగలే ఇంతమొత్తం దొంగతనం జరగడం ఇదే ప్రథమం. ఇది పోలీసులకు పెనుసవాల్‌గా మారింది. శివరాత్రిని దృష్టిలో ఉంచుకొని పోలీసులు బందోబస్తు డ్యూటీలకు వెళ్లడంతో సిబ్బంది తక్కువగా ఉండటం కూడా దొంగలకు దొంగతనం చేయడానికి అనువుగా మారింది.

మైనారిటీ సంక్షేమంపై చర్చకు సిద్ధం

శాసనమండలి ప్రభుత్వ విప్ షరీఫ్



అమరావతి, ఆంధ్రప్రభ: మైనారిటీ సంక్షేమంపై ప్రతిపక్షం ముందుకు వస్తే బహిరంగ చర్చలకు తాము సిద్ధమని రాష్ట్ర శాసనమండలి ప్రభుత్వ విప్ ఎం.ఎ.షరీఫ్ సవాల్ విసిరారు. బుధవారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాలకు పాదయాత్ర చేస్తున్న ప్రతిపక్షనేత జగన్ ముస్లిం సంక్షేమంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత వైఎస్ ప్రభుత్వ హయాంలో పవిత్రమైన వక్ఫ్ భూములు కబ్జాలకు, ఆక్రమణలకు గురైన విషయాన్ని ముస్లింలు ఇంకా మరువలేదన్నారు. కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ఎక్కడిక్కడ నాటి పాలకులు ఆక్రమణలకు పాల్పడ్డారని, ఇక కడపలో అయితే స్వయాన జగన్ మేనమామ, ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి కట్టిన సినిమా హాళ్లు, పెట్రోలు బంకులు వక్ఫ్ భూముల్లోనే అని ఆరోపించారు. 23 జిల్లాలతో కూడిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో ఐదు సంవత్సరాలకు గాను రూ.457.75 కోట్లను మైనారిటీలకు ఖర్చు చేయడం జరిగిందన్నారు. కానీ కేవలం 13 జిల్లాలతో కూడిన నవ్యాంధ్రలోని మైనారిటీల సంక్షేమానికి గత 4 సంవత్సరాల్లో రూ.2,346 కోట్లను ఖర్చు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదే అన్నారు. అనంతరం ఏపీ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ హిదాయత్ మాట్లాడుతూ మైనారిటీ సంక్షేమానికి కేటాయించిన నిధులను కూడా దారి మళ్లించి దోచుకున్న ఘనత గత తల్లి, పిల్ల కాంగ్రెస్ పాలకుల దని దుయ్యబట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తోం దన్నారు. తమ కార్పొరేషన్ ద్వారా రూ.175 కోట్లను మైనారిటీ వర్గాలకు స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. అలాగే ఉపకార వేతనాలు, విదేశీ విద్యకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం, నిరుద్యోగ యువతకు నైపుణ్యశిక్షణలు, జాబ్‌మేళాల ద్వారా వేలాది ఉద్యోగాలను కల్పించడం జరుగుతోందన్నారు. కేంద్ర సహకారం లేకపో యినా పవిత్ర హజ్ యాత్రకు, ఆదాయంలేని మసీదులను ఆదుకునేందుకు వందలాదికోట్లను ఖర్చు చేస్తూ మైనారిటీసంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు.

వైసీపీ వెన్నులో చలిపుట్టిస్తున్న

'దళితతేజం': వర్ల రామయ్య

అమరావతి, ఆంధ్రప్రభ: దళితతేజం-తెలుగుదేశం కార్యక్రమం విజయవంతంగా సాగుతుండటంతో ప్రతిపక్ష పార్టీ వైసీపీ వెన్నులో చలి మొదలైందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య అన్నారు. బుధవారం విజయవాడ టిడిపి కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడుతూ రిపబ్లిక్ డేరోజున అట్టహసంగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభమైన దళిత తేజం-తెలుగుదేశం కార్యక్రమం రాష్ట్రమంతటా ప్రతీ దళిత పల్లెను, దళిత గృహాన్ని స్పర్శిస్తూ, సమస్యలు తెలుసుకొంటూ పార్టీలోని అగ్ర కుల పెద్దలు కూడ దళితులతో మమేకమై వారి సమస్యల పరిష్కరానికి ఆసక్తి చూపిస్తున్నారన్నారు. వారితో కలిసి వారి ఇళ్ళలో సహపంక్తి భోజనాలు చేస్తూ వారి మనస్సులో చోటు దక్కించుకోవటంతో వైసీపీ దళిత ఓటింగ్‌కు పెద్ద ఎత్తున గండి పడిందన్నారు. విజయవంతంగా సాగుతున్న ఈ కార్యక్రమం దళిత పల్లెలోచొచ్చుకుపోయి వారికి ధైర్యాన్ని ఇస్తూ, వారి సమస్యలు పరిష్కరిస్తూ వారికి తగిన భరోసానిస్తుందన్నారు. తాము అండగా ఉన్నామని టిడిపి నమ్మకాన్ని కలిగించడంతో వారందరూ తెలుగుదేశం పార్టీవైపు మమేకం అవటం వైసీపీ నాయకత్వం జీర్ణించుకోలేకపోతుందన్నారు. జగన్ కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉన్న దళితుల ఎసైన్డ్ భూములను తిరిగి వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 1న అందరూ ఫూల్స్ చేస్తే, జగన్ ఏప్రిల్ 6వ తేదీన తన ఎంపీలు రాజీనామా అని అందరిని ఫూల్స్ చేస్తున్నాడన్నారు. ఏప్రిల్6 తరువాత రాజీనామా చేస్తే తిరిగి ఎన్నికలు జరగవని, సాదారణ ఎన్నికల వరకూ ఈఎంపీలే కొనసాగుతారని, జగన్‌కు తెలిసే ఏప్రిల్ 6న డ్రామా ఆడుతున్నాడని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాదానమిచ్చారు. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు సీఎం చంద్రబాబు పై చేసిన వాఖ్యలకు తాను స్పందించనని, అన్ని మాటలు ఆయన విజ్ఞతకే వదిలి వేస్తున్నానని మరో ప్రశ్నకు సమాదానం తెలిపారు.

సంజీవయ్య సేవలు స్ఫూర్తిదాయకం



మంత్రి నక్కా ఆనందబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన సంస్కరణలు, సేవలు నేటి యువతకు, పాలకులకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు తెలియజేశారు. బుధవారం గుంటూరులోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సంజీవయ్య 97వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని నిరుపేద దళిత కుటుంబంలో 1921లో పుట్టిన సంజీవయ్య కృషి, పట్టుదలతో రాష్ట్ర ముఖ్య మంత్రి స్థాయికి ఎదిగిన వైనం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. గుమస్తాగా, అధ్యాపకుడిగా, ప్రభుత్వ అధికారిగా, న్యాయవాదిగా పలు రంగాల్లో సేవలు అందించిన ఆయన రాజకీయ నాయకుడిగా రాష్ట్ర ఆరోగ్య, మున్సిపల్, వాణిజ్య పన్నులు, రవాణా శాఖ మంత్రిగా పనిచేసి, వినూత్నమైన సంస్కరణలు చేపట్టడం ద్వారా ఆయా శాఖలకు వన్నెతెచ్చారని గుర్తు చేశారు. కుల, మతా రాజకీయాలకు నిలయమైన నాటి రోజుల్లో నిష్కల్మషంగా చేసిన ప్రజాసేవకే అత్యన్నత పదవి అయిన సీఎం పీటం సంజీవయ్యకు దక్కిందన్నారు. అటువంటి మహనీయుని ఆశయాలను, ఆకాంక్షలను నేటి యువత కొనసాగిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, దళిత నాయకులు పాల్గొన్నారు.

మోసపూరిత ప్రకటనలతో

జగన్ నమ్మకద్రోహం: అనూరాధ



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రతిపక్ష నేత జగన్ మోసపూరితమైన ప్రకటనలు చేస్తూ రాష్ట్ర ప్రజలను నమ్మక ద్రోహం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పంచుమర్తి అనురాధ అన్నారు. విజయవాడ టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేసుల మాఫియే జగన్ ప్రధాన ఎంజెడా అని ప్రజలకు తెలుసన్నారు. విభజన హామీలను అమలు చేయాలని కోరుతూ పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీలు రణభేరీ మోగిస్తే వైసీపీ ఎంపీలు కనీస మద్దతు తెలపకుండా ఉన్నారని, ప్రధాని మోడీ మాట్లాడుతున్న సమయంలోనే సభలో మౌనంగానే ఉంటూ డ్రామాలాడారని ఆరోపించారు. సమైక్యాంధ్రా ముసుగులో ఒక పక్క సోనియా గాంధీకి ఆర్టికల్-3 ద్వారా విభజన చేయొచ్చని సలహా ఇచ్చి ఆ ముగుసులో ఒక జగన్ బెయిల్ సంపాదించుకున్నారని వ్యాఖ్యానించారు. ఆరోజు కూడా రాష్ట్ర ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేశారని, ఇలా తప్పుల మీద తప్పులు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వైసీపీ నేతల ప్రకటనలు నమ్మో పరిస్థితిలో ఏపీ ప్రజలు లేరని పేర్కొన్నారు.

9 మంది మిలీషియన్ సభ్యుల లొంగుబాటు

నర్సీపట్నం ఏఎస్‌పీ ఆరీఫ్ హాఫీజ్ వెల్లడి



నర్సీపట్నం, ప్రభన్యూస్: సీపీఎం మావోయిస్టు పార్టీలో మిలీషియన్ సభ్యులుగా పని చేసిన 9 మంది గిరిజనులు స్వచ్ఛందంగా లొంగి పోయినట్లు నర్సీ పట్నం డివిజన్ ఎఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ తెలిపారు. బుధ వారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొయ్యూరు మండలం మఠం భీమవరం పంచాయితీకి మండపల్లి గ్రామానికి చెందిన వంతల వీరన్న(45), జర్తా బొబ్బిలి రాజా (28), జర్తా బాలరాజు (48), పాంగి మాఫే(45), జర్తా గంగమ్మ(40), కాకూరి నారాయణమ్మ (40), కాకూరి పార్వతి (20) , జర్తా సీతమ్మ (40), కాకూరి లక్ష్మి (38) తదితరులు లొంగిపోయిన వారిలో ఉన్నార న్నారు. నిషేధిత మావోయిస్టులైన కుడుముల వెంకటరావు అలియాస్ రవి, వి.ఆర్. ఎల్ గోపాల్ అలియాస్ ఆజాద్ జాంబ్‌రి అనువారు వీరిని బలవంతంగా మిలీషియన్ సభ్యులుగా నియమించినట్లు చెప్పారు. మావోయిస్టులకు వీరు భోజనాలు సమకూర్చడం, గిరిజన గ్రామాలకు మార్గం చూపించడం తదిర సహాయాలు అందించేవారన్నారు. మావోయిస్టు కార్యకలాపాలపైనా, వారి విధి విధానాలపైనా విసుగు చెంది జన జీవన స్రవంతిలో స్వేచ్ఛా యుత మైన జీవనం సాగించేందుకు వీరు స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు ఎఎస్పీ వివరించారు. ఈ విధంగా లొంగిపోయిన మిలీషియన్ సభ్యులకు ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాసంలో భాగంగా ఉద్యోగ ఉపాధి దిశగా సుముఖత కల్పించనున్నట్లు ఆయన చెప్పారు.

మావోయిస్టు కదలికలు తగ్గుముఖం

నర్సీపట్నం డివిజన్ పరిధిలో జీ.కె. వీధి, చింతపల్లి, కొయ్యూరు గిరిజన ప్రాంతాలలో మావోయిస్టుల కదలికలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయన్నారు. పూర్తి స్థాయిలో మావోయిస్టులను నిర్మూలించేందుకు పలు ప్రాంతాలలో పోలీసు కూంబింగ్ ఆపరేషన్లు జరుతున్నాయని చెప్పారు. గిరిజనులతో పోలీసులు మమేకమై మావోయిస్టు ప్రభావిత మారుమూల గిరిజన గ్రామాలలో సైతం పోలీసులు ఆధ్వర్యంలో గిరి యువతను హింసాత్మక పద్ధతులనుండి దూరం చేసేందుకు ప్రోత్సహిస్తూ యువత మక్కువ చూపే వాలీ బాల్ కిట్స్ వంటి క్రీడా సామాగ్రిని అందజేసి పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. గిరిజనుల ఆరోగ్య పరిస్థులు మెరుగు పరిచేందుకు మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచిత వైద్య సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంప ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హోదా, విభజన హామీల సాధనకు

నిరంతర పోరాటం



● వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమ కార్యాచరణ: రామకృష్ణ, మధు

అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీకీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం వాపపక్ష పార్టీల ఆధ్వర్యాన అన్ని ప్రజాసంఘాలను కలుపుకుని దశల వారీ ఉద్యమాన్ని కొనసాగిస్తామని సీపీఐ, సీపీయం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, మధు వెల్లడించారు. రాష్ట్ర బంద్ కు సహకరించిన ప్రజలకు వారు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం విజయవాడలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు గుర్రం విజయ్ కుమార్ అధ్యక్షతన 10 వామపక్ష పార్టీల నేతలు భేటీ అయ్యారు. ఏపీకీ ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మోసపూరిత విధానాలకు నిరసనగా ఉద్యమాన్ని నిర్వహించాలని వామపక్ష పార్టీలు ఈ సమావేశంలో నిర్ణయించాయి. సమావేశ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఏపీకీ ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో మోడీ, చంద్రబాబు మాట తప్పారని, రాష్ట్ర ప్రజలను మోసగించారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్రంలోని 10 వామపక్ష పార్టీలు ఉద్యమ కార్యాచరణను రూపొందించామని వివరించారు. ఈ ఉద్యమంలో భాగంగా అన్ని ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలను కలుపుకుని ముందుకు పోతామని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 18న విజయవాడలో ఏపీ ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధన సమితి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష పార్టీలు పాల్గొంటాయని చెప్పారు. గొట్టిపాడులో దళితుల పై పెత్తందారుల దాడుల్ని నిరసిస్తూ ఈ నెల 23న చలో గుంటూరు కార్యక్రమానికి వామపక్ష పార్టీలు పిలుపు నిచ్చాయని వెల్లడించారు. విశాఖ రైల్వేజోన్ రాష్ట్రా నికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధన కోసం ఈ నెల 24న విశాఖపట్నంలో భారీ సభకు కార్యాచరణ రూపొందించామన్నారు. మార్చి 6న వామపక్ష పార్టీల ఆధ్వర్యాన పార్లమెంటు ముందు నిరసన తెలుపుతామన్నారు. రాష్ట్ర సమస్యల పై కేంద్రం ఖచ్చితంగా దిగిరావాలని, ఇవి సాధించే వరకు వామపక్ష పార్టీలు ఐక్యంగా క్రింది స్థాయి వరకూ పోరాటాల ప్రణాళిక రూపొందించినట్లు ఆయన వివరించారు. జనసేన నేత పవన్ కల్యాణ్‌ను త్వరలో కలవనున్నట్లు చెప్పారు.

సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్ మాట్లాడుతూ వామపక్ష పార్టీలు చేపట్టిన ఐక్య ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించి, భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వామపక్ష నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జల్లి విల్సన్, వై.వెంకటేశ్వరరావు, సుందరరామరాజు, అమరనాథ్, సుధీర్, వెంకటరెడ్డి, హరినాథ్, పోలారి తదితరులు పాల్గొన్నారు.

పట్టుకోసం మావోల ప్రయత్నాలు... తిప్పికొడుతున్న పోలీసులు

● ఏవోబీలో కూంబింగ్ ముమ్మరం ● హెలికాప్టర్లతో రెక్కీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇటీవల మావోలు బలపడుతున్న సంకేతాలు స్పష్ట మవుతున్న నేపథ్యంలో తెలుగురాష్ట్రాల పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయా రాష్ట్రాల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు గస్తీని తీవ్రతరం చేశారు. అటు ఏవోబీలో మావోయిస్టు అగ్రనేతల కోసం పోలీసుల కూంబింగ్ ముమ్మ రమైంది. ఏవోబీలో దమ్ముగూడ వద్ద రెండేళ్ల క్రితం జరిగిన భారీ ఎన్ కౌంటర్‌లో 30 మందికి పైగా మావోయిస్టులను పోలీసులు మట్టుబెట్టారు. ఇప్పుడు కూడా అదే పునరావృతం చేయాలని పోలీసులు పట్టుదలగా ఉండటంతో అత్యంత ఉద్రిక్త వాతావరణం కటాఫ్ ఏరియాలో కనిపిస్తోంది. రెండు రోజుల క్రితం మావోయిస్టు నేతలు సాకేత్ గోపి, దుబాసి శంకర్ అలియాస్ రమేష్; ఆర్ఎం. చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి, కృష్ణ అలియాస్ కరుణ, గణేష్, నవీన్ అలి యాస్ బోడ అంజయ్యలతో కలిసి గాజర్ల రవి ఇక్కడే సమావేశమైనట్లు పోలీసులకు తెలిసింది. ఏవోబీలో మావోయిస్టు సమావేశం గురించి తెలుసుకున్న ఏపీ గ్రేహౌండ్స్ బలగాలు, ఒడిశా పోలీసులు జాయింట్ ఆపరేషన్‌కు ప్రణాళిక రూపొందించాయి. అనుకున్న విధంగానే మావోయిస్టు సమావేశ ప్రాంత సమీపానికి వెళ్లాయి. అయితే అక్కడ మావోయిస్టు సెంట్రీ పోస్టు గార్డులు గమనించి తమ నేతలకు సమాచారం అందించడంతో వారు తప్పించుకోగలిగారు. అనంతరం మావోయిస్టులు ఖాళీ చేసిన ప్రాంతానికి బలగాలు చేరుకుని వారికి చెందిన 54 కిట్ బ్యాగులను స్వాధీనం చేసు కున్నారు. మరోవైపు ఏజెన్సీ వ్యాప్తంగా పోలీసులు హెలికాప్టర్లతో రెక్కీ నిర్వహిస్తున్నారు.

ఏవోబీ ప్రాంతం సమీప ప్రాంతాలన్నీ బిక్కుబిక్కుమంటున్నాయి. ఒకవేళ తప్పించుకున్న మావోలు విశాఖపట్నంవైపుకు వెళ్లే అవకాశం ఉందన్న కారణంతో అక్కడ గ్రేహౌండ్స్ బలగాలను మోహరించారు. ఒక రకంగా చెప్పాలంటే ఏవోబీ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో జల్లెడ పట్టేందుకు పోలీసులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ముందుగా హెలికాప్టర్లపై రెక్కీ నిర్వహించారు. ఇలా వచ్చిన అవకాశాలన్నీ వినియోగించుకంటూ పోలీసు లు ముందుకు కదులుతున్నారు.

అటు మావోలు సైతం తమ వ్యూహాల్లో తాము నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఏదేమైనా తెలుగు రాష్ట్రాల్లో మావోలు, పోలీసుల మధ్య యుద్ధవాతావరణమే నెలకొని ఉందని జరుగుతున్న ఘటనలే చెబుతున్నాయి. దీంతో, తెలుగురాష్ట్రాల్లోని మావో ప్రభావిత ప్రాంత పల్లెలు మాత్రం భయం గుప్పిట్లో దినదినగండంగా కాలం వెళ్లిబుచ్చుతుండటం గమనార్హం.

18న బీజేపీ పదాధికారుల సమావేశం

అమరావత, ఆంధ్రప్రభ: రాష్ట్ర బీజేపీ పదాధికారుల(ఆఫీసు బేరర్ల) సమావేశం ఈ నెల 18న విజయవాడలో జరగనుంది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొననున్న సమావేశంలో రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి హరిబాబుతో పాటు ఆఫీసు బేరర్లు, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కోర్ కమిటీ సభ్యులు పాల్గొననున్నారు.

ఆటో బోల్తా: ఇద్దరు మృతి

● ముగ్గురి పరిస్థితి విషమం
● పది మందికి తీవ్రగాయాలు

ప్యాపిలి, ప్రభన్యూస్: క్రిష్ణగిరి మండలం, చిట్యాల గ్రామంలోని ఐదు కుటుంబాలలో మహాశివరాత్రి పండుగ తీవ్ర విషాదాన్ని నింపింది. చిట్యాల గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలు ప్రత్యేక ఆటోను బాడుగకు తీసుకొని మంగళవారం రాత్రి యాగంటి క్షేత్రంలో జాగారణ చేసి బుధవారం ఉదయం ఆవుకు మండలం, సీతారామాపురం వద్ద కాశిరెడ్డినాయన దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణంలో ప్యాపిలి మండలం మీదుగా చిట్యాలకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో ఒక్కసారిగా ఆటో ఆలేబాద్ సమీపంలో ఘాట్ సమీపంలో తిరుగుతుండగా అదుపుతప్పి దాదాపు 50 ఆడుగల లోతులో పడిపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మిదేవి(50), హర్షవర్ధన్(5)లు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 13 మందికి తీవ్రగాయాలు కావడంతో స్థానికుల సహాయంతో డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. సమాచారం తెలుసుకొని ప్యాపిలి ఎస్సై పీరయ్య సంఘటన స్థలానికి చేరుకొని మృతుల వివరాలను సేకరించి సంఘటనపై కేసు నమోదు చేశారు.

మంత్రుల వ్యాఖ్యలు అర్థరహితం

డ్రామాలు ఆడేది టీడీపీనే: జోగి, వెల్లంపల్లి

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా అంశాన్ని పక్కనబెట్టి రాష్ట్ర మంత్రులు తమ పార్టీ అధినేతపై చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు జోగి రమేష్, వెల్లంపల్లి శ్రీనివాస్లు పేర్కొన్నారు. బుధవారం విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మంత్రులు సోమిరెడ్డి, అచ్చెంనాయుడు చేస్తున్న వ్యాఖ్యల్లో పస లేదన్నారు. చీమ చిటుక్కుమంటే మీడియా ముందుకొచ్చి మాట్లాడే ముఖ్యమంత్రి చంద్రబాబు గత 14 రోజులుగా ఎందుకు మౌనం పాటిస్తున్నారని వారు ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, అందుకే గత 14 రోజులుగా లీకులతో కాలం గడుపుతున్నారని చెప్పారు. జగన్ గుణ గణాలపై దమ్ముంటే అచ్చెంనాయుడు చర్చకు రావాలని సవాల్ విసిరారు. మరో మంత్రి పేరు సోమిరెడ్డి కాదని సోదిరెడ్డి అని ఎద్దేవా చేశారు. ప్రజాపోరాటంలో గెలవలేని ఆయనకు జగన్‌ను విమర్శించేస్థాయి లేదని తెలుసుకోవాలన్నారు. టీడీపీ మంత్రులకు చీము, నెత్తురు ఉందా ? అంటూ ప్రశ్నించారు. తమ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై మంత్రుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. డ్రామాలు కట్టిపెట్టి రాష్ట్రప్రయోజనాలకోసం పాటుపడాలని వారు మంత్రులకు హితవు పలికారు.

ఎంపీల రాజీనామాకు

అన్ని రాజకీయ పార్టీల మద్దతు: అంబటి

అమరావతి, ఆంధ్రప్రభ: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు నవంబర్ 6న రాజీనామా చేస్తున్నట్లు తమ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన ప్రకటనకు అన్ని రాజకీయ పక్షాల నుండి మద్దతు లభిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు తెలియజేశారు. బుధవారం ఆయన విజయవాడలోని రాష్ట్రపార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రత్యేక హోదా అంశంపై ఒత్తిడి పెంచాలని వైకాపా గతంలోనే నిర్ణయించిందని, అందులో భాగంగానే ఇప్పుడు ఎంపీల రాజీనామా అంశాన్ని ప్రకటించామని, దీనిని అందరూ స్వాగతిస్తున్నారన్నారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రానికి మేలు జరుగుతుందనే భావన ప్రజల్లో కలిగిందని చెప్పారు. కానీ, బీజేపీ, టీడీపీలు కలిసి ఏపీ హక్కులను భూస్థాపితం చేయాలని చూస్తున్నాయంటూ దుయ్యబట్టారు. కొన ఊపిరితో ఉన్న ప్రత్యేక హోదా అంశాన్ని ప్రజల మనోభావాలకు అనుగుణంగా సాధించాలని తమ పార్టీ అధినేత ఎంతో కఠినమైన ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఈ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తాబేదారులు, మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలకు ఇది మింగుడు పడటం లేదన్నారు. పదవికి ఏ ప్రమాదం లేదని ఒకాయన గుండు చేయించుకుంటే, శివప్రసాద్ అనే ఎంపీ అన్యాయం అడగకుండా విచిత్ర వేషాలు వేశారని, బంగి అనంతయ్య అనే ఇంకొకాయన పాత చొక్కా వేసుకుని నాటకమాడారని చెప్పారు. మరో ఎంపీ గల్లా జయదేవ్ సభలో ప్రధాన మంత్రి లేని సమయం చూసుకుని మిస్టర్‌ప్రైమ్ మినిస్టర్ అన్నందుకు ఆయనకు సన్మానాలు చేశారన్నారు. ఇంత చేసినా ఏమి సాధించారని ప్రశ్నించారు. ఒక్క రూపాయికూడా సాధించలేక పోయారని ఎద్దేవా చేశారు.

సముద్రంలో మునిగి... ఇద్దరి మృతి



ఆరిలోవ (విశాఖపట్నం), ప్రభ న్యూస్: మహాశివరాత్రి జాగరణ స్నానాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. మహాశివరాత్రి అనంతరం బుధవారం యథావిధిగా తన మిత్రులు, కుటుంబ సభ్యులతో సముద్ర స్నానమాచరిస్తుండగా ఇద్దరు వ్యక్తులు రాకాశి అలలకు కొట్టుకుపోయారు. నగరంలోని పాత డెయిరీ ఫారం దరి ఇందిరాగాంధీనగర్‌కు చెందిన యశ్వంత్‌ను (17) కెరటం ముంచెత్తింది. దీనిని చూసిన తండ్రి దువ్వి వెంకట శివరామప్రసాద్(48) కుమారుడ్ని కాపాడే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో యశ్వంత్ సురక్షితంగా బయటపడినప్పటికీ ప్రసాద్ సముద్రంలోకి కొట్టుకుపోయాడు. ఈ క్రమంలోనే మరో వ్యక్తి కిర్లంపల్లి రమణ(45) మృత్యువాత పడ్డారు. వీరిరువురినీ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్టు నిర్ధారించడంతో పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

వైభవంగా ముక్కంటి రథోత్సవం

●పులకించిన భక్త జనం
●స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తీశ్వరాలయం, ప్రభ న్యూస్ : శ్రీకాళహస్తిలో బుధవారం ఉదయం ముక్కంటి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది . ఈ ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు భారీగా హాజరయ్యారు. ముందుగా స్వామి, అమ్మవార్లను నెప్పల మండపంలో కొలువు తీర్చి పూజలు నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్ల రథాలను వేర్వేరుగా ఉరేగించారు. మొదట స్వామి వారి రథాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత జ్ఞాన ప్రసూనాంబరథానికి పూజలునిర్వహించి ప్రారంభించారు. లక్షలాది మంది భక్తులు నాలుగు మాడా వీధుల్లో దేవదేవుని రథోత్సవానికి తరలి వచ్చారు.ఆయన దివ్య తేజస్సును తిలకించటానికి వేయి కళ్లు అయినా చాలవన్నట్లు అలంకారాలు చేశారు. రాజులకాలం నాటి ఏడువారాల నగల అలంకారం మరింత శోభాయమానంగా కనువిందు చేసింది. భోళాశంకరుని రథం వెంట దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిరథం వెంటరాగా శ్రీకాళహస్తిపురవీధుల్లో కనువిందు చేస్తూ సాగింది. కాగా బుధవారం తెల్లవారుజామున లింగోద్భవ దర్శనం అనంతరం రథోత్సవాన్ని నిర్వహించారు .సుమారు నాలుగు గంటలపాటు రథోత్సవం సాగింది ఈ ఉత్సవాలలో కార్యనిర్వహణాధికారిణి డి.భ్రమరాంబ, శివరాత్రి ప్రత్యేకాధికారి రఘునాథ్, పర్యవేక్షించగా మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు, మాజీమంత్రి శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడు బొజ్జలసుధీర్‌రెడ్డి, కమిషనర్ రమేష్‌బాబు, తహాశీల్దార్, పట్టణ ప్రముఖులు మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్‌లు శాంతారాం జె.పవార్, పిఆర్‌మోహన్, కోలాఆనంద్ కుమార్, మున్సిపల్ చైర్మన్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. డిఎస్‌పి వెంకటకిషోర్ పర్యవేక్షణలో భారీ భద్రతనుఏర్పాటు చేశారు.

లింగోద్భవంలో సుదర్శనం :

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అభిషేకం రాత్రి 3 గంటలకు ప్రారంభించారు. 45 నిమిషాల్లో క్యూలైన్లల్లో భక్త జనం స్వామివారిని దర్శించు కన్నారు. లింగోద్భవ దర్శనంలో జాయింట్ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

వరహానదికి సప్తరుషి హారతి

●అర్ధరాత్రి స్నానఘట్టాలు ప్రారంభం ●రూ.కోటితో ఉత్తర వాహిణికి పూర్వ వైభవం ●ప్రసాదాల పంపిణీ చేసిన మంత్రి అయ్యన్న సతీమణి పద్మావతి





నర్సీపట్నం, ప్రభన్యూస్ : నర్సీపట్నం సమీపంలో ప్రవహిస్తున్న వరహానది జీవనదుల పక్కన చేరింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని మంత్రి అయ్యన్న సూచన మేరకు భలిఘట్టంలో ఉత్తర దిక్కుగా ప్రవహిస్తూ ఉత్తరవాహిణిగా గుర్తింపు పొందిన వరహా నదికి మంగళవారం అర్ధరాత్రి సప్తరుషి హారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్తరవాహణి, బ్రహ్మలింగేశ్వర ఆలయ ప్రాంగణం శివనామ స్మరణతో హోరెత్తింది. ఉత్తర వాహిణిలో నిర్మించిన స్నానఘట్టాలను మంత్రి అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి పద్మావతి అర్ధరాత్రి 12.30 గంటలకు ప్రారంభించారు. ఈ ప్రాంతంలో నిర్మించిన సత్యన్నారాయణ స్వామి ఆలయ ప్రాంగాణంలో వర్ణ స్పటిక శివలింగ రూపుడైన చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధి చెందిన పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో భక్తులుచేస్తున్న పూజలను అయ్యన్న దంపతులు తికలించారు. ఈ సంధర్భంగా మంత్రి అయ్యన్న మాట్లాడుతూ ఉత్తర వాహిణి ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు రూ.కోటితో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేసి, మహా శివరాత్రి పర్వదినానికి అందజేసినందుకు పంచాయితీ రాజ్ డి. ఇ. ఇ సంపత్ కుమార్, ఇరిగేషన్ డి.ఇ.ఇ. చిన్నమనాయుడు, తదితర సిబ్బందితో పాటు కాంట్రాక్టరును అభినందించారు. మంగళవారం రాత్రి జాగరణ చేసిన భక్తులు బుధవారం పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి మంత్రి సతీమణి పద్మావతి అన్నసమారాదనలో పాల్గొని ప్రసాదాన్ని అందజేశారు. సర్వాంగ సుందరంగా నిర్మించిన స్నానఘట్టాలను భక్తులు ఆసక్తితో తిలకించారు. భక్తుల సౌకర్యార్ధం నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా భోజన ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ కె. సూర్యారావు , మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, తహశీల్దారు రమణ, ఇంజనీరింగు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏపీ భవన్‌లో ముగిసిన శివరాత్రి వేడుకలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : గరళ కంఠుడి నామస్మరణతో ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ రెండు రోజుల పాటు పాటు మార్మోగిపోయింది. ఏపీ భవన్ ఇతర తెలుగు సంఘాలు సంయుక్తంగా నిర్వహించిన శివరాత్రి వేడుకలు బుధవారం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతో ముగిశాయి. ఈ సందర్భంగా భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ మాట్లాడుతూ... ఆధ్యాత్మిక కార్యక్రమాలతో తెలుగు వారితో పాటు ఇతరులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఆదిలీల ఫౌండేషన్, తెలుగు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, ఢిల్లీలోని తెలుగు సంస్థల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమాల అనంతరం శ్రీశైల దేవస్థానం వారిచే కుంకుమ, విభూది, శేష వస్త్రాలు, కైలాస కంకణాలు, స్వామి వారి లడ్డు ప్రసాదం అందచేశారు.

తిరుపతి, కాకినాడకు ప్రత్యేక రైళ్లు

హై దరాబాద్, ఆంధ్రప్రభ : ప్రయాణికుల రద్దీ పెరగడంతో హైదరాబాద్ నుండి తిరుపతి, కాకినాడకు ప్రత్యేక రైళ్లు నడిపించబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. తిరుపతి ప్రత్యేక రైలు 16వ తేదీన 18.50 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు 08.50 గంటలకు తిరుపతి చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు తిరుపతిలో 18వ తేదీన 17.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 05.00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. కాకినాడ ప్రత్యేక రైలు 16వ తేదీన 18.50 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు 05.30 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కాకినాడలో ఈ రైలు 18వ తేదీన 18.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 06.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. మార్గమధ్యలోని అన్ని ప్రధానమైన రైల్వే స్టేషన్లల్లో ఈ ప్రత్యేక రైళ్లను నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు.

మెట్రోపై నీలినీడలు

●ముందుకు కదలని ప్రాజెక్టు
●ఇంకా ఖరారు కాని డీపీఆర్
●ప్రాజెక్టుపై ప్రజల్లో సందేహం



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మించదలుచుకున్న విజయవాడ మెట్రో ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. కేంద్ర బడ్జెట్‌లో సైతం విజయవాడ, విశాఖ మెట్రోలకు సంబంధించిన ప్రస్తావన, నిధుల కేటాయింపులు లేకపోవడంతో అసలు మెట్రో ప్రాజెక్టు వస్తుందా? లేదా..? అన్న అనుమానం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. మూడేళ్లు గడిచిన ప్రాజెక్టు పనులు పట్టాలు ఎక్కకపోవడంతో ఈ అనుమానాలు వారిలో మరింత బలపడుతున్నాయి. ఒకవైపు జర్మనీకి చెందిన కెఎఫ్‌డబ్ల్యూ సంస్థ లైట్ మెట్రో డీపీఆర్‌ను ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చినా అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్(ఏఎమ్ఆర్‌సీ) ఇంత వరకు ఒప్పందం చేసుకోకపోవడం, నిర్మాణానికి నిధులు సమకూర్చేందుకు ఫ్రాన్స్‌కు చెందిన సంస్థ ఆసక్తి కనబరుసున్నా సరైన చర్యలు చేపట్టకపోవడంతో నిర్మాణం ఎంత వరకు జరుగుతుందో అన్నది ప్రశ్నార్థకంగా మారింది. 2015లో మెట్రో ప్రాజెక్టును రూ.6790 కోట్ల వ్యయంతో 28 కి.మీ.ల మేర రెండు కారిడార్లలో నిర్మించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనికి ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎమ్ఆర్‌సీ) కన్సల్టెంట్‌గా నియమించింది. కొన్నాళ్ళ పాటు మెట్రోపై కసరత్తు చేసిన డీఎమ్ఆర్‌సీ ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఆ సంస్థ ఎండి.శ్రీధరన్ రాజీనామా చేశారు. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వం డీఎమ్ఆర్‌సీని ఆ బాధ్యతల నుంచి తప్పించి అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్ బాధ్యతలు అప్పగించింది. అయితే మెట్రో ప్రాజెక్టుకు సరిపడా జనాభా విజయవాడకు లేదని, మెట్రో ఏర్పాటు అసాధ్యమని కేంద్రం తేల్చి చెప్పడంతో రాష్ట్ర ప్రభుత్వం మెట్రోను కాస్త లైట్ మెట్రోగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది.

గత ఏడాది అక్టోబర్‌లో అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్(ఏఎమ్ఆర్‌సీ) లైట్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు డీపీఆర్‌ల కోసం గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. 5 విదేశీ సంస్థలు ముందుకు వచ్చాయి. అయితే స్వదేశీ సంస్థల భాగస్వామ్యంతోనే లైట్ మెట్రో నిర్మాణాన్ని చేపట్టాలని ఏఎమ్ఆర్‌సీ నిర్ణయం తీసుకుంది. దీంతో 5 విదేశీ సంస్థలు మన దేశానికే చెందిన కొన్ని సంస్థలతో జత కలిశాయి. కెనడాకు చెందిన డీపీఎస్ ట్రాన్స్‌కామ్ లిమిటెడ్ మన దేశానికి చెందిన విక్రా మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీతో ఫ్రాన్స్‌కు చెందిన ఈజీఐఎస్ రైల్ ఎస్ఏ, ఏపీఎమ్‌జీ కన్సల్టెన్సీ, ఈజీఐఎస్ కన్సల్టెన్సీతో జర్మనీకి చెందిన జీఆర్ఈ స్థానిక జెబివి ఇంజనీరింగ్, ఎస్ఎమ్‌సీఈ ప్రైవేట్ లిమిటెడ్‌తో, ఇటలీకి చెందిన వినా కన్సల్టెన్సీ యుఎంపీసీతో, ఫ్రాన్స్‌కు చెందిన సిస్ట్రా, రైట్ సంస్థతో భాగస్వాములుగా ఎంచుకున్నాయి. వీటిలో ఫ్రాన్స్‌కు చెందిన సిస్ట్రాకు డీపీఆర్ బాధ్యతలను అప్పగించాలని ఏఎమ్ఆర్‌సీ నిర్ణయించింది. అయితే ఈ టెండర్ ప్రక్రియ ముగిసి నాలుగు నెలలు గడుస్తున్న ఇంత వరకు సిస్ట్రాతో ఏఎమ్ఆర్‌సీ ఒప్పందం చేసుకోలేదు.

దీంతో లైట్ మెట్రో ప్రాజెక్టు నిర్మాణం కాస్త మరింత జాప్యానికి దారితీసింది. మరోవైపు ఫ్రాన్స్‌కు చెందిన ఐఎఫ్‌డి లైట్ మెట్రో ప్రాజెక్టుకు నిధులు సమకూర్చేందుకు ముందుకు వచ్చినా ఏఎమ్ఆర్‌సీ ఇంత వరకు నిర్ణయం తీసుకోకపోవడంతో రాజధాని వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ప్రతి నెల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెట్రో ప్రాజెక్టుపై విధిగా సమీక్షించేవారు. అలాంటిది గడిచిన కొద్ది నెలలుగా ఆయన ఎలాంటి సమీక్షలు నిర్వహించకపోవడంతో మెట్రో ప్రాజెక్టు నిర్మాణంపై సందేహం వెలిబుచ్చుతున్నారు. 2019 నాటికి మెట్రో పరుగులు ఊహించిన రాజధాని వాసులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు.

కేంద్రంపై మరింత వత్తిడి తెస్తాం



●రైల్వే జోన్ వస్తుందన్న ఆశతో ఉన్నాం ●విభజన చట్టం పూర్తిగా అమలు చేయాల్సిందే: ఎంపీ రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, ప్రభ న్యూస్ బ్యూరో): విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు బిల్లులో ఇచ్చిన హామీల మేరకు కేంద్ర ప్రభుత్వం విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటుకు త్వరలోనే ప్రకటన చేయవచ్చునన్న ఆశతో ఉన్నామని శ్రీకాకుళం ఎంపి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. బుధవారం ఆయన నివాస గృహం ప్రజాసదన్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయులసమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైల్వేజోన్ ఏర్పాటుకోసం ఇప్పటికే పలుమార్లు ప్రధాన మంత్రిని, రైల్వేమంత్రిని కలుసుకుని వినతిపత్రం ఇచ్చామని, అదే విధంగా పార్లమెంటులో అందరి అభిప్రాయాలు తెలుసుకునేందుకు వీలుంటుందని, ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టేందుకు కూడా ప్రయత్నించామని, అయినప్పటికీ ఇంతవరకూ కేంద్రం దీనిపై స్పందించలేకపోవడంతో కేంద్రంపై తెలుగుదేశం ఎంపిలు మరింత వత్తిడి తీసుకువస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితులలోనూ విశాఖరైల్వే జోన్ ఏర్పాటు చేయాల్సిందేనని ఆయన అన్నారు. విభజన బిల్లులో కూడా ఏపీలో విశాఖ రైల్వేజోన్ ఏర్పాటును నిర్ణయించారని, ఆమేరకు రైల్వేజోన్ ఏర్పాటుచేయాలన్నారు. అయితే ఏదో మొక్కుబడిగా కాకుండా విశాఖ రైల్వేజోన్‌ను పూర్తిస్థాయిలో వాల్తేరు, గుంటూరు, విజయవాడ, గుంతకల్లు డివిజన్లన్నింటినీ కూడా ఈ జోన్ పరిధిలోకి తీసుకువచ్చి, రాష్ట్రంలోని అన్ని రైల్వేస్టేషన్లనూ కూడా విశాఖ రైల్వేజోన్ క్రిందకు తీసుకురావాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. వీటితో పాటు పలాస నుంచి ఇచ్ఛాపురం వరకూ ఉన్న ఆ ఏడు రైల్వే స్టేషన్లను కూడా విశాఖ జోన్‌లో చేర్చాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. వీటిని విశాఖ జోన్‌లోకి చేర్చకపోతే ప్రతి పనికీ ఈ స్టేషన్ల విషయంలో భువనేశ్వర్ వెళ్లి అక్కడ అధికారుల చుట్టూ తిరగాల్సివస్తుందని ఆయన అన్నారు. ఇది సరైన విధానం కాదని ఆయన అన్నారు. ఒడిషా ప్రభుత్వం, అక్కడ బిజెపి నాయకులు విశాఖ రైల్వేజోన్‌పై మోకాలడ్డుతున్నందువల్లనే ఇంతవరకూ ఈ జోన్ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని, దీనివల్ల ఆంధ్రప్రదేశ్‌కు కొన్ని దశాబ్దాలుగా తీరని అన్యాయం జరుగుతోందని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చౌదరి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ. 900 కోట్లు

మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి ఆంధ్రప్రభ : దేశంలోనే ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు సొంతం చేసుకుంటూ అభివృద్ధి పథంలో పయనిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు రాష్ట్రప్రభుత్వం అన్ని విధాలా వెన్నుదన్నుగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బుధవారం విజయవాడ బస్‌భవన్‌లో జరిగిన కెఎంపిఎల్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు.డ్రైవర్లు, కండక్టర్లు,సిబ్బందంతా కలిసికట్టుగా శ్రమిస్తే వచ్చే ఏడాదికల్లా ఏపీఎస్ఆర్టీసీకి పెద్ద ఎత్తున నష్టాలు తగ్గిపోవడం ఖాయమన్నారు. సంస్థను ఆదుకునేందుకు ప్రభుత్వం తన వంతు సాయం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. అందులో భాగంగా పల్లె వెలుగు బస్సులకు సంబంధించి ఆయిల్‌పై విధిస్తున్న పన్ను బకాయిలను భరించేందుకు చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు.ఈ నిర్ణయం వల్ల సంస్థకు కొంత ఇబ్బందులు తగ్గుతాయన్నారు.

అదే విధంగా రానున్న బడ్జెట్‌లో ఏపీఎస్ఆర్టీసీకి మరిన్ని నిధులు కేటాయించే విధంగా కూడా చర్యలు తీసుకుంటామన్నారు. సుమారు రూ. 900 కోట్ల మేర నిధులు కేటాయించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇంధన పొదుపు చర్యల వల్ల సంస్థకు గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.330 కోట్ల నష్టాలు తగ్గాయన్నారు. కార్మికుల సమిష్టి కృషి వల్లనే ఇది సాధ్యమైందన్నారు. తాను మంత్రిగా పదవీ బాధ్యతలు తీసుకున్న తర్వాత సంస్థకు రూ. 440 కోట్ల రీయంబర్స్‌మెంట్ ఇప్పించానన్నారు. అంతేకాకుండా వివిధ ఆర్థిక సంస్థల నుంచి రూ. 1000 కోట్ల రుణ సాయం అందజేయడం జరిగిందన్నారు. సంస్థ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని డ్రైవర్ల సమర్థతకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. అందులో భాగంగా రిటైర్డ్ అయిన సమర్థవంతులైన డ్రైవర్లు,మెకానిక్‌లను తిరిగి సంస్థలో వారి సేవలను వినియోగించుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

సంస్థలో 31 శాతం అంటే దాదాపు రూ. 1400 కోట్లను ఆయిల్‌పైనే ఖర్చు చేయాల్సి వస్తుందని, ఆయిల్ వినియోగాన్ని గణనీయంగా తగ్గిస్తే సంస్థను తప్పనిసరిగా లాభాల బాటలో నడిపించితీరుతామన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రభుత్వం ఇచ్చిన మెలుకువలు పాటిస్తే ఇంధనపొదుపును బాగా చేయవచ్చన్నారు. మెరుగైన శిక్షణ,ఇంధనపొదుపు ద్వారా సంస్థకు మంచి భవిష్యత్ ఉందన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక సంఘాలు అనేక సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చాయని, వాటిని అవకాశం ఉన్నంతవరకు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అవార్డులు, ప్రొత్సాహాల ద్వారా డ్రైవర్లు,కండక్టర్లకు మంచి గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్,డీజీపీ పి.మాలకొండయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చే వారి కోసం ఆర్టీసీ మరిన్ని సర్వీసులను పెంచడం ద్వారా ఆదాయాన్ని మరింతగా పెంచుకోవచ్చన్నారు.

అక్రమ రవాణాను అరికట్టడం ద్వారా నష్టాలు తగ్గించుకోవచ్చని సూచించారు. సంస్థ సిబ్బంది అవిరళ కృషి వల్ల సంస్థకు ఇప్పుడిప్పుడే లాభాలు వస్తున్నాయని, మరిన్ని రక్షణ చర్యలు, మెలుకువలు, సిబ్బంది సమిష్టి త్యాగాల వల్ల సంస్థను ఖచ్చితంగా లాభాల బాటలోకి తీసుకురావచ్చన్నారు.ఈ సందర్భంగా ఇంధన పొదుపు పాటించిన పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు అవార్డులు అందజేసి, ప్రొత్సహాక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, జయరాజు, ఆర్టీసీ పీఆర్‌వో మూర్తి, హెచ్‌పిసీఎల్ జీఎం గుప్తా ,గుర్తింపు యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెంనాయుడును సిబ్బంది ఘనంగా సన్మానించారు.

జల క్రీడల్లో నిరుద్యోగ యువతకు శిక్షణ

పర్యాటక కార్యదర్శి ఎం.కె.మీనా



అమరావతి, ఆంధ్రప్రభ: పర్యాటక రంగంలో జల క్రీడలకు పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా నిపుణుల కొరతను అధిగమించడంపై ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగా జలక్రీడలలో నిరుద్యోగ యువతకు గోవాలో శిక్షణ ఇవ్వనున్నట్లు పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. గోవాలోని జాతీయ జలక్రీడల సంస్థతో ప్రత్యేక ఒప్పందం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తొలి దశలో అనంతపురం టూరిజం హబ్ నుంచి 15మంది నిరుద్యోగులను ఎంపిక చేసి శిక్షణ ఇప్పించడంతో పాటు రానున్న రోజుల్లో అన్ని టూరిజం హబ్‌ల నుంచి ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వీరికి రెండు రకాల శిక్షణ ఇవ్వనున్నామని ఆయన పేర్కొన్నారు. బీచ్ లైఫ్ గార్డు పేరిట లైఫ్ సేవింగ్ నైపుణ్యతలో శిక్షణ, టిల్లర్ విభాగంలో పవర్ బోటు నడపడం, నిర్వహించడంపై శిక్షణ ఉంటుందన్నారు.

విశాఖ సాగర తీరంలో బీచ్ లైఫ్ గార్డుల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని శిక్షణ తర్వాత అవసరాన్ని బట్టి పర్యాటక శాఖలో వీరికి ఉపాధి కల్పించనున్నట్లు ఆయన వివరించారు. శిక్షణ కోసం జాతీయ జలక్రీడల సంస్థకు రూ.3లక్షలు పర్యాటక శాఖ చెల్లిస్తుందన్నారు. అభ్యర్థుల రవాణా, వసతి, భోజనం వంటి సదుపాయాల ఖర్చు ఈ మొత్తానికి అదనమన్నారు. శిక్షణ కాలంలో ఒక్కొక్క అభ్యర్థిపై సగటున రూ.37వేల వరకు పర్యాటక శాఖ నిధులు వ్యయం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పవర్ బోటు నిర్వహణలో శిక్షణ పొందిన వారికి దేశవ్యాప్తంగా అవకాశాలు ఉన్నాయని చెపుతూ అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి పొందేందుకు ఉన్న అవకాశాలు కాదనలేమన్నారు. ప్రతి రంగం అభివృద్ధిలోనూ ఉపాధి కీలకంగా ఉండాలన్న సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యాల మేరకు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపిక, ఇతర అంశాలను ఏపీ టూరిజం అథారిటీ ముఖ్య కార్యదర్శి హిమాన్షు శుక్లా పర్యవేక్షించనున్నట్లు ఆయన తెలిపారు.

తెలుగు రాష్ట్రాల సాగునీటి వివాదాలకు తెర?

●ఢిల్లీలో కెఆర్ఎంబీ కీలక భేటీ నేడు అక్రమాలు, సమస్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

అమరావతి, ఆంధ్రప్రభ : నేడు ఢిల్లీలో జరగబోయే కృష్ణా నది యాజమాన్య (కేఆర్ఎంబీ) బోర్డు సమావేశంలో అనేక కీలకాంశాలపై చర్చ జరగబోతున్నది. ఎప్పటి నుంచి ఊరిస్తూ వాయిదా పడుతూ వస్తున్న ఈ సమావేశం ఎట్టకేలకు గురువారం ఢిల్లీలో జరగబోతుండడం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సాగర్ ఎడమ కాల్వకు సంబంధించి 2, 3జోన్‌కు నీరందక ఆరుతడి పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఇప్పటికే రాష్ట్రానికి చెందిన సాగునీటి సంఘాలు కేంద్ర జలవనరుల శాఖాధికారులకు లేఖాస్త్రాలు సంధించారు. ప్రధానంగా ఏపీకి సంబంధించిన ఎడమ కాల్వపై సెంట్రల్ ఇండస్ట్రీ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) తో పహరా ఉండేలా చర్యలు తీసుకోవాలనే సరికొత్త ప్రతిపాదనను ఏపీ అధికారులు తీసుకొచ్చారు. ఈ అంశంపై కీలకంగా చర్చించే జరిగే అవకాశం ఉంది. సీఐఎస్ఎఫ్ పహరా మధ్య ఏపీకి నీటి సరఫరా జరగాల్సిన పరిస్థితులపై సమావేశంలో కేంద్ర జలవనరుల శాఖాధికారులకు ఏపీ ప్రతినిధులు సవివరంగా వివరించబోతున్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ప్రాజెక్టులపై చర్యకు కూడా చర్చకు ఏపీ పట్టుబడుతుందంటున్నారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలతో పాటు ఖమ్మం జిల్లాలో చేపట్టిన భక్తరాందాస్ ఎత్తిపోతల పథకాలపై ఏపీ తీవ్ర అభ్యంతరాలు లేవనెత్తే అవకాశం ఉంది. ఏ విధమైన అనుమతులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు ప్రాజెక్టులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో అధికారులు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏపీ అధికారులు కేంద్ర జలవనరుల శాఖాధికారులకు ప్రత్యేకించి,పవర్ ప్రజెంటేషన్ కూడా ఇవ్వబోతున్నారు. కాగా కేంద్ర జలవనరుల శాఖ ఎపెక్స్ కౌన్సిల్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారం తెలంగాణా ప్రభుత్వం చేపట్టిన,చేపడుతున్న ప్రాజెక్టుల నిర్మాణాలపై తీవ్ర అభ్యంతరం చెప్పేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. తెలంగాణా ప్రభుత్వం కేఆర్ఎంబీకి ఎటువంటి సమాచారం లేకుండానే ఏకపక్షంగా జలవిద్యుత్ ఉత్పత్తి జరపడంపై ఏపీ అధికారులు మండిపడుతున్నారు. వీటితో పాటు ఎన్ఎస్‌పీ కాల్వల నిర్వహణ, కాల్వలపై నీటి మీటర్ల ఏర్పాటు, తదితర అంశాలపై పెద్ద ఎత్తున చర్చ జరిగే అవకాశం ఉంది. విభజన హామీల కోసం ఆందోళన జరుగుతున్న నేపథ్యంలో నేడు ఢిల్లీలో నిర్వహించబోతున్న సమావేశం వైపే అందరి దృష్టి ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన పలు సాగునీటి ప్రాజెక్టులపై కీలకంగా భేటీ కానున్నారు. ఈ మధ్య బోర్డు చైర్మన్ శ్రీ వాత్సవ పదవీ విరమణ చేయడంతో గోదావరి బేసిన్ బోర్డు ఛైర్మన్ శర్మకు కృష్ణా నది యాజమాన్య బోర్డు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. నీటి లెక్కల వినియోగంతో పాటు బోర్డుకు సంబంధించిన తుది వర్కింగ్ మ్యాన్యువల్ ఆమోదంపై చర్చించి,ఆమోదానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. కృష్ణా నది బేసిన్‌కు సంబంధించిన అన్ని ప్రాజెక్టులపై సర్వాధికారాలు తమకే ఉండేలా కృష్ణా నది యాజమాన్య బోర్డు తాజాగా తుది వర్కింగ్ మ్యాన్యువల్ సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణా రాష్ట్రాల పరిధిలోని కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు,వాటిల్లో పని చేస్తున్న ఉద్యోగులంతా బోర్డు ఆధీనంలోనే పనిచేసేలా బోర్డు మార్గదర్శకాలు రూపొందించింది. వర్కింగ్‌మాన్యువల్‌ను కేంద్ర జలవనరులశాఖ ఆమోదం లభిస్తే కృష్ణా బోర్డుకు సర్వాధికారాలు లభిస్తాయి. దీంతో రెండు రాష్ట్రాల దూకుడుకు కళ్లెం వేయడానికి బోర్డుకు అవకాశం ఉంటుంది. ఇదిలా ఉంటే కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయం హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి అమరావతికి తరలించే విషయమై కూడా తుది నిర్ణయం తీసుకోబోతున్నారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)వెంకటేశ్వరరావు, జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తదితర అధికారులు హాజరుకానున్నారు.

ఆంధ్ర రైతులపై తెలంగాణ పెత్తనమా?



అమరావతి, ఆంధ్రప్రభ : నాగార్జునసాగర్ ప్రాజెక్టును కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలోకి తీసుకు వచ్చి, ఆంధ్రప్రదేశ్ రైతులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శికి ఫ్యాక్స్ పంపినట్లు రాష్ట్ర సాగునీటి సంఘాల ప్రతినిధులు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, వై.పుల్లయ్యచౌదరి, నాదెండ్ల చెన్న కేశవరావు తెలిపారు. బుధవారం స్థానిక జలవనరుల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లేఖాంశాలను వెల్లడించారు. రాష్ట్ర పునర్విభజన చట్టం2014 ప్రకారం సాగర్ ప్రాజెక్టు నిర్వహణ మొత్తాన్ని కృష్ణా నది యాజమాన్య బోర్డు పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.ఈ విషయమై కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి ఉపేంద్రప్రసాద్ సింగ్‌కు మెయిల్ ద్వారా లేఖ పంపామన్నారు. గురువారం ఢిల్లీలో జరిగే సమావేశంలో సాగర్ హెడ్ రెగ్యులేటర్ల నిర్వహణ, కాలువలు, సిబ్బంది పూర్తి స్థాయి నిర్వహణ కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకువస్తే ఏపీ రైతులకు న్యాయం జరుగుతుందని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం విడిపోయి నాలుగేళ్లు అవుతున్నందున నేడు ఢిల్లీ జరిగే సమావేశంలో సానుకూల నిర్ణయం తీసుకుని, ఏపీకి న్యాయం చేయాలని రైతుల తరుపున కోరుతున్నామని చెప్పారు. నీటి యాజమాన్య నిర్వహణపైన, నాగార్జునసాగర్ డ్యామ్ గేట్ల నిర్వహణ తెలంగాణ ప్రభుత్వ అధికారుల దయాదాక్షిణ్యాలపై ఏపీ ఆధారపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సాగర్ కుడి కాలువ కింద గుంటూరు,ప్రకాశం జిల్లాలలో పదకొండు లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని , దీని ప్రధాన రెగ్యులేటర్ ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఉన్నప్పటికీ 2014 ముందు ఆనవాయితీ ప్రకారం దీని నిర్వహణ కూడా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించడం వల్ల నీటి విడుదల సమయంలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వివరించారు.

'ఎనిమిది నెలల్లోగా పరిహారం చెల్లించండి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వివిధ ప్రాజెక్టుల నిర్మాణం కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లోని రైతుల నుంచి సేకరించిన భూములకు బడ్జెట్ కేటాయింపులతో సంబంధం లేకుండా 8 నెలల్లో పరిహారం చెల్లించాలని హైకోర్టు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను ఆదేశించింది. అయితే ఆ పరిహారాన్ని ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చునని స్పష్టం చేసింది. పరిహారం చెల్లించాలని అభ్యర్థిస్తూ రైతులు దాఖలు చేసిన ఎక్స్ క్యూటివ్ పిటిషన్ల (ఈపీ) వివరాలతో పాటు రైతులకు చెల్లించాల్సిన పరిహారం బకాయిల వివరాలను జిల్లా కోర్టుల నుంచి తెప్పించాలని ఉమ్మడి హైకోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు రూ.453 కోట్లు, కాగా కేవలం మహబూబ్ నగర్ జిల్లా రైతులకే రూ.7 కోట్లు చెల్లించాల్సి ఉందని , ఏపీలో రైతులకు రూ.62 కోట్లు పరిహారంగా చెల్లించాల్సి ఉందని ప్రభుత్వన్యాయవాదులు హైకోర్టుకు నివేదించారు. ఈ వ్యవహారంలో వచ్చే డిసెంబర్ లో నివేదికలు తమకు సమర్పించాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు చేసింది. తదుపరి విచారణ మార్చి 1కి వాయిదా వేసింది.

క్రీడాప్రభ



ఓటమి పాఠాలు నేర్పింది

- దక్షిణాఫ్రికా కోచ్ గిబ్సన్

పోర్ట్ ఎలిజబెత్: ప్రముఖ ఆటగాళ్లు లేరన్న కారణంతో దక్షిణాఫ్రికా ఓడిందన్న వాదనను తాను ఒప్పుకోనని ఆ జట్టు కోచ్ ఒట్టిస్ గిబ్సన్ అన్నాడు. జట్టు సామర్థ్యలేమిని తాను దాచడానికి ప్రయత్నించడంలేదని.. రానున్న రోజుల్లో జట్టు సామర్థ్యం పెంచడానికి మరింత కృషి చేస్తామని చెప్పాడు. జట్టు ఓటమికి ప్రముఖ ఆటగాళ్లు లేకపోవడం కారణం కాదని అన్నారు. డ్రెస్సింగ్ రూంలో ఇదే విషయాన్ని తమ ఆటగాళ్లకు చెప్పానన్నాడు. చివరి వన్డేకు తమ జట్టు మరింత సామర్థ్యంతో బరిలోకి దిగుతుందన్నారు. 'పెద్ద ఆటగాళ్లు లేరని నిరాశతో ఆడవద్దు. ఓటమికి కారణాలు వెతకవద్దు. పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించి గెలువడానికి ప్రయత్నిద్దాం. బలమైన భారత్‌తో ఓటమిని సకారాత్మకంగా తీసుకుంటాం.. రానున్న మ్యాచుల్లో పూర్తి స్థాయి సామర్థ్యంను ప్రదర్శించేందుకు సమాయత్తమవుతున్నాము' అని గిబ్స్ ఐదో వన్డే అనంతరం మీడియాతో వ్యాఖ్యానించాడు. ప్రపంచ కప్‌పైనే మా దృష్టిని కేంద్రీకరిస్తున్నామని ఇప్పుడు చూస్తున్న జట్టు టోర్నమెంట్లోకి అడుగుపెడుతుందని మీరు అనుకోవద్దు అని అన్నాడు. యుజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్ స్పిన్ మంత్రాంగం ఇంగ్లండ్‌లో జరిగే ప్రపంచకప్‌లో పనిచేయదని గిబ్స్ తెలిపారు. ఐదో వన్డేలో కీలక సమయంలో తమ బ్యాట్స్‌మన్లు విఫల మయ్యారని ఆయన వాపోయారు. ఈ సిరీస్‌పై ఆశావాదంతోనే ముందుకు సాగుతున్నామని మా బౌలర్లు భారత్‌ను 274 పరుగులకే కట్టడి చేయడం తనకు సంతోషాన్నిచ్చిందన్నారు. అయితే బ్యాట్స్‌మన్లు రాణించ లేకపోయారన్నారు. బుమ్రా భారత్‌కున్న అత్యుత్తమ పాస్ట్ బౌలరని ప్రశంసించాడు. రెండు జట్ల బ్యాటింగ్ తీరును పరిశీలిస్తే.. భారత టాప్ ఆర్డర్‌లోని ముగ్గురు చేసిన పరుగులు కీలకంగా మారాయన్నారు.



సిరీస్‌ను 5-1 తేడాతో గెలుస్తాం

- జట్టు సమష్టి కృషి ఫలితమే ఈ విజయం
- చివరి వన్డేలో జట్టులో మార్పులుండొచ్చు

పోర్ట్ ఎలిజబెత్: దక్షిణాఫ్రికా గడ్డపై దక్షిణాఫ్రికాపై సిరీస్ గెలవడం తనకు సంతోషాన్నిచ్చిందని భారత జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. శుక్రవారం జరిగే ఆరోది..చివరిదైన వన్డేలో కూడా గెలిచి సిరీస్‌ను 5-1 తేడాతో ముగిస్తామని ధీమాను వ్యక్తం చేశాడు. భారత్ ఇప్పటివరకు ఆతిథ్య దేశంపై ఆదేశంలో ఏ ఫార్మాట్లోను సిరీస్ గెలవ లేదు. మంగళవారం నాటి గెలుపుతో వన్డే లో సిరీస్‌ను భారత్ సొంతం చేసుకొని చారిత్రాత్మక విజయాన్ని నమో దు చేసింది. 'ఈ సిరీస్ అనంతరం మా జట్టులోని లోపాలను సవరించుకునేందుకు సమీక్ష నిర్వహిస్తాం. ఈ సిరీస్‌ను 5-1 తేడాతో గెలుచుకుంటాం. చివరి మ్యాచ్‌లో కొత్త ఆటగాళ్లను ఆడించే ప్రయాత్నం చేస్తున్నాము. మా లక్ష్యం గెల వడం ఇందు కోసం ఏమైనా చేస్తాం' అని కోహ్లీ అన్నాడు. స్పిన్నర్లు యుజువేంద్ర చాహ ల్, కుల్దీప్ యాదవ్‌ల ప్రతిభ ఎనలే దని పేర్కొంటూ.. సిరీస్ విజ యంలో జట్టు సమష్టి కృషే కారణమని చెప్పారు. తమ సిరీస్ గెలుపుపై కోహ్లీ బుధవారం మీడి యాతో మాట్లాడాడు. దక్షిణాఫ్రికా సిరీస్ కోల్పోయి ఒత్తిడిలో ఉందని.. మూడో టెస్టు అనంతరం నుంచి మాకు అదృష్టం కలసివస్తోంది. చరిత్ర సృష్టించడానికి మా జట్టు సమష్టిగా ప్రయత్నాలు సాగిస్తోంది అని కోహ్లీ వ్యాఖ్యానించారు.

మా ఆటగాళ్లు బాగా ఆడారు: మర్‌క్రమ్

దక్షిణాఫ్రికా కెప్టెన్ ఎడెన్ మర్‌క్రమ్ ప్రముఖ ఆటగాళ్లులేని తమ జట్టు బాగా ఆడిందన్నారు. దక్షిణాఫ్రికా రెగ్యులర్ కెప్టెన్ డు ప్లెసిస్ వేలుకు గాయం కావడంతో ఆటకు దూరంకాగా, మరో ప్రముఖ ఆటగాడు డివిల్లియర్స్ కూడా గాయం కారణంగా తొలి మూడు వన్డేలకు దూరమయ్యాడు. వికెట్ కీపర్ డికాక్ కూడా సిరీస్ మధ్యలోనే గాయంతో ఆటకు దూరమయ్యాడు. 'భారత్‌కే విజయం దక్కాల్సింది అదే జరిగింది. మా బ్యాట్స్‌మన్లు అనుకున్నంత స్థాయిలో రాణించలేకపోయారు. భారత్ వికెట్లు కోల్పోయినప్పుడు తిరిగి పుంజుకోవడానికి ఇబ్బంది పడింది. వారి గేమ్ ప్రణాళికలు మంచి ఫలితాలిచ్చాయి. వారి ఆట తీరును ప్రశంసించాల్సిందే' అని మర్‌క్రమ్ అన్నాడు. భారత స్పిన్నర్లను ఎదుర్కోవడంలో సఫారీలు కష్టపడుతున్నారన్ని ఓ విలేకరి ప్రశ్నకు మర్‌క్రమ్ బదులిస్తూ సిరీస్‌లో భారత స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కొంటున్నామని అన్నారు. అయితే ఈ ప్రక్రియ ప్రాథమిక స్థాయిలో ఉందని సిరీస్ ముగిసేసరికి తాము అనుకున్న ఫలితాలను పొందుతాము అని అన్నారు.

ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ టాప్

దుబాయ్: దక్షిణాఫ్రికాతో ఐదో వన్డేలో గెలుపుతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ అగ్ర స్థానం మరింత పటిష్టమ యింది. ఒకవేళ సెంచూరియన్‌లో చివరి వన్డేలో దక్షిణాఫ్రికా గెలిచినప్పటికి భారత్ 121 పాయింట్లతో అగ్ర స్థానంలోనే ఉంటుంది. కాగా దక్షిణాఫ్రికా 119 పాయింట్లతో రెండో స్థానంలో ఉంటుంది. వన్డే సిరీస్ ప్రారంభంలో భారత్ 119 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా 121 పాయింట్లతో అగ్ర స్థానంలో ఉంది. ఐదో వన్డేలో భారత్, సఫారీలను 4-1 తేడాతో ఓడించి సిరీస్‌ను గెల్చుకోవడంతో భారత్ 122 పాయింట్లో అగ్రస్థానంలోకి ఎగబాకగా, దక్షిణాఫ్రికా 118 పాయింట్లకు పడిపోయింది. ఒక వేళ భారత్ 5-1 తేడాతో సిరీస్ ముగిస్తే.. భారత్‌కు 123 పాయింట్లు వస్తాయి. దక్షిణాఫ్రికా ఒక పాయింట్ కోల్పోయి 117 పాయింట్లకు పడిపోతుంది. మంగళవారం షార్జాలో జరిగిన మూడో వన్డేలో గెలిచిన ఆఫ్ఘనిస్తాన్ 10వ స్థానానికి ఎగబాకింది. ఆ స్థానంలో ఆఫ్ఘనిస్తాన్ కొనసాగాలంటే ఫిబ్రవరి 19న ముగిసే ఈ సిరీస్‌ను గెలవాల్సి ఉంటుంది. త్వరలో జరుగనున్న న్యూజిలాండ్, ఇంగ్లండ్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కూడా ఈ ర్యాంకులను ప్రభావితం చేస్తాయి. ఒకవేళ ఇంగ్లండ్ గెలిస్తే ఆ జట్టు రెండో స్థానంలోకి, సఫారీలు మూడో స్థానంలోకి వెళతారు. 2017 అక్టోబర్ నుంచి చూస్తే.. భారత్ వన్డే ర్యాంకింగ్‌లో అగ్ర స్థానంలోకి చేరడం ఇదే ప్రథమం.

విదేశాల్లో అతిపెద్ద విజయమిది: రోహిత్



పోర్ట్ఎలిజబెత్: దక్షిణాఫ్రికాలో కొనసాగుతున్న వన్డే సిరీస్‌లో భాగంగా మంగళవారం ఐదో వన్డేలో సాధించిన విజయం వన్డేల్లో భారత్‌కు అతిపెద్ద విజయం అని బుధవారం మీడియాతో అన్నాడు. ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో.. ఐదో వన్డేను 73 పరుగుల తేడాతో గెలిచిన భారత్ సిరీస్‌లో 4-1 ఆధిక్యం సాధించింది. ఈ లీడ్‌తో సిరీస్‌ను కూడా భారత్ గెలుచుకుంది. కాగా ఈ వన్డేలో శర్మ 115 పరుగులు చేశాడు. 'విదేశాల్లో భారత్ సాధించిన అతి పెద్ద విజయం ఈ సిరీస్ గెలవడం. గతంలో ఆస్ట్రేలియాలో జరిగిన సిబీ ముక్కోణం సిరీస్(2007-08) కూడా ఇదే స్థాయిలో కఠినంగా ఉన్నప్పటికి అప్పుడు గెలిచాం. నా మట్టుకు అయితే ఈ రెండు సిరీస్‌ల ను పోల్చడం కష్టమే. మా జట్టుకు ఈ సిరీస్ అత్యంత ముఖ్యం. తొలి మ్యాచ్ నుంచే మేము ఆధిక్యాన్ని చాటాము. ఫలితం ఇప్పుడు కనిపిస్తోంది' అని రోహిత్ శర్మ అన్నాడు. దక్షిణాఫ్రికాలో వన్డే సిరీస్‌ను గెలవడానికి 25 ఏళ్లు పట్టింది. దక్షిణాఫ్రికాలో క్రికెట్ ఆడటం అంత సులభం కాదు. అయినప్పటికి మా జట్టు విజయం సాధించడం, దీని వెనుక యువ క్రీడాకారుల ప్రతిభ ఉందని శర్మ చెప్పారు. ఆడటానికి అవకాశం దొరికిన ఆటగా ళ్లంతా దక్షిణాఫ్రికా విసిరిన సవా ళ్లను ఎదుర్కొ నడానికి సిద్ధమ య్యారు. వన్డే సిరీస్‌లో భారత్, అత్యున్నత ప్రదర్శనతో ఆకట్టుకున్నది. ఇది మాలో ఆత్మ విశ్వాసాన్ని నింపింది అని శర్మ వ్యాఖ్యానిం చారు. టెస్టు సిరీస్‌పై మాట్లాడుతూ.. టెస్టు సిరీస్‌లో కూడా మా జట్టు బాగా ఆడింది. దక్షిణాఫ్రికాను చివరి టెస్టులో ఓడించింది. ఏమైనప్పటికి వన్డే సిరీస్‌లో సాధించిన విజయం చిరస్మరణీయ గుర్తుగా మిగిలిపోనుందని రోహిత్ అన్నారు.

రబాడా మ్యాచ్ ఫీజులో 15% కోత



దుబాయ్: దక్షిణాఫ్రికా పేస్ బౌలర్ కగిసో రబాడా మ్యాచ్ ఫీలో ఐసీసీ 15 శాతం కోత విధించింది. పోర్ట్ ఎలిజబెత్‌లో జరిగిన ఐదో వన్డేలో భారత ఓపెనర్ శిఖర్ ధావన్ ఔటయిన తర్వాత రబాడా, ధావనుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. 8వ ఓవర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. రబాడా తన బౌలింగ్‌లో ధావన్‌ను ఔట్ చేసిన అనంతరం అమర్యాధకరంగా ప్రవర్తిస్తూ పెవిలియన్‌కు వెళుతున్న ధావనుద్దేశించి సంజ్ఞలు చేయడమేకాక, అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఈ నేపథ్యంలో ఫీల్డ్ అంపైర్లు ఇయాన్ గౌల్డ్, షువాన్ జార్జి, మూడో అంపైర్ అలీం దార్, ఫోర్త్ అంపైర్ బొంగాని జెలిలు ఆటగాళ్ల కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.1.7 కింద ఐసీసీ ఎదుట చార్జిషీట్‌ను దాఖలు చేశారు. బుధవారం ఐసీసీకి చెందిన ఆండీ పైక్రాఫ్ట్ నేతృత్వంలోని అత్యున్నత రెఫ్రీల ప్యానెల్ ఈ ఘటనపై విచారించి రబాడా మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత పెట్టడమేకాక, ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ లెవల్1 నిబంధనను అతిక్రమించాడని పేర్కొంటూ ఒక డిమెరిట్ పాయింట్‌ను ఆయన ప్రొఫైల్‌కు జత చేసింది. రబాడా ఇప్పటివరకు ఐదు డీమెరిట్ పాయింట్లను పొందాడు. రబాడా తాను చేసిన తప్పును, ప్యానెల్ విధించిన శిక్షను కూడా అంగీకరించాడు. ఒకవేళ రబాడాకు ఏడాదిలో 8 లేదా అంతకంటే ఎక్కువ డీ మెరిట్ పాయింట్లు వస్తే రెండు టెస్టులు, ఒక టెస్టు, రెండు వన్డేలు/టీ20లు లేదా నాలుగు వన్డేలు/టీ20లకు దూరమవుతాడు. ఈ రెండిట్లో ఏది ముందైతే అది అమల్లోకి వస్తుంది.

దక్షిణాఫ్రికాలో వన్డే సిరీస్ ఫలితాలు

పోర్ట్ ఎలిజబెత్: దక్షిణాఫ్రికాలో భారత్ ఆడిన వన్డే సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్క సిరీస్‌ను కూడా గెలవలేదు. తొలిసారిగా 1992-93లో భారత్ సఫారీ గడ్డపై ఆడిన ఐదు వన్డేల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 5-2 తేడాతో సిరీస్ చేజిక్కించుకుంది. తిరిగి 2006-07తో దక్షిణాఫ్రికాలో పర్యటించిన భారత జట్టు 0-4 తేడాతో సిరీస్‌ను సఫారీలకు కోల్పోయింది. ఒక మ్యాచ్ రద్దయింది. తిరిగి 2011-12లో జరిగిన పర్యటనలో దక్షిణాఫ్రికా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-2 తేడాతో చేజిక్కించుకుంది. 2013-14లో జరిగిన వన్డే సిరీస్‌లో 2-0 తేడాతో సఫారీలు గెలిచారు. ఒక వన్డేలో ఫలితం తేలలేదు. ఈ అన్ని పర్యటనల్లో దక్షిణాఫ్రికాపై వరసగా మూడు వన్డేల్లో గెలవలేకపోయింది. తాజా పర్యటనలో ఈ రెండు రికార్డులను కోహ్లీ సేన సాధించింది.



కామన్‌వెల్త్ గేమ్స్ టికెట్లలో తప్పులు

సిడ్నీ: ఆస్ట్రేలియాలో గోల్డ్‌కోస్ట్ సిటీ ఆతిథ్య మిస్తున్న 2018-కామన్‌వెల్త్ గేమ్స్ ప్రారంభోత్సవం రోజుకు సంబంధించి ముద్రించిన టికెట్లలో తప్పులు దొర్లాయి. సుమారు 14వేల టికెట్లపై ప్రారంభోత్సవ రోజు ఏప్రిల్ 4 బుధవారానికి బదులు ఏప్రిల్ 4 గురువారం అని ముద్రితమైంది. ఈ విషయంపై క్రీడల నిర్వాహక చీఫ్ మార్క్ పీటర్స్ మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. టికెట్లు అమ్మే టికెటిక్ ఈ విషయాన్ని మాకు తెలిపాడు. అని పీటర్స్ వెల్లడించాడు. అయితే వీటిని పునర్ముద్రించే ఆలోచన తమకు లేదన్నాడు. తప్పును సవరించే బదులు టికెట్లు కొన్న వారందరికోసం.. ఈ టికెట్లతో ప్రారంభోత్సవం రోజు స్టేడియంలోకి రావచ్చని మేము ప్రత్యేక ప్రకటనలు జారీచేస్తాం అని పీటర్స్ వెల్లడించారు. మరోవైపు గోల్డ్ కోస్ట్ బులెటిన్ మరో సమస్యను బుధవారం బహిర్గతం చేసింది. వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, ట్రయథ్లాన్ టికెట్లలో తప్పుడు సమయం ముద్రించి పంపారని పేర్కొంది. కామన్ వెల్త్ గేమ్స్, ఒకప్పటి బ్రిటిష్ పాలిత దేశాలు స్వచ్ఛందంగా పాల్గొనే వేదిక. ప్రస్తుతం జరుగుతున్న క్రీడలు ఇరువై ఒకటవ క్రీడల ఈవెంట్. ఆస్ట్రేలియాలోని ఈశాన్య భాగంలో ఉన్న గోల్డ్ కోస్ట్ పట్టణంలో ఏప్రిల్ 4 నుంచి 15 వరకు జరుగనున్నాయి.

కామన్‌వెల్త్ గేమ్స్‌కు రుడిషా, అస్బెల్ దూరం

నైరోబి: 800 మీటర్ల పరుగులో కెన్యా ఒలింపిక్ ఛాంపియన్, ప్రపంచ రికార్డు సాధించిన ఆటగాడు డేవిడ్ రుడిషా, 1500 మీటర్ల పరుగులో రెండు సార్లు ఒలింపిక్ ఛాంపియన్ అస్బెల్ కిప్రాప్ ఆస్ట్రేలియాలో ఏప్రిల్ 4-15 మధ్య జరుగనున్న కామన్‌వెల్త్ గేమ్స్‌కు దూరంగా ఉండాలనుకుంటున్నారు. శనివారం నైరోబిలో ఒకరోజు శిక్షణకోసం 170 మంది కూడిన ఆదేశ అథ్లెట్ల జట్టును కెన్యా బోర్డు ఆహ్వానించింది. ఈ శిక్షణలో తొలి 3స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు ఆటోమేటిక్‌గా కామన్‌వెల్త్ గేమ్స్‌కు ఎంపికవుతారు. అయితే కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహిస్తున్న సమయం వేసవి ప్రారంభకాలం కావడంతో ఇది ట్రాక్ శిక్షణకు అనుగుణంగా ఉండదని అథ్లెట్ల భావిస్తున్నారు. ఈ ఈవెంట్‌లో ఆడటమా లేదా ఈ సీజన్ అనంతరం వచ్చే పోటీలకోసం ప్రాక్టీస్‌కే పరిమితం కావడమా అన్న సందిగ్ధంలో పడ్డారు. రుదిషా, కిప్రాప్‌లు మేలో దోహాలో జరుగనున్న అత్యం పారితోషకం లభించే డైమండ్ లీగ్‌పై తమ దృష్టిని కేంద్రీకరించారని కెన్యా జట్టు అధికారులు వెల్లడించారు. ఈ శిక్షణకు గైర్హాజరైన వారిలో ప్రపంచ అథ్లెట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో 10వేల మీటర్ల పరుగులో రజత పతక విజేత జెఫ్రీ క్యామ్‌వొరర్ ఉన్నాడు. జెఫ్రీ మార్చి 24 వ్యాలెన్సియాలో ప్రపంచ హాఫ్ మారథాన్‌కోసం సిద్ధమవుతున్నాడు. కాగా మహిళల 1500 మీటర్ల పరుగులో ఒలింపిక్, ప్రపంచ ఛాంపియన్ ఫెయిత్ చెప్నిజిటిక్ కిప్యెగొన్ గర్భంతో ఉండటంతో కామన్‌వెల్త్ క్రీడల్లో ఆడలేక పోతున్నారు. ప్రపంచ హాఫ్ మహిళా మారథాన్ డిఫెండింగ్ ఛాంపియన్ పెరెస్ జెప్‌చిర్చిర్ కూడా మెటర్నిటీ సెలవులో ఉండగా, మహిళా 800 మీటర్ల పరుగులో ఛాంపియన్ జానెత్ జెప్‌కోస్గెయ్ తన తొలి బిడ్డకు జన్మనిచ్చిన అనంతరం తిరిగి క్రీడల్లోకి అడుగిడనుంది. 2014 గ్లాస్కోలో జరిగిన కామన్ వెల్త్ గేమ్స్‌లో కెన్యా పతకాల పట్టికలో 10 స్వర్ణాలు, 10 రజతాలు, 5 కాంస్య పతకాలతో అగ్ర భాగాన నిలిచింది.

ముంబైలో ఈ నెల 10,11 తేదీల్లో 23వ ఏసియన్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ బంగారు పథకాలు గెలుచుకున్న ఖమ్మం జిల్లా, కల్లూరు చెందిన గురుకుల పాఠశాల విద్యార్థులు.



జాతీయ సీనియర్ మహిళా ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్

తమిళనాడు విజేత



కటక్: జాతీయ సీనియర్ మహిళా ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ లో భాగంగా బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తమిళనాడు జట్టు డిఫెండింగ్ ఛాంపియన్ మణిపూర్‌ను 2-1 గోల్స్ తేడాతో ఓడించి టైటిల్‌ను గెలుచుకుంది. తమిళనాడు ఫుట్‌బాల్ చరిత్రలోనే ఆ రాష్ట్ర మహిళ జట్టు ఛాంపియన్‌షిప్‌ను గెలవడం ఇదే ప్రథమం. ఆట ప్రథమార్థం మూడో నిమిషంలో తమిళనాడు క్రీడాకారిణి ఇందు మతి తొలి గోల్ చేయగా, ఆట 40వ నిమిషంలో ఇంద్రాని రెండో గోల్‌ను చేసింది. కాగా మణిపూర్ క్రీడాకారిణి రతన్‌బాల ఆట 57వ నిమిషంలో తన జట్టుకు గోల్‌చేసి తమిళనాడు ఆధిక్యాన్ని 2-1 తగ్గించింది. ఇందుమతి ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్ అవార్డుతో పాటు, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా అవార్డును పొందింది. ఆట ఆద్యంతం ఇందుమతి ప్రత్యర్థి గోల్ పోస్ట్ పై దాడులను కొనసాగించింది. మణిపురి డిఫెన్సివ్ ఆటగాళ్లు ఇందుమతిని నిలువరించడానికి ప్రయత్నించినప్పటికి వారిని ఛేదించుకొని ఇందుమతి బంతిని గోల్ పోస్ట్‌వైపు మళ్లించింది. అనంతరం కోలుకున్న మణిపూర్ క్రీడాకారిణులు తమిళనాడు గోల్ పోస్ట్‌లపై దాడులను సాగించారు. మణిపూర్‌కు చెందిన బాలా దేవి ఆట 25 నిమిషంలో బంతిని గోల్ చేయడానికి ప్రయత్నించగా గోల్ కీపర్ అడ్డుకుంది. అనంతరం రతన్‌బాలకూడా బంతిని గోల్‌వైపు కిక్ చేయగా అది నేరుగా గోల్ కీపర్ చేతుల్లోకి వెళ్లింది. ఆట అర్ధ సమయం గడిచేసమయానికి మణిపూర్ స్కోరును సమానం చేయడానికి అత్రుత పడింది. తమిళనాడు క్రీడాకారిణి ఇంద్రాణి మరో గోల్ చేయగా తమిళనాడు 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆట రెండవ భాగంలో 57వ నిమిషంలో మణిపూర్ క్రీడాకారిణి రతన్‌బాలపుంజుకుని తమిళనాడు డిఫెన్సివిను దాటుకుని గోల్ చేయడంతో తమిళనాడు ఆధిక్యం 2-1కు తగ్గింది. అనంతరం ఇరుజట్లు గోల్స్ చేయటానికి ప్రయత్నించినప్పటికి అవి సక్సెస్ కాలేకపోయాయి.

విజేత జట్టుకు ఏఐఎఫ్ఎఫ్ ఉపాధ్యక్షుడు సుబ్రతా దత్త భినందనలు

ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎఫ్ఎఫ్ ఉపాధ్యక్షుడు సుబ్రతా దత్త టైటిల్ గెలిచిన తమిళనాడు జట్టుకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. దేశంలో మిగతా జట్లు తమిళనాడునుంచి స్ఫూర్తిని పొందాలని తెలిపాడు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.